

PRAJASAKTI Regd.No. 15795/68

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

సిటీ◆

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 45 సంచిక : 15 | విజయవాడ, శుక్రవారం 15 ఆగస్టు 2025 | 10 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Friday 15 August 2025 | Rs





బిసి జాబితాలో 'దొమ్మర (గిరి బలిజ)'గా మార్పు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

బిసి జాబితాలోని 'దొమ్మర' పేరును దొమ్మర (గిరి బలిజ)గా మార్పు చేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు బిసి సంక్షేమ శాఖ గతంలో ఇచ్చిన ఉత్తర్వులను సవరిస్తూ ఆ శాఖ కార్యదర్శి ఎస్.సత్యనారాయణ తాజాగా గురువారం ఉత్తర్వులు ఇచ్చారు. 1970లో ఇచ్చిన ఉత్తర్వుల్లో బిసి జాబితాలోని కేటగిరి 'ఎ'లో ఉన్న 'దొమ్మర' పేరును దొమ్మర (గిరి బలిజ)గా సవరణ చేశారు. దొమ్మర అనే పదాన్ని దుర్భాషలాడేందుకు ఉపయోగిస్తున్న కారణంగా ఆ వర్గానికి చెందిన వ్యక్తుల మనోభావాలు దెబ్బతింటున్నట్లు, ఆత్మగౌరవాన్ని దిగజార్చే విధంగా ఉన్నట్లు ఆ వర్గానికి చెందిన కొందరు ప్రభుత్వం దృష్టికి తీసుకురావడంతో, ఈ అంశాన్ని పరిశీలించి పేరులో మార్పు చేసినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ఎన్‌కౌంటర్‌లో మావోయిస్టు నేత సుగులూరి చిన్నన్న మృతి

ప్రజాశక్తి - ఆత్మకూర్

ఛత్తీస్‌గఢ్‌లో బుధవారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో నంద్యాల జిల్లా ఆత్మకూరు మండలం వడ్ల రామాపురం గ్రామానికి చెందిన సుగులూరి చిన్నన్న (57) అలియాస్ నాగన్న, అలియాస్ విజయ్ మృతి చెందినట్లు సమాచారం. చిన్నన్నకు భార్య ఇద్దరు కుమారులు ఉన్నారు. వడ్ల రామాపురం గ్రామానికి చెందిన చిన్నన్న 1992లో సాధారణ గ్రామ రైతు కూలీ సంఘం సభ్యుడిగా పనిచేస్తున్న నేపథ్యంలోనే విప్లవ ప్రస్థానం మొదలుపెట్టారు. రైతు కూలి సంఘం ఏరియా కమిటీ అధ్యక్షుడిగా భవనాసి నక్సలైట్ దళ సభ్యుడిగా, భవనాసి కమాండర్‌గా పనిచేశారు. నక్సలైట్ల ఉద్యమంలో వివిధ కమిటీలలో ఆయన పని చేశారు. ప్రస్తుతం రాజ్‌నందుగావు కాంకేర్ సరిహద్దు స్పెషల్ జోనల్ కమిటీ సభ్యుడిగా ఉన్నారు. చిన్నన్న మతి చెందిన విషయం వడ్లరామాపురం గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. చిన్నన్నపై రూ.25 లక్షల రివార్డు ఉన్నట్లు తెలుస్తోంది. మృతదేహాన్ని తీసుకురావడానికి ఆయన కుమారుడితోపాటు మరికొందరు ఛత్తీస్‌గఢ్ వెళ్లినట్లు సమాచారం. చిన్నన్న మృతదేహాన్ని శనివారం వడ్ల రామాపురానికి తీసుకురావచ్చని కుటుంబ సభ్యులు తెలిపారు.

ఆర్‌కె బీచ్‌లో విషాదం


- సముద్రంలో మునిగి సికింద్రాబాద్ మహిళ మృతి
- రక్షించడానికి వెళ్లిన వ్యక్తి గల్లంతు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ, కలెక్టరేట్ (విశాఖపట్నం)

విశాఖపట్నం ఆర్కే బీచ్‌లో గురువారం సాయంత్రం తీవ్ర విషాదం చోటుచేసుకుంది. సికింద్రాబాద్ నుంచి వివాహ వేడుకకు వచ్చిన కుటుంబంలో ఇద్దరు సభ్యులు సముద్రపు అలలకు కొట్టుకుపోతుండగా వారిని కాపాడేందుకు వెళ్లిన మరొక వ్యక్తి గల్లంతయ్యాడు. ఈ సంఘటన మూడో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సికింద్రాబాద్‌కు చెందిన ఐదుగురు సభ్యుల బృందం సింహాచలం ప్రాంతానికి పెళ్లి నిమిత్తం వచ్చింది. అక్కడి నుండి సాయంత్రం ఆర్కే బీచ్‌కి చేరుకుంది. స్నానానికి దిగగా అలలు తాకిడికి టి.వసంత (58), సాయికృష్ణ సముద్రంలోకి కొట్టుకు పోయారు. వారిని రక్షించేందుకు ఒడిశాకు చెందిన గోవింద వెళ్లాడు. దీంతో, వారంతా సముద్రంలో చిక్కుకున్నారు. అప్రమత్తమైన మొరైన్ పోలీసులు, లైఫ్ గార్డ్స్ వసంత, సాయికృష్ణలను ఒడ్డుకు చేర్చారు. అప్పటికే వసంత మృతి చెందారు. సాయికృష్ణను వైద్యం నిమిత్తం కెజిహెచ్‌కు తరలించారు. గల్లంతైన గోవింద కోసం గాలిస్తున్నారు. అతడు పెందుర్తి ప్రాంతంలోని ప్రాన్స్ కంపెనీలో వర్కర్‌గా పని చేస్తున్నారని అధికారులు తెలిపారు.

అన్ని శాఖల్లోనూ ఆదాయం పెరగాలి

- నిర్మాణ సంస్థలు రాష్ట్రంలోనే ఇంధనం కొనేలా చూడండి
- సమీక్షలో సిఎం ఆదేశం



ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

గతంతో పోలిస్తే ఆదాయార్జన శాఖలన్నీ ప్రస్తుత ఆర్థికసంవత్సరంలో మెరుగ్గా పనిచేయాలని, అన్ని శాఖల ఆదాయం పెరగాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అన్నారు. వివిధ ఆదాయ వనరుల శాఖల అధికారులతో గురువారం ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. రెవిన్యూ, మున్సిపల్ ఆదాయం, మద్యం, వాణిజ్య పన్నుల శాఖ, రవాణా వంటి శాఖల అదాయ పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో మరింతగా ఆదాయం పెంచడంపై దృష్టి సారించాలని చెప్పారు. రాష్ట్రంలో భారీగా నిర్మాణ పనులు చేపట్టిన సంస్థలు తమ వాహనాలకు ఇతర రాష్ట్రాల నుండి ఇంధనాన్ని కొనుగోలు చేస్తున్నాయని,. ఆ పద్ధతిని మార్చాలని సిఎం అన్నారు. నిర్మాణ సంస్థతుల తమ భారీ వాహనాలకు రాష్ట్రంలోనే ఇంధన నింపేలా చూడాలన్నారు. ఇలా చేయడం వల్ల కొంత మేర ఆదాయం పెరుగుతుందన్నారు. కేంద్ర నిధుల రాక, కేంద్ర పన్నుల్లో రాష్ట్ర వాటా నిధుల పైనా ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. సేవల రంగంలో ఎక్కువ పన్నులు వచ్చే అవకాశం ఉంటుందని, దానిపైనా శ్రద్ధ చూపించాలని సూచించారు. ఆదాయాన్ని పెంచేందుకు సాంకేతికతను కూడా వినియోగించాలని సూచించారు.మద్యం ఆదాయంపై ఆ శాఖ అధికారులు వివరిస్తూ గతం కన్నా ఆదాయం పెరగిందని చెప్పారు. కొత్త మద్యం విధానం వల్ల వచ్చే ఆదాయంపైనా ముఖ్యమంత్రికి వివరించినట్లు తెలిసింది. దీనిపై చంద్రబాబు స్పందిస్తూ మద్యం ఆదాయం కన్నా ప్రజల ఆరోగ్యమే ప్రభుత్వానికి ముఖ్యమన్నారు. అయితే ఇతర రాష్ట్రాల నుంచి తరలివచ్చే మద్యాన్ని అడ్డుకోవాలని, తద్వారా రాష్ట్ర ఆదాయానికి గండి పడకుండా చూడవచ్చునని ఆయన సూచించారు.

భూముల క్రయవిక్రయాలపై దృష్టి

రాష్ట్ర వ్యాప్తంగా భూముల రిజిస్ట్రేషన్లు, వాటి క్రయ విక్రయాలను శాస్త్రీయంగా విశ్లేషించాలని రిజిస్ట్రేషన్ల శాఖ అధికారులకు సిఎం సూచించారు. ఆర్థిక లావాదేవీలకు అనుగుణంగానే రిజిస్ట్రేషన్ల విలువ ఉండాలన్నారు. అంతే తప్ప భూమి విలువను ఇష్టానుసారంగా పెంచుకుంటూ పోవడం సరికాదని వ్యాఖ్యానించారు. మార్కెట్ విలువ, ఆస్తి డేటా కోసం డేటా అనలటిక్స్‌ను వినియోగించుకోవాలని సూచించారు. భూముల వివరాలను జిఐఎస్ ద్వారా మ్యాపింగ్ చేయాలని, సరిహద్దులను పక్కాగా గుర్తించాలని సూచించారు.

మున్సిపాల్టీల్లో ఆటో మ్యూటేషన్

అన్ని మున్సిపార్టీలు, కార్పొరేషన్లలో ఆర్‌టిజిఎస్ నుంచి సేకరించే వివరాలతో ఆటో మ్యూటేషన్ చేయాలని స్పష్టం చేశారు. మున్సిపల్ రికార్డుల్లో తప్పులను సవరించి జియో ట్యాగింగ్ చేయాలన్నారు. ఆధార్, మొబైల్, విద్యుత్ బిల్లుల డేటాను అనుసంధానం చేయడం ద్వారా పన్నుల వసూళ్లను పకడ్బందీగా అమలు చేయాలని సూచించారు.

ఉక్కు కార్మికుల సమస్యలు పరిష్కరించడండి

- స్టీల్‌ప్లాంట్ ప్రధాన పరిపాలన భవనం ఎదుట సంతకాల సేకరణ

ప్రజాశక్తి - ఉక్కునగరం (విశాఖపట్నం)



ఉక్కు కార్మికుల సమస్యలను పరిష్కరించాలం టూ విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రధాన పరిపాలన భవనం ఎదుట స్టీల్‌ప్లాంట్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యాన గురువారం సంతకాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా సంఘం గౌరవాధ్యక్షులు జె.అయోధ్య రామ్ మాట్లాడుతూ ఉక్కు కార్మికులకు నేటి వరకూ బకాయిపడ్డ 330 శాతం వేతనాన్ని తక్షణమే చెల్లించాలని, ప్రతి నెలా పూర్తి జీతాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్లాంట్‌కు ప్యాకేజీ ఇచ్చామని, దానిలో ఉక్కు కార్మికుల జీతాలు కూడా ఉన్నాయని కేంద్ర ఉక్కు సహాయ మంత్రి ప్రకటించినప్పటికీ స్టీల్ ప్లాంట్ యాజమాన్యం దుర్మార్గంగా వ్యవహరిస్తూ కార్మికుల వేతనాలను చెల్లించడం లేదన్నారు. బ్లాస్ట్ ఫర్నేస్ -3ని ప్రారంభించి, ఉత్పత్తి తీయగానే పూర్తి జీతాలు ఇస్తామని యాజమాన్యం హామీ ఇచ్చి మోసం చేసిందని తెలిపారు. పూర్తి జీతాలు చెల్లించకపోవడంతో కార్మికులు ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నారన్నారు. సంఘం ప్రధాన కార్యదర్శి యు.రామస్వామి మాట్లాడుతూ యాజమాన్యం కార్మికుల పట్ల ఏకపక్ష నిర్ణయాలు తీసుకుంటోందని తెలిపారు. లేబర్ కమిషనర్ ఎదుట ఒప్పుకున్న హెచ్‌ఆర్‌ఎ చెల్లించడంలోనూ జాప్యం ఎందుకని ప్రశ్నించారు. ఉక్కు నగరంలో నివసిస్తున్న కార్మికుల పట్ల నిరంకుశంగా వ్యవహరిస్తోందని, విద్యుత్ ఛార్జీలు పెంచడమే దీనికి నిదర్శనమని పేర్కొన్నారు. కార్మికులకు నిలుపుదల చేసిన సౌకర్యాలను తక్షణమే పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. సంఘం అధ్యక్షులు వైటి.దాస్ మాట్లాడుతూ ప్లాంట్‌లో యంత్రాల మరమ్మతులు సకాలంలో చేయడం లేదని తెలిపారు. దీంతో కార్మికులు ప్రమాదాల బారిన పడి ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు పి.శ్రీనివాసరాజు, తౌడన్న, అప్పలరాజు, శ్రీనివాసరెడ్డి, నర్సింగరావు, శ్రీనివాస్, రామన్న పాల్గొన్నారు.



వసతి గృహాన్నిప్రారంభిస్తున్న నందమూరి బాలకృష్ణ

విద్యాభివృద్ధికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం

- ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ

ప్రజాశక్తి-చిలమత్తూరు 'శ్రీ సత్యసాయి జిల్లా)

రాష్ట్రంలో విద్యాభివృద్ధి కోసం ప్రభుత్వం పూర్తి స్థాయిలో ప్రాధాన్యతనిస్తోందని హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ అన్నారు. శ్రీ సత్యసాయి జిల్లా చిలమత్తూరు మండల పరిధిలోని టేకులోడు మహాత్మ జ్యోతిరావు పూలే గురుకుల పాఠశాలలో రూ.8.65 కోట్లతో నిర్మించిన వసతి గృహం, కంప్యూటర్ ల్యాబ్‌ను ఆయన గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా బాలకృష్ణకు విద్యార్థినులు రాఖీలు కట్టి స్వాగతం పలికారు. అనంతరం నియోజకవర్గంలోని మహిళా సంఘాలకు రూ.46.70 కోట్ల విలువైన చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన పులివెందుల జడ్‌పిటిసి ఎన్నికల ఫలితాలపై మీడియాతో మాట్లాడారు. ఎన్నికలు ప్రజాస్వామ్య బద్ధంగా జరిగాయన్నారు. ప్రజలు టిడిపి కూటమి వైపు నిలబడి స్పష్టమైన తీర్పు ఇచ్చారని తెలిపారు. ప్రజలు తమ ఓటు హక్కును ధైర్యంగా వినియోగిం చుకున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో హిందూపురం మున్సిపల్ చైర్మన్ రమేష్, ఎస్‌సి కార్పొరేషన్ డైరెక్టర్ బేకరీ గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

నీటి నిర్వహణలో సాగునీటి సంఘాల భాగస్వామ్యం

- ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

నీటి వనరుల నిర్వహణలో సాగునీటి సంఘాల భాగస్వామ్యం ఉండాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అన్నారు. గురువారం రాష్ట్ర సచివాలయం నుండి సాగునీటి సంఘాలు, జిల్లా కలెక్టర్లు, అధికారులతో సిఎం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సాగునీటి సంఘాలు నీటిని తీసుకోవడమే కాదని, నీటి సంరక్షణ, భూగర్భ జలాల పెంపు వంటి అంశాలపై బాధ్యత తీసుకోవాలని పేర్కొన్నారు. సమర్థ నీటి నిర్వహణతో రాష్ట్రంలో ప్రాజెక్టుల్లో నీటిని నిల్వ చేసుకున్నట్లు తెలిపారు. రిజర్వాయర్లు, బ్యారేజీల్లో మొత్తంగా 82.29 శాతం మేర నీటిని నింపుకో గలిగామని వివరించారు. ఎగువ నుండి వస్తున్న వరదతో పాటు రాష్ట్రంలో పడుతున్న వర్షపునీటిని సమర్థవంతంగా రిజర్వాయర్లకు మళ్లించడంలో ప్రభుత్వం విజయవంతం అయిందని పేర్కొన్నారు. హంద్రీ నీవా ద్వారా రాయలసీమలో ప్రాజెక్టులు నింపామని వివరించారు. . నీటిని ఒడిసి పట్టి ప్రాజెక్టులను ఎలా నింపామో అదే విధంగా గ్రామాల్లో చెరువులను కూడా నింపాలని అన్నారు. సాగునీరు, పంట కాలువలను సంరక్షించుకోవాలని అన్నారు. రైతుల భాగస్వామ్యం కోసమే సాగునీటి సంఘాలను పెట్టామని, కృష్ణా, గోదావరి నదుల్లో పెద్దఎత్తున నీరు సముద్రంలోకి వెళుతోందని తెలిపారు. కొన్ని ప్రాతాల్లో వర్షాలు వరదలు వస్తుంటే కొన్ని ప్రాంతాల్లో వర్షాభావ పరిస్థితులు ఉన్నాయని పేర్కొన్నారు. రాష్ట్రంలో 17 శాతం లోటువర్షపాతం నమోదైందని, ప్రతి ఎకరాకూ నీరు అందేలా చూడాలని అన్నారు. మొత్తం 38 వేల మైనర్ ఇరిగేషన్ ట్యాంకుల ద్వారా భారీ ఎత్తున నీటిని నిల్వ చేసుకోవచ్చని, రైతుల కోసం, నీటి నిర్వహణ పరిరక్షణ కోసమే సాగునీటి సంఘాలను ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. అదే స్ఫూర్తితో సంఘాలు పనిచేయాలని పేర్కొన్నారు.

జిల్లాల వారీగా రేటింగ్

చెరువులు, కాల్వలు, చెక్‌డ్యాముల పరిస్థితిని సాగు నీటి సంఘాలు పరిశీలించాలని, ఆయకట్టు ప్రాంతాలే కాకుండా క్యాచ్‌మెంట్ ఏరియా బాధ్యతలనూ కూడా సాగునీటి సంఘాలకు అప్పగిస్తామని సిఎం తెలిపారు. సంరక్షణ చేయాల్సి వస్తే అధికారులతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. మరమ్మతులు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. వరద నీటి పారుదలకు ఇబ్బంది లేకుండా కాల్వల నిర్వహణ చేపట్టాలని, చెరువులు, కాల్వలు ఏర్పాటు చేసుకోవడం ఎంత ముఖ్యమో నిర్వహణ చేపట్టడమూ అంతే ముఖ్యమని వివరించారు. గత ప్రభుత్వంలో కనీసం షట్టర్లు, గేట్ల నిర్వహణ కూడా సరిగా చేయలేదని తెలిపారు.

భూగర్భ జలాల పెంపుతో మంచి ఫలితాలు

రాష్ట్రంలో 1000 టిఎంసిల సర్ఫేస్ వాటర్ ఉండాలని, భూగర్భ జలాలు పెరగాలని, భూమిని జలాశయంగా మార్చుకోవాలని సిఎం తెలిపారు. నీరు లేకపోతే వేయి అడుగుల నుండి తోడుకోవాల్సి వస్తుందని అన్నారు. సాగునీటి సంఘాలు భూగర్భ జలాలు పెంచే బాధ్యతనూ తీసుకోవాలని అన్నారు. రాష్ట్రంలో 40 లక్షల ఎకరాలు బోర్‌వెల్స్ మీద ఆధారపడ్డాయని, 19 లక్షల బోర్లు ఉంటే వాటి కోసం రూ.8,250 కోట్లు విద్యుత్ ఖర్చు పెట్టాల్సి ఉంటుందని అన్నారు. భూగర్భ జలాలను సమర్థవంతంగా వినియోగించుకుంటే 50 శాతం ఖర్చును తగ్గించుకోవచ్చని అన్నారు. నదీతీర ప్రాంతంలో ఉన్న కొన్ని జిల్లాల్లో భూగర్భ జలాలపై దృష్టి పెట్టడం లేదని, తూర్పు గోదావరి, ఏలూరు, ప్రకాశం వంటి జిల్లాల్లో భూగర్భ జలాలు పెరగాలని అన్నారు.

పునర్వినియోగ వస్తువులకు ప్రోత్సాహం

- ముఖ్య కార్యదర్శి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

వచ్చే ఏడాది జూన్ నాటికి రాష్ట్రాన్ని సింగిల్ యూజ్ ప్లాస్టిక్ రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దే లక్ష్యంతో స్టీల్ బాటిల్స్, జూట్ బ్యాగ్గుల వినియోగాన్ని ప్రోత్సహిస్తున్నట్లు పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి ఎస్.సురేష్ కుమార్ తెలిపారు. రాష్ట్ర సచివాలయంలో మెప్మా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జూట్ బ్యాగ్ స్టాల్‌ను ఆయన గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. నేటి నుంచి సచివాలయంలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ రహితంగా రాష్ట్ర సచివాలయాన్ని తీర్చిదిద్దాలనే ఉద్దేశంతో జూట్ బ్యాగ్‌లను అందుబాటులోకి తెచ్చామన్నారు. లక్ష్య సాధనకు మిషన్ మోడ్‌లో అమలు చేసే విధంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఈ కార్యచరణలో భాగంగానే తొలుత రాష్ట్ర సచివాలయంలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగాన్ని నిషేధించినట్లు వెల్లడించారు. పునర్వినియోగ, బయోడిగ్రేడబుల్ వస్తువుల వినియోగాన్ని ప్రోత్సహింఏలా చర్యలు చేపట్టామన్నారు. సచివాలయంలోని అన్ని బ్లాక్‌ల్లో తాగునీరు అందుబాటులో ఉండే విధంగా ఆర్‌ఓ ప్లాంట్లను ఏర్పాటు చేయడం జరుగుతుందని చెప్పారు. అదే విధంగా ఘన, ద్రవ, ఇ-వ్యర్థాలను మూడు రకాల చెత్త బుట్టల్లో సేకరించనున్నట్లు తెలిపారు. ఈ సమగ్ర కార్యాచరణ ప్రణాళికను స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ సహకారంతో అమలు చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మె ఎండి తేజ్ భరత్ తదితరులు పాల్గొన్నారు.

స్వేచ్ఛగా ఓటు వేసిన ప్రజలు

- జెపిటిసి ఉప ఎన్నికలపై మంత్రి లోకేష్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పులివెందులలో 30 ఏళ్ల తరువాత ప్రజాస్వామ్య ఎన్నికల ప్రక్రియలో ప్రజలు తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకున్నారని విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ తెలిపారు. కడప జిల్లాలోని పులివెందుల, ఒంటిమిట్టలకు జరిగిన జెపిటిసి ఉప ఎన్నికల ఫలితాలపై గురువారం సామాజిక మాధ్యమం ఎక్స్‌లో ఆయన స్పందించారు. ఆ ప్రాంత ప్రజలు వెనుకబాటు తనాన్ని కాకుండా పురోగతిని ఎన్నుకున్నారని పేర్కొన్నారు. పులివెందుల, ఒంటిమిట్టలలో విజయం సాధించిన టిడిపి అభ్యర్థులు లతారెడ్డి, కృష్ణారెడ్డిలకు అభినందనలు తెలిపారు. తమ అభ్యర్థులకు మద్దతు ఇవ్వడానికి పెద్ద సంఖ్యలో ప్రజలు తరలివచ్చారని కృతజ్ఞతలు తెలిపారు.

ఏడాది పాలనకు రెఫరెండం ఎన్నికల ఫలితాలు

- టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు వర్ల రామయ్య

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

కడప జిల్లాలోని పులివెందుల జెపిటిసి ఉప ఎన్నికల ఫలితాలు కూటమి ప్రభుత్వం ఏడాది పాలనకు రెఫరెండమని టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు వర్ల రామయ్య అన్నారు. టిడిపి కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ ఎన్నికల్లో ప్రజలు తమ ఓటు హక్కును వినియోగించుకోవడం ద్వారా ప్రజాస్వామ్యం గెలిచిందన్నారు. ఈ ఫలితాలు వైఎస్ కుటుంబానికి ఉన్న నిజమైన ప్రజాబలాన్ని బహిర్గతం చేశాయని చెప్పారు. వైసిపికి కనీసం డిపాజిట్ కూడా దక్కలేదని, ఆ పార్టీ అధినేత వైఎస్ జగన్ అసలు రాజకీయ పరిస్థితి ఈ ఫలితాలు ద్వారా బయటపడిందని చెప్పారు. జగన్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో 439 ఎంపిటిసి, 38 జెడ్‌పిటిసిలను ఏకగ్రీవంగా గెలుచుకోవడం ఆయన దౌర్జన్యాలు, అక్రమాలకు నిదర్శనమని విమర్శించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రజాస్వామ్యయుతంగా ఎన్నికలు జరగాలనే రాజకీయ నీతిని పాటిస్తుంటే, వైఎస్ జగన్ బెదిరింపులు, భయపెట్టడం ద్వారా రిగ్గింగ్ చేసుకునే సంస్కృతిని ప్రోత్సహించారని పేర్కొన్నారు. మద్యం కేసు ముప్పుగా మారుతుందనే భయంతో ప్రజల దృష్టిని మళ్లించడానికి జగన్ చంద్రబాబును ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారని విమర్శించారు.

ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేశారు

మాజీ మంత్రి పేర్ని నాని

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

పులివెందులలో ప్రజాస్వామ్యాన్ని కూటమి పాలకులు అపహస్యం చేశారని మాజీ మంత్రి పేర్ని నాని అన్నారు. చంద్రబాబునాయుడు, లోకేష్ ప్రజాస్వామ్యాన్ని చెరబట్టారని చెప్పారు. తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ ఎదుటే దొంగ ఓట్లు వేశారని తెలిపారు. రాష్ట్రంలో పోలీసు వ్యవస్థను అడ్డుపెట్టుకుని ఎన్నికలు జరపడమేమిటని ప్రశ్నించారు. అన్ని పార్టీల్లోనూ చంద్రబాబు మనుషులు ఉన్నారని తెలిపారు. 2019-24 మధ్యలో చంద్రబాబు అసెంబ్లీకి రాలేదని, జీతం తీసుకున్నారో లేదో చెప్పాలని అన్నారు. వైసిపి అభ్యర్థిని కూడా ఓటు వేయనీయకుండా అడ్డుకున్నారని విమర్శించారు. జమ్మలమడుగు, కమలాపురం నుండి వచ్చిన వారు ఓట్లు వేస్తే కమిషన్ కనీసం నోరెత్తకుండా ప్రజలముందు దోషిగా నిలబడిందని అన్నారు.

వైసిపి వారిని బయటకు రానీయలేదు : ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి

పులివెందుల, ఒంటిమిట్ట ఉప ఎన్నికల్లో వైసిపి కార్యకర్తలు, నాయకులను బయటకు రానీయకుండా అడ్డుకుని రిగ్గింగు చేసుకున్నారని వైసిపి ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి అన్నారు. పోలీసులను అడ్డుపెట్టుకుని దొంగ ఓట్లు వేయించుకోవడం కూడా గెలుపేనా అని ప్రశ్నించారు. ఎన్నికల కమిషన్, పోలీసు వ్యవస్థ కళ్లుండీ చూడలేని దుస్థితిలో ఉన్నాయని పేర్కొన్నారు. పోలింగుకు ముందు కేంద్రాలను మార్చి ఓటర్లను గందరగోళం చేశారని పేర్కొన్నారు. ఎన్నికల అక్రమాలపై 35 సార్లు ఫిర్యాదు చేశామని, అయినా స్పందన లేదని చెప్పారు.

అన్నదాతకు యూరియా కష్టాలు

- అందుబాటులో లేక అవస్థలు
- అదనపు వసూళ్లలో ప్రయివేటు డీలర్లు
- పురుగుల మందులు కూడా కొనుగోలు చేయాలని షరతులు



ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి


ఎరువుల కొరత రైతన్నను తీవ్రంగా వేధిస్తోంది. సరిపడా ఎరువులు అందుబాటులో ఉన్నాయని వ్యవసాయ అధికారులు ప్రకటనలు చేస్తున్నా యూరియా, డిఎపిలు మాత్రం రైతుకు అందడం లేదు. ప్రయివేటు వ్యాపారస్తులు బస్తాకు రూ.30 నుంచి రూ.50 అధికంగా వసూలు చేస్తూ పలు షరతులను విధిస్తున్నారు. యూరియా, డిఎపి తమ వద్ద కొనుగోలు చేస్తే పురుగుల మందులను కూడా కొనుగోలు చేయాలని ఖరాఖండిగా చెబుతున్నారు.

కాకినాడ జిల్లాలో 2.32 లక్షల ఎకరాల్లో సాగు కావాల్సి ఉండగా 1.75 లక్షల ఎకరాలలో మాత్రమే నాట్లు పూర్తయినట్టు అధికార గణాంకాలు చెబుతున్నాయి. మిగిలిన విస్తీర్ణంలో ఈ నెలాఖరులోగా నాట్లు పూర్తయ్యే అవకాశం ఉందంటూ అంచనా వేస్తున్నారు. జిల్లాలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు, ప్రయివేటు డీలర్లు, రైతు సేవా కేంద్రాల్లో 4,258 మెట్రిక్ టన్నుల యూరియా, 1,566 టన్నుల డిఎపి, 1,069 టన్నుల ఎంఒపి ఇలా అన్ని రకాల ఎరువులు కలిపి 14,758 మెట్రిక్ టన్నుల ఎరువులు ప్రస్తుతం అందుబాటులో ఉన్నాయని వ్యవసాయ శాఖ అధికారులు తెలిపారు. ప్రస్తుతం రైతుల అవసరాలకు ఇవి సరిపోతాయని చెబుతున్నారు. తమకు కావాల్సిన ఎరువులను పూర్తి స్థాయిలో ప్రభుత్వం సరఫరా చేయలేకపోతుందంటూ పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్న పరిస్థితి అనేక చోట్ల కనిపిస్తుంది. అవసరానికి మించి ఎరువులను వాడొద్దని అవగాహన కల్పిస్తున్నప్పటికీ క్షేత్రస్థాయిలో ఇబ్బందులు తలెత్తుతున్నాయని వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు.

అధికంగా వసూలు

పిఠాపురం, గొల్లప్రోలు తదితర ప్రాంతాలలో బస్తాపై రూ.30 నుంచి 50కి అదనంగా వసూలు చేస్తున్నట్లుగా రైతులు ఆరోపణలు చేస్తుండడంతో రెండు రోజుల క్రితం కాకినాడ, పెద్దాపురం ఆర్‌డిఒలు వ్యవసాయ శాఖ అధికారులతో కలిసి పలుచోట్ల తనిఖీలు నిర్వహించి ప్రయివేటు డీలర్లను హెచ్చరించారు. దీనిని దృష్టిలో పెట్టుకొని వారు తమ వ్యాపార ప్రయోజనాల కోసం రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. మరోవైపు టిడిపి కూటమి నేతలు సొసైటీలకు వచ్చిన యూరియాను తమకు అనుకూలమైన వారికి ముందస్తుగానే పంపిణీ చేస్తుండడంతో కొరత ఏర్పడుతుందనేది మరో వాదన ఉంది.


తిరుగుడు తప్పడం లేదు



అష్టకష్టాలు పడి నాట్లు వేయగా ప్రస్తుతం యూరియా అందుబాటులో లేకపోవడంతో దుకాణాల చుట్టూ తిరుగుతున్నాను. నగర పంచాయతీ సొసైటీలోనూ అందుబాటులో లేకపోవడంతో ప్రయివేటు డీలర్ వద్దకు వెళితే రెండు రోజుల్లో రమ్మాన్నారు. యూరియా కోసం నాలా చాలామంది తిరుగుతున్నారు.

-బస్వా అప్పలరాజు, రైతు, గొల్లప్రోలు

ఎరువుల కొరత లేదు



యూరియాను అన్నిచోట్ల అందుబాటులో ఉంచాం. ఎకరాకు దమ్ములో 15 కిలోలు, 30 రోజుల తర్వాత మరో 15 కిలోలు, 60 రోజుల తర్వాత ఇంకో 15 కిలోలు, డిఎపి 25 కిలోలు ఒకసారి మాత్రమే వేయాల్సి ఉంది. కానీ రైతుల అవసరానికి మించి వాడుతున్నట్టు తెలుస్తోంది.

-ఎన్. విజయ్‌కుమార్, వ్యవసాయ శాఖ జెడి

కాంట్రాక్టు కార్మికుల తొలగింపులో ఉక్కు యాజమాన్యం దోషి!

- ట్రిబ్యునల్ కోర్టు ఎదుట 28న వాదనలు
- ఇండస్ట్రియల్ ట్రిబ్యునల్ కమ్ లేబర్ కోర్టు నుంచి స్టీల్ యాజమాన్యానికి నోటీసులు

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

విశాఖ ఉక్కులో కాంట్రాక్టు కార్మికుల తొలగింపు విషయంలో ఉక్కు యాజమాన్యం కోర్టులో దోషిగా నిలబడింది. కాంట్రాక్టు కార్మికులపై ఆర్‌ఐఎన్‌ఎల్ (స్టీల్‌ప్లాంట్) యాజమాన్యం అవలంబిస్తోన్న చట్ట విరుద్ధమైన విధానాలపై ఇండస్ట్రియల్ ట్రిబ్యునల్ కమ్ లేబర్ కోర్టు నుంచి నోటీసులు జారీ అయ్యాయి. కాంట్రాక్టు కార్మికులు లేబర్ కోర్టులో ఇటీవల వేసిన పిటిషన్ ఈ నెల 28న విచారణకు రానుంది. హైదరాబాద్‌లోని ట్రిబ్యునల్ కమ్ లేబర్ కోర్టు ఎదుట యాజమాన్యం హాజరుకావాలంటూ తాజాగా స్టీల్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ (సిఎండి)కి నోటీసులు వచ్చాయి. ఏ పద్ధతీ పాటించకుండా 2500 మందికిపైగా కాంట్రాక్టు కార్మికులను ఇష్టారాజ్యంగా తొలగించడంతో ప్రభుత్వం ఈ కేసును లేబర్ కోర్టుకు రిఫర్ చేసింది. ఈ నేపథ్యంలో లేబర్ డిపార్టుమెంట్ వద్ద కూడా పలు దఫాలు కాంట్రాక్టు కార్మికులు, కార్మిక సంఘం ప్రతినిధులు, యాజమాన్య ప్రతినిధులతో జరిగిన చర్చల్లోనూ విషయం తేలకపోవడంతో లేబర్ కోర్టు విచారణ చేపట్టింది. ఈ మేరకు ఈ నెల 28న ఉదయం 10.30 గంటలకు హైదరాబాద్ ఇండస్ట్రియల్ ట్రిబ్యునల్ కమ్ లేబర్ కోర్టు ఎదుట స్టీల్ యాజమాన్యం నిలబడనుంది. అక్కడ వాదనలు వినిపిస్తారు.

ప్రభుత్వ కార్యక్రమంగా గౌతు లచ్చన్న జయంతి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

సర్దార్ గౌతు లచ్చన్న జయంతిని రాష్ట్ర కార్యక్రమంలో నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు సాధారణ పరిపాలనా శాఖ (పొలిటికల్) ముఖ్య కార్యదర్శి ముకేష్ కుమార్ మీనా గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్రంలోని అన్ని సచివాలయ విభాగాలు, శాఖాధిపతులు, అన్ని జిల్లాల కలెక్టర్లు ఆగస్టు 16వ తేదీన సర్దార్ గౌతు లచ్చన్న జయంతిని ప్రభుత్వ కార్యక్రమంగా నిర్వహించాలని, వారికి కేటాయించిన బడ్జెట్ నుంచి ఇందుకు సంబంధించిన వ్యయాన్ని భరించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.



అధైర్య పడొద్దు... ఆదుకుంటాం

- ముంపు పొలాల పరిశీలనలో మంత్రి మనోహర్

ప్రజాశక్తి తెనాలి (గుంటూరు జిల్లా)

గుంటూరు జిల్లా తెనాలి నియోజకవర్గంలో భారీ వర్షాల కారణంగా ముంపునకు గురైన పంట పొలాలను గురువారం రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ పరిశీలించారు. తొలుత కొల్లిపర మండల గ్రామాల్లో, మధ్యాహ్నం నుంచి తెనాలి అయితా నగర్ గోలి డొంక ప్రాంతంలో ఆయన పర్యటించారు. సాగు విస్తీర్ణం, ముంపు గురైన విస్తీర్ణం, రైతులు నష్టపోయిన విధానాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. కొందరు రైతులు ఇప్పటివరకు పంటలపై వెచ్చించిన వివరాలను నేరుగా మంత్రికి వివరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ దాదాపు ఐదు నెలల కాలంలో కురవాల్సిన వర్షం కేవలం రెండు గంటల వ్యవధిలోనే కురిసిన కారణంగా పొలాలు ముంపునకు గురయ్యాయని తెలిపారు.

రైతాంగం నష్టపోయిన విధానాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళతామని, రైతులు, కౌలు రైతులను కూడా ప్రభుత్వం ఆదుకుంటుందని భరోసానిచ్చారు. నష్టపోయిన రైతాంగానికి విత్తనాలు అందించే దిశగా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ నెల 18 వరకు వర్షాలు ఉన్న కారణంగా అధికారులు అప్రమత్తంగా ఉండాలని, ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. ఆయన వెంట సబ్ కలెక్టర్ సంజనా సింహ, మున్సిపల్ కమిషనర్ వి లక్ష్మీపతిరావు, విద్యుత్ డిఇబి అశోక్ కుమార్, వివిధ శాఖల అధికారులు, రైతులు, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

పులివెందుల, ఒంటిమిట్ట టిడిపి కైవసం

(మొదటి పేజీ తరువాయి)

ఒంటిమిట్ట, పులివెందుల టిడిపి జడ్‌పిటిసి అభ్యర్థులు భారీ మెజార్టీతో విజయం సాధించిన నేపథ్యంలో టిడిపి శ్రేణులు బాణాసంచా పేల్చుతూ సంబరాలు చేసుకున్నాయి. పులివెందుల టిడిపి అభ్యర్థి గెలుపు పట్ల మంత్రి సవిత, టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు ఆర్.శ్రీనివాసరెడ్డి, కమలాపురం ఎమ్మెల్యే పుత్తా కృష్ణచైతన్యరెడ్డి హర్షం వ్యక్తం చేశారు.

PRAJASAKTI Regd.No. 15795/68 సిటీ◆

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 45 సంచిక : 15 | విజయవాడ, శుక్రవారం 15 ఆగస్టు 2025 | 10 + 8 పేజీలు | వెల : 5.50

Vol No | Vijayawada, Friday 15 August 2025 | Rs


పొంచి ఉన్న ముప్పు

- రాష్ట్రానికి ఫ్లాష్ ఫ్లడ్ హెచ్చరిక
- అప్రమత్తమైన అధికార యంత్రాంగం
- అల్పపీడన ప్రభావంతో భారీ వర్షాలు
- వజ్రపుకొత్తూరులో ముందుకొచ్చిన సంద్రం
- ప్రకాశం బ్యారేజీ వద్ద రెండో ప్రమాద హెచ్చరిక

ప్రజాశక్తి - యంత్రాంగం

అల్పపీడన ప్రభావంతో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా రాష్ట్రవ్యాప్తంగా పలు జిల్లాల్లో వాగులు, వంకలు ఇప్పటికే పొంగి ప్రవహిస్తున్నాయి. పలు ప్రాంతాల్లో జన జీవనం అస్తవ్యస్థంగా మారింది. భారీ వర్షాలు ఒకవైపు కొనసాగుతుండగానే భారత వాతావరణ శాఖ మరో కీలక హెచ్చరిక జారీచేసింది. రాష్ట్రానికి ఫ్లాష్ ఫ్లడ్ (అకస్మిక వరద) పొంచి ఉందన్నది ఈ హెచ్చరిక సారాంశం. రానున్న 24 గంటల్లో తూర్పు గోదావరి, గుంటూరు, కృష్ణా, పశ్చిమగోదావరి జిల్లాలతో పాటు కేంద్ర పాలిత ప్రాంతమైన యానంలో ఎక్కడైనా ఫ్లాష్ ఫ్లడ్ విరుచుకుపడే అవకాశంఉందని ఈ హెచ్చరికలో పేర్కొంది. అయితే, ఈ మేరకు గురువారం సాయంత్రం భారతవాతావరణ శాఖ జారీ చేసిన హెచ్చరికతో అధికారయంత్రాంగం అప్రమత్తమైంది. అవసరమైన ముందుజాగ్రత్త చర్యలు తీసుకోవాలని సంబంధిత జిల్లాల కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేసింది. ముంపు ప్రాంతాల్లో ప్రజలను తరలించడం, శిబిరాలు ఏర్పాటు చేయడం వంటి అంశాలపై అధికారులు ఎక్కడికక్కడ దృష్టి సారించారు. మరోవైపు అల్పపీడన ప్రభావంతో గురువారం కోస్తాంధ్రలో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిశాయి.

వివరాలు 8లో..


కాకినాడ జిల్లా చెందుర్తిలో నీట మునిగిన పంటలు



ఓట్ల తొలగింపులకు కారణాలేమిటి?

ఎన్నికల కమిషన్‌కు సుప్రీం ప్రశ్న

65 లక్షల మంది వివరాలు 19వ తేదీలోగా ప్రచురించండి

బీహార్ ఎస్ఐఆర్ ప్రక్రియపై ఆదేశం

వివరాలు 9లో

నేటి నుంచే 'స్త్రీ శక్తి'

- అమలులోకి రానున్న ఉచిత బస్సు పథకం
- విజయవాడలో ప్రారంభించనున్న సిఎం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ పథకం 'స్త్రీ శక్తి' నేటి (శుక్రవారం) నుండి అమలులోకి రానుంది. విజయవాడలోని పండిట్ నెహ్రూ బస్‌స్టాండ్‌లో సాయంత్రం 5 గంటలకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈ పథకాన్ని ప్రారంభించనున్నారు. ఆ వెంటనే రాష్ట్రమంతా 'స్త్రీ శక్తి' పథకం అమలులోకి వస్తుంది. ఈ పథకంలో భాగంగా ఎంపిక చేసిన బస్సు సర్వీసుల్లో మహిళలకు రాష్ట్రంలో ఎక్కడి నుండి ఎక్కడికైనా ఉచితంగా ప్రయాణం చేసే సౌకర్యాన్ని ప్రభుత్వం కల్పించనుంది. పల్లెవెలుగు, అల్ట్రా పల్లెవెలుగు, సిటీ ఆర్డినరీ, ఎక్స్‌ప్రెస్, మెట్రో ఎక్స్‌ప్రెస్ బస్సులను ఈ పథకం కోసం కేటాయించారు. ఈ మేరకు అవసరమైన అన్ని ఏర్పాట్లను ఆర్‌టిసి పూర్తి చేసింది. ఈ పథకంలో భాగంగా ఉచితంగా ప్రయాణం చేసే మహిళలు ఓటర్ఐడి, ఆధార్, రేషన్ కార్డ్, డ్రైవింగ్ లైసెన్స్ వంటి గుర్తింపు కార్డులను తమ వెంట తప్పనిసరిగా తీసుకురావాల్సిఉంటుంది. కండక్టర్‌తో పాటు తనిఖీ అధికారులు అడిగితే ఆ గుర్తింపుకార్డులను చూపించాలి. పథకంలో భాగంగా మహిళలకు 'జీరో ఫేర్' టిక్కెట్‌ను ఇవ్వనున్నారు. ఈ మేరకు అవసరమైన సాఫ్ట్‌వేర్‌ను కూడా ఆర్‌టిసి సిద్ధం చేసింది.సుమారు 2.62కోట్ల మంది మహిళలు ఈ పథకాన్ని వినియోగించుకుంటారని అంచనా వేస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం గురువారం విడుదల చేసిన పథకంలో పేర్కొంది. ఈ పథకం అమలు కోసం ఏడాదికి సుమారు రూ.1,942కోట్ల రూపాయలు అదనంగా ఖర్చు అవుతుందని, ఆ మొత్తాన్ని ప్రభుత్వం ఆర్టీసికి చెల్లిస్తుందని ఈ ప్రకటనలో ప్రభుత్వం పేర్కొంది. ఈ పథకం అమలు ద్వారా నెలకు ఒక్కో మహిళకు సుమారు రూ.1000 నుంచి 3వేల వరకు ఖర్చు ఆదా అవుతుందని ప్రభుత్వం భావిస్తోంది. సంక్షేమ పథకాలతో ప్రజల జీవన ప్రమాణాలు పెంచేందుకు, మిగతా 5లో



జమ్ము కాశ్మీర్‌లో కుంభవృష్టి

- 45 మంది మృతి

జమ్మూ : జమ్మూ కాశ్మీర్‌లోని కిష్త్వార్‌లో గురువారం కుంభవృష్టి కారణంగా 45 మంది మరణించారు. 125 మందికిపైగా గాయపడ్డారు. మాతా చాంది ఆలయానికి వెళ్ళే మార్గం పొడవునా కుండపోతగా భారీ వర్షాలు కురియడంతో యాత్రికులు తీవ్ర ఇబ్బందుల పాలయ్యారు. యాత్ర కోసం విధుల్లో వున్న ఇద్దరు సిఐఎస్ఎఫ్ సిబ్బంది మరణించగా, మరో ఇద్దరు జవాన్లు గల్లంతయ్యారు. సహాయక బృందాలు తక్షణమే సంఘటనా స్థలానికి చేరుకున్నాయి. ప్రస్తుతం అక్కడ చిక్కుకుపోయిన వారిని తరలించేందుకు, గల్లంతైన వారి ఆచూకీ కోసం పెద్ద ఎత్తున గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. వివిధ వార్తా సంస్థల కథనాల ప్రకారం..మరణించినవారు లేదా గల్లంతైనవారి సంఖ్య 200 పైబడే ఉండొచ్చునని తెలుస్తోంది. అయితే కుంభవృష్టి సంభవించిన ప్రాంతంలో 38 మంది మృతదేహాలను స్వాధీనం చేసుకున్నట్లు అధికారులు నిర్ధారించారు. అలాగే వరద ముంపు నుంచి 125 మందిని రక్షించామని, వీరిలో గాయపడిన వారిని కిస్త్వార్ జిల్లా ఆసుపత్రికి తరలించామని పోలీసు అధికారి ఒకరు తెలిపారు. కిష్త్వార్ ప్రాంతంలో పరిస్థితి గురించి కేంద్ర హోం మంత్రి అమిత్ షాకు తెలియచేసినట్లు మిగతా 5లో

నాటి ఉత్తర్వులకు అనుగుణంగానే స్థానికత

- మెడికల్ అడ్మిషన్లపై హైకోర్టు తీర్పు

ప్రజాశక్తి-అమరావతి

స్థానికత విషయంలో రాష్ట్రపతి ఉత్తర్వులు, గతంలో హైకోర్టు త్రిసభ్య ధర్మాసనం ఇచ్చిన తీర్పునకు అనుగుణంగానే ఎంబిబిఎస్, బిడిఎస్ కోర్సుల్లో అడ్మిషన్లు కోరే అభ్యర్థుల స్థానికతను నిర్ధారించాలని హైకోర్టు గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. ఆయా లోకల్ ఏరియా (ఎస్‌వి లేదా ఎయు పరిధి)లో చదివానని చెబుతున్న అభ్యర్థి ఆ ప్రాంతంలో వరుసగా నాలుగేళ్లు చదివి ఉండాలని, ఆ నాలుగేళ్లు క్వాలిఫైయింగ్ ఎగ్జామినేషన్ (ప్లస్ 2) తో ముగించి ఉండాలని తెలిపింది. ఈ విధంగా చేసిన అభ్యర్థి స్థానికులవుతారని స్పష్టం చేసింది. క్వాలిఫైయింగ్ పరీక్ష రాసే నాటికి అభ్యర్థి లోకల్ ఏరియాలో నాలుగేళ్ల పాటు ఎక్కడా చదవనప్పటికీ రాష్ట్రంలో ఏడేళ్లపాటు నివాసం ఉంటే స్థానిక అభ్యర్థిగానే పరిగణించాలని తెలిపింది. ఆంధ్రప్రదేశ్ బయట చదువుకున్నప్పటికీ రాష్ట్రంలో నివాసం ఉంటున్నాం కాబట్టి తమను ఎంబిబిఎస్, బిడిఎస్ కోర్సుల ప్రవేశాల్లో స్థానిక అభ్యర్థులుగా పరిగణిచాలనే అభ్యర్థుల వాదనను తిరస్కరించింది.

పులివెందుల, ఒంటిమిట్ట టిడిపి కైవసం

- పులివెందుల్లో వైసిపికి డిపాజిట్ గల్లంతు
- కౌంటింగ్‌ను బాయ్‌కాట్ చేసిన వైసిపి

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

ఉమ్మడి వైఎస్ఆర్ కడప జిల్లాలోని పులివెందుల, ఒంటిమిట్ట జడ్‌పిటిసి స్థానాలకు నిర్వహించిన ఉప ఎన్నికల్లో టిడిపి భారీ మెజార్టీతో విజయాన్ని సాధించింది. గురువారం మను పాలిటెక్నిక్ కళాశాలలో ఓట్ల లెక్కింపు చేపట్టారు. పులివెందుల స్థానానికి 7,794 ఓట్లు పోలయ్యాయి. నోటాకు 11, 145 ఓట్లు తిరస్కరణకు గురయ్యాయి. నోటా, తిరస్కరణకు గురైన ఓట్లుపోగా 7,638 ఓట్లు లెక్కించారు. టిడిపి అభ్యర్థి మారెడ్డి లతకు 6,716 ఓట్లు పడ్డాయి. వైసిపి అభ్యర్థి తుమ్మల హేమంత్‌రెడ్డికి కేవలం 683 ఓట్లు మాత్రమే లభించాయి. వైసిపి అభ్యర్థి డిపాజిట్ కూడా గల్లంతైంది. ఒంటిమిట్ట జడ్‌పిటిసి స్థానానికి 20 వేల ఓట్లు పోల్‌కాగా, నోటా 29, తిరస్కరణకు గురైన 582 ఓట్లు పోగా 19,389 ఓట్లను లెక్కించారు. మొదటి రౌండులో 9,703 ఓట్ల లెక్కింపులో టిడిపి అభ్యర్థి అద్దలూరు ముద్దు కృష్ణారెడ్డికి 6,270 ఓట్లు పడ్డాయి. వైసిపి అభ్యర్థి ఇరగంరెడ్డి సుబ్బారెడ్డికి 3,165 ఓట్లు పోలయ్యాయి. రౌండవ రౌండ్‌లో 9,686 ఓట్లలో టిడిపికి 6,235 ఓట్లు, వైసిపికి 3,186 ఓట్లు పోలయ్యాయి. మూడు రౌండ్ల కలిపి లెక్కిస్తే టిడిపికి 12,505 ఓట్లు లభించగా వైసిపికి 6,351 ఓట్లు లభించాయి. టిడిపి అభ్యర్థి కృష్ణారెడ్డి 6,154 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. గెలుపొందిన అభ్యర్థులకు ఎన్నికల అధికారులు ధృవీకరణ పత్రాలను అందజేశారు. కౌంటింగ్‌ను వైసిపి బాయ్‌కాట్ చేసింది. ఉమ్మడి కడప జిల్లాలోని మిగతా 2లో


ఎన్నికల అధికారి నుంచి డిక్లరేషన్ అందుకుంటున్న పులివెందుల టిడిపి అభ్యర్థి లత

సంపాదకీయం

దురహంకార హత్యలు!

వైద్యురాలు కావాల్సిన ఒక ప్రతిభావంతురాలికి ఆమె కుటుంబమే దురహంకారంతో మరణ శాసనం రాసింది. గుజరాత్‌కు చెందిన చంద్రిక ఈ ఏడాది వైద్య విద్య అర్హత పరీక్ష (నీట్)లో 478 మార్కులు సాధించింది. ప్రభుత్వ వైద్య కళాశాలలో ప్రవేశం పొందింది. కూతురు సాధించిన విజయానికి ఏ తల్లిదండ్రులైనా, కుటుంబ సభ్యులైనా సంతోషంతో ఉప్పొంగిపోవటం సహజం. కానీ, చంద్రిక తండ్రి సెంధా పటేల్, మావయ్య శివరాం పటేల్ ఆమె నడవడికను అనుమానించారు. కళాశాలకు వెళ్లి అక్కడ అమ్మాయిలూ, అబ్బాయిలూ కలిసి చదువుతున్నారని; మాట్లాడుకుంటున్నారని, దీనివల్ల తమ కుటుంబ గౌరవం దెబ్బ తినే ప్రమాదం ఉందని రచ్చ చేశారు. తరువాత ఆమెను ఇంటికి తీసుకొచ్చి, పాలలో మత్తుమందు కలిపి ఇచ్చారు. మగతలోకి వెళ్లాక ఆమె దుపట్టాతోనే ఉరి వేసి, చంపేశారు. గుండెపోటు వల్ల చనిపోయిందని ఊరి వారిని నమ్మించి, ఆగమేఘాల మీద అంత్యక్రియలు జరిపించారు. ఇది జరిగింది గత జూన్ 25వ తేదీన. చంద్రిక మిత్రుడు హరీశ్ అనుమానంతో హైకోర్టును ఆశ్రయించడంతో- కోర్టు ఆదేశాల మేరకు కేసు నమోదు, పోలీసుల విచారణతో ఈ దుర్మార్గం వెలుగు చూసింది.

తమ ఇంటి ఆడబిడ్డ వేరే కులానికి చెందిన అబ్బాయితో మాట్లాడిందనో, ప్రేమించిందనో, పెళ్లి చేసుకుందనో ఆమెను కర్కశంగా హతమారుస్తున్న దురహంకారులకు మన దేశంలో లోటు లేదు. అమ్మాయిలు విద్యావంతులైనా, ఉద్యోగులైనా వారి అభిప్రాయాలకు విలువ ఇవ్వని దుస్థితి ఇంకా రాజ్యమేలుతూనే ఉంది. ముఖ్యంగా వివాహ విషయంలో అబ్బాయిలకు ఉన్న స్వేచ్ఛ అమ్మాయిలకు దొరకటం లేదు. ఎక్కువ తక్కువ లెక్కింపులతో కునారిల్లుతున్న కుల దురహంకార వ్యవస్థ ఈ దుర్మార్గ స్థితికి కారణం. మహిళలు చదువుల్లో, ఉద్యోగాల్లో, వివిధ రంగాల్లో ఎంత ఉన్నతంగా ఎదిగినా ఆర్థికంగా అణగిమణగి ఉండాలన్న పురుషాధిపత్య ధోరణి కొనసాగుతోంది. క్రీడాకారిణి అయిన కూతురు రాధిక సొంతంగా క్రీడా తర్ఫీదు కేంద్రాన్ని నెలకొల్పి ఆర్థిక స్వతంత్రత సాధించటాన్ని తట్టుకోలేని తండ్రి దీపక్ ఆమెను తుపాకితో కాల్చి చంపిన సంఘటన జులై 11న హర్యానాలో జరిగింది. ఆడపిల్లలు జీవితాంతం తమ అదుపాజ్ఞల్లో ఉంటేనే గౌరవమని, లేకుంటే అది ప్రమాదకరమని బోధించే మనువాద భావజాలమే ఇలాంటి అకృత్యాలకు దారి తీస్తోంది. దేశంలో ఏటా 300 వరకూ దురహంకార హత్యలు జరుగుతున్నాయని అంచనా. మనువాద భావజాలం పెత్తనం చెలాయిస్తున్న ప్రాంతాల్లోనూ, కుటుంబాల్లో ఈ తరహా దారుణాలు ఎక్కువగా జరుగుతున్నాయి. న్యాయస్థానాల సూచన మేరకు 2014 నుంచి కుల దురహంకార హత్యల గణాంకాలను మనదేశంలో విడిగా లెక్కిస్తున్నారు. అధికారికంగా ఏటా 60 - 70 నమోదవుతున్నా- గుట్టు చప్పుడు కాకుండా హత్యలను కప్పెడుతున్న ఉదంతాలు అంతకు నాలుగైదు రెట్లు ఉంటాయి.

సమాజంలో అమ్మాయిల ఉనికిని పుట్టినప్పటినుంచి పరువు ప్రతిష్టలతో కొలవటం ఒక విపరీతమైతే- మతం పేరుతోనూ, మార్కెట్టు హోరుతోనూ అణచివేతకు, అందాల ప్రదర్శనకు గురి చేయటం మరొక వైపరీత్యం. ఈ రెంటిలోనూ మనువాద సంస్కృతి, వ్యాపార సంస్కృతి ఉమ్మడిగా క్రియాశీలక పాత్ర పోషించి, మహిళను బాధితగా మారుస్తున్నాయి. చదువు మధ్యలో మాన్పించటం, వయసుకు ముందే పెళ్లిళ్లు జరపటం, అదుపాజ్ఞల బెత్తంతో పెత్తనం చేయడం, ఏ వస్తు అమ్మకానికైనా స్త్రీ దేహాన్ని ఆకర్షక కేంద్రంగా మార్చటం సమాజంలో ఇంకా కొనసాగుతున్న దుస్థితి! "స్త్రీకి కూడా శరీరం ఉంది. దానికి వ్యాయామం ఇవ్వాలి. ఆమెకు మెదడు ఉంది. దానికి జ్ఞానం ఇవ్వాలి. ఆమెకి హృదయం ఉంది. దానికి అనుభవం ఇవ్వాలి." అని చలం ఘోషించి వందేళ్లు గడిచిపోయాయి. కానీ, పరిస్థితి మరింత 'పరువు' తక్కువగా దిగజారిపోతోంది. స్త్రీ జనోద్ధరణ ఇంకా నినాదాలు, హామీల దగ్గర అఘోరిస్తుండగానే- మహిళలను మరింత వెనక్కు నెట్టే సనాతన భావజాలం పీఠమెక్కి రంకెలు వేస్తోంది. "మహిళ ఒంటరిగా అర్ధరాత్రి వేళ సురక్షితంగా నడి వీధిలో నడవగలిగినప్పుడే దేశానికి నిజమైన స్వాతంత్య్రం వచ్చినట్టు" అన్నాడు మహాత్మా గాంధీ! రాత్రీ పగళ్లతో సంబంధం లేకుండా మహిళలపై సగటున రోజుకు 86 అత్యాచారాలూ, 12 హత్యలూ జరుగుతున్న అధికారిక గణాంకాల నేపథ్యంలో - దేశానికి నిజమైన స్వాతంత్య్రం వచ్చినట్టా? లేనట్టా?

మహనీయుల మాట



కార్మికవర్గ పోరాటం వారి విముక్తి కోసమే కాదు. అణచివేత నుంచి, దోపిడీ నుంచి మొత్తంగా మానవాళి విముక్తి కోసం అది పోరాడుతుంది.

- హోచిమిన్,
వియత్నాం విప్లవ సారథి.

సందర్భం

స్వతంత్ర భారతావనికి జీవనాడి వంటి

ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడింది

మన దేశంలో ప్రజాస్వామ్యం ఇవాళ తీవ్ర ప్రమాదాన్ని ఎదుర్కొంటున్నది. ఈ ప్రమాదానికి మూల కారణం ఏంటంటే ఆర్.ఎస్.ఎస్-బి.జె.పి లకు, స్వాతంత్ర్య పోరాట వారసత్వం లేకపోవడం. గణతంత్ర ప్రజాస్వామిక రాజ్యాంగం అంటే గిట్టకపోవడమే. వాటిది హిందూత్వ సైద్ధాంతిక నేపథ్యం. కేంద్రీకృత అధికారాలతో కూడిన, ఫాసిస్టు తరహా హిందూ మత రాజ్యస్థాపనే ఆ సంస్థల లక్ష్యం. మత ప్రాతిపదికన పౌరసత్వం, పరిపాలన సాగాలనేది వాటి ఎజెండా. ఈ మతోన్మాద ధోరణులకు నయా ఉదారవాద ఆర్థిక విధానాలు తోడు కావడం నయా ఫాసిస్టు ధోరణులకు దారి తీస్తున్నది. ఈ క్రమంలోనే రాజ్యాంగ బద్ధమైన వ్యవస్థల మీద మోడీ ప్రభుత్వం ప్రణాళికబద్ధంగా దాడి చేస్తూ వాటిని నిర్వీర్యం చేస్తూ వస్తున్నది. కాబట్టి ఈ వినాశకరమైన విభజిత, విద్వేష సిద్ధాంతాన్ని తిప్పికొట్టకుండా మనం ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించుకోలేము.





నీలోత్పల్ బసు

79వ స్వాతంత్ర్య దినోత్సవ సంబరాలు జరుపుకుంటున్న ఈ తరుణాన... స్వతంత్ర భారత భవిష్యత్తును తీర్చిదిద్దిన నాటి సాహసోపేత రోజుల గురించి ఒకసారి స్మరించుకుందాం.

మన దేశానికి లభించిన స్వాతంత్ర్యం గురించి భిన్నాభిప్రాయాలు, భిన్న దృక్పథాలు ఉన్నప్పటికీ మనకు లభించిన ఈ స్వాతంత్ర్యాన్ని స్థిరపచుకుని బలోపేతం చేసుకోవడానికి నాడు జరిగిన స్వాతంత్ర్య సంగ్రామం నుండి మనం కొన్ని గుణపాఠాలు తీసుకోవాలి. భిన్నత్వంలో ఏకత్వం, ప్రజల ప్రజాస్వామిక భాగస్వామ్యం, మత స్వేచ్ఛ, సర్వ మత సమానత్వం, ప్రజాస్వామిక-లౌకిక-సామాజిక దృక్పథంతో ప్రాంతీయ, సాంస్కృతిక, భాషా వైవిధ్యాల పట్ల నమ్రతతో కూడిన గుర్తింపు కలిగి ఉండడం- మన సమాఖ్య గణతంత్ర రాజ్య లక్షణాలు. భారత జాతీయత, జాతిరాజ్య భావనలకు మతం ఏనాడూ ప్రాతిపదికగా లేదు. మతం ప్రాతిపదికగా జాతీయతను, జాతి రాజ్య భావనలను ప్రోది చెయ్యాలని చూస్తున్న శక్తులకు గణతంత్ర రాజ్య భావనే అర్థం కాలేదని భావించాలి. మన గణతంత్ర రాజ్యం ఉనికి నాలుగు ప్రధాన పునాది స్థంభాల మీద ఆధారపడి ఉన్నది. ఆర్థిక-రాజకీయ సార్వభౌమత్వం, ప్రజాస్వామ్యం, లౌకికతత్వం, సామాజిక న్యాయం, సమాఖ్యతత్వం-ఇవే మన దేశానికి మూల స్థంభాలు. రాజ్యాంగ సభకు ఎన్నికైన ప్రతినిధులు ఈ లక్ష్యాల సాధనకు అనుగుణంగా మన రాజ్యాంగాన్ని రూపొందించారు.

వాదప్రతి వాదనలు, సుదీర్ఘ చర్చల అనంతరం రాజ్యాంగ సభ ఒక ముసాయిదా రాజ్యాంగాన్ని ఖరారు చేసింది. ఈ సందర్భంగా రాజ్యాంగసభ ఛైర్మన్, గొప్ప రాజ్యాంగ నిపుణుడు అయిన అంబేద్కర్ తన ప్రసంగంలో ఇలా వివరించాడు.

"1950 జనవరి 26న మనం వైరుధ్యమయ జీవితంలోకి ప్రవేశించనున్నాం. రాజకీయంగా మనం సమానత్వం కలిగి ఉన్నప్పటికీ సామాజిక-ఆర్థిక జీవన రంగాల్లో అసమానతలు ఎదుర్కొనాల్సి ఉంటుంది. ఒక మనిషికి ఒకే ఓటు, ఒక ఓటుకు ఒకే విలువ అన్న ప్రాతిపదికన మనం రాజకీయ సమానత్వాన్ని గుర్తిస్తున్నాం. కానీ మన సామాజిక, ఆర్థిక నిర్మాణాల రీత్యా సామాజిక-ఆర్థిక జీవన రంగాల్లో ఒక మనిషికి ఒకే విలువ అన్న సూత్రాన్ని నిరాకరిస్తున్నాం. ఈ విధమైన వైరుధ్యాలతో జాతి జీవనం ఎన్నాళ్లు గడుస్తుంది? సామాజిక-ఆర్థిక రంగాల్లో ఎంత కాలం మన సమానత్వాన్ని తిరస్కరిస్తూ వస్తాం? ఇది ఇలాగే దీర్ఘకాలం కొనసాగితే మన రాజకీయ ప్రజాస్వామ్యం ప్రమాదంలో కూరుకుపోతుంది. సాధ్యమైనంత తొందరగా మనం ఈ వైరుధ్యాన్ని రూపుమాపాలి. లేదంటే అసమానతలకు బలవుతున్న ప్రజానీకం...రాజ్యాంగ సభ ఎంతో శ్రమకోర్చి నిర్మించిన రాజకీయ ప్రజాస్వామ్య నిర్మాణాన్ని బదాబదలు చేసేస్తుంది".

అంతేకాదు, వ్యక్తి ఆరాధనను తిరస్కరిస్తూ జాన్ స్టువార్ట్ మిల్ వ్యాఖ్యలను గుర్తు చేశాడు. అంబేద్కర్ తన రచనలలో, ఉపన్యాసాలలో పదే పదే వ్యక్తి ఆరాధనా తత్వాన్ని తెగనాడాడు. భక్తి, ఆరాధనాతత్వం అనేవి మతంలో నీకు విముక్తిని ప్రసాదిస్తాయేమోగానీ రాజకీయాల్లో అవి దిగజారుడుతనానికి, నియంతృత్వానికి దారి తీస్తాయి" అని స్పష్టం చేశాడు. 'భారత దేశం రాజకీయంగా మాత్రమే కాదు, సామాజికంగా ఆర్థికంగా ప్రజాస్వామిక దేశంగా అవతరించాలి' అని నొక్కి వక్కాణించాడు.

రెండవ ప్రపంచ యుద్ధానంతరం వెల్లువెత్తిన వలస పాలనా వ్యతిరేక విప్లవాలు, ఉద్యమాలు మన దేశ రాజ్యాంగ సభ నిర్వర్తించిన అసాధారణమైన కర్తవ్యాన్ని గుర్తించాయి. వేనోళ్ల కీర్తించాయి. "భూమి పుట్టినప్పటి నుండి ప్రభుత్వాల ఏర్పాటుకు జరిగిన ప్రయోగాలన్నిట్లోకీ...భారతదేశం పార్లమెంటరీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకున్న తీరు గొప్ప ఉద్వేగభరితమైనది. విశాలమైన భారత ఉపఖండం కోట్లాది మంది ప్రజానీకాన్ని స్వేచ్ఛాయుత ప్రజాస్వామ్యం వైపు నడిపిస్తున్నది. ఇది చాలా సాహసోపేతమైన చర్య. భారతదేశ ప్రజాస్వామ్యం మా దేశపు ప్రజాస్వామ్యానికి పేలవమైన అనుకరణ కానే కాదు. ఇది మేం కలలో కూడా ఊహించనటువంటి స్థాయిలో భారీ ఎత్తున, బహుళత్వంతో చేపట్టిన ప్రజాస్వామ్యం. ఇది ఘనంగా విజయవంతం అయితే దాని ప్రభావం ఆసియా ఖండం అంతటా వెలకట్టలేని స్థాయిలో ఉంటుంది. అంతిమ పర్యవసానాలు ఎలా ఉన్నప్పటికీ ఇంతటి గొప్ప ప్రయత్నాన్ని, కృషిని మనం గౌరవించి తీరాలి" అని నాటి బ్రిటన్ ప్రధాని ఆంథోని ఈడెన్ ప్రశంసించడాన్ని మనం ఈ సందర్భంగా గుర్తు చేసుకోవాలి. భిన్న మతాల, విభిన్న సంస్కృతుల సమాహారమైన అలాంటి మన లౌకిక, ప్రజాస్వామిక వ్యవస్థను పరిపుష్టం చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది. ఈ నేపథ్యాన్ని గమనంలోకి తీసుకోకుండా మన దేశ స్వాతంత్ర్యాన్ని, గణతంత్ర రాజ్య ఆవిర్భావాన్ని మనం పునర్ మూల్యాంకనం కావించలేం.

పార్లమెంటు స్వతంత్రత-జవాబుదారీతనం

స్వతంత్ర భారతావని రాజ్యాంగం ద్వారా ప్రజాస్వామ్యాన్ని అనుసరిస్తూ సౌర్వభౌములైన ప్రజానీకానికి జవాబుదారీగా ఉండాలి. ప్రజాస్వామ్యం అంటే ప్రజల చేత, ప్రజల కొరకు, ప్రజలకై అన్న విశ్వజనీన భావనను సాకారం చెయ్యడానికి దోహదం చేసేవిధంగా మన పార్లమెంటరీ వ్యవస్థ రూపొందించబడింది. జాతీయ స్థాయిలో నెలకొల్పిన ద్వంద్వ పార్లమెంటు (లోక్‌సభ, రాజ్యసభ) శాసన వ్యవస్థ స్వతంత్రంగా పని చెయ్యడం ద్వారా ప్రభుత్వం జవాబుదారీతనంతో వ్యవహరించేలా చూడాలి. ప్రభుత్వము, కార్యనిర్వాహక వ్యవస్థలు సౌర్వభౌములైన ప్రజానీకానికి పూచీపడాలి. 1975లో విధించిన ఎమర్జెన్సీ కాలంలోను, ఆ ముందూ, తర్వాతి కాలల్లో అడపాదడపా పొడసూపిన పెడధోరణులను మినహాయిస్తే మన పార్లమెంటరీ ప్రజాస్వామ్య వ్యవస్థ ఒకమేరకు విజయం సాధించింది. రెండవ ప్రపంచ యుద్ధానంతరం జాతీయ విముక్తి సాధించుకుని పార్లమెంటరీ ప్రజాస్వామ్య పంథాను ఎంచుకుని ఈనాటి వరకూ సైనిక, పౌర నియంతృత్వాలు కబళించకుండా ప్రజాస్వామ్య వ్యవస్థను కాపాడుకుంటూ, నిలబెట్టుకున్న ఏకైక దేశం మనదే. ఇందుకు అంతర్జాతీయ పరిస్థితులు కూడా తోడ్పడ్డాయి. కానీ ఇవాళ అంతర్జాతీయ పరిస్థితులలో నాటకీయమైన మార్పులు చోటుచేసుకున్నాయి. అనేక దేశాల్లో పచ్చి మితవాద శక్తులు అధికారంలోకి వచ్చాయి. ఫాసిస్టు తరహా సంస్థ అయిన ఆర్.ఎస్.ఎస్ కేంద్రంలోని మోడీ ప్రభుత్వానికి సైద్ధాంతిక దిశానిర్దేశం చేస్తున్నది. కార్పొరేట్ మతతత్వ శక్తుల కూటమి మెజార్టీ మతోన్మాద ధోరణులను పెంచి పోషిస్తున్నది. పౌరసత్వానికి సంబంధించిన లౌకిక, సమానత్వ భావనలకు చెల్లు చీటీ ఇస్తున్నది. సుసంపన్నమైన మన సాంస్కృతిక, భాషాపరమైన వైవిధ్యాన్ని ధ్వంసం చెయ్యడానికి చట్టాలను బలవంతంగా ప్రవేశపెడుతున్నది. సామాజిక న్యాయ సూత్రాలకు, ప్రజాస్వామిక మానవ హక్కులకు ఉన్న రక్షణలకు హరిస్తున్నది.

అన్నిటికన్నా ముఖ్యంగా బడ్జెట్ కేటాయింపులపై పార్లమెంటులో అర్థవంతమైన చర్చలకు స్థానం లేకుండా చేస్తున్నది. 2014లో కేంద్రంలో బిజెపి అధికారం చేపట్టాక, ఆ తర్వాత 2019లో జరిగిన సార్వత్రిక ఎన్నికలలో బిజెపి స్వంతంగా మెజార్టీ స్థానాలు గెలుచుకున్నాక వరుస బడ్జెట్లలో కేటాయించిన లక్షల కోట్ల రూపాయల గ్రాంట్ల మీద ఎటువంటి చర్చకానీ సునిశితమైన పరిశీలనగానీ జరగకుండానే ఆమోద ముద్ర వేశారు. రంగాలవారీ కేటాయింపులపై అధ్యయనం జరపాల్సిన జాయింట్ పార్లమెంటరీ కమిటీలను దాదాపుగా అటక ఎక్కించేశారు. పార్లమెంటును మోడీ ప్రభుత్వం రబ్బరు స్టాంప్‌లా మలిచే ప్రయత్నాలు కొనసాగిస్తున్నది.

రాజ్యాంగ బద్ధంగా స్వతంత్రంగా వ్యవహరించాల్సిన రాష్ట్రపతి, ఉప రాష్ట్రపతి, స్పీకర్ వంటి ప్రతిష్టాత్మక పదవులకు ఆర్.ఎస్.ఎస్-బి.జె.పి ల రాజకీయ, సైద్ధాంతిక అవసరాలకు అనుగుణంగా వ్యవహరించే వ్యక్తులకు కట్టబెడుతున్నది. శాసన వ్యవస్థ కార్యకలపాలకు సంబంధించి అనేక సంవత్సరాలుగా రూపొందించుకుంటూ వచ్చిన నియమావళిని నీరుకార్చేస్తున్న కారణంగా స్పీకర్, డిప్యూటీ ఛైర్మన్ పదవులను నిర్వహిస్తున్నవారు తరచూ ప్రజల నుండి విమర్శలను ఎదుర్కొంటున్నారు. పార్లమెంటరీ ప్రజాస్వామ్యంలో కీలకమైన అధికారాల విభజనకు మంగళం పాడేస్తున్నారు. పార్లమెంటులో ఎటువంటి చర్చకు తావు లేకుండా రూపొందించిన మూడు వ్యవసాయ చట్టాలు ఇందుకు ఒక ఉదాహరణ. ఈ చట్టాలకు వ్యతిరేకంగా భారత రైతాంగం సమరశీల ప్రతిఘటనా పోరాటం నిర్వహించింది. చట్టాలకు, ప్రజా ప్రయోజనాలకు మధ్య ఉన్న తీవ్ర అగాధానికి వ్యవసాయ చట్టాలు ఒక ఉదాహరణగా నిలిచాయి. అందుకే ప్రజా ప్రయోజనాలకు వ్యతిరేకగా ఉన్న ఈ మూడు వ్యవసాయ చట్టాలను మోడీ ప్రభుత్వం వెనక్కి తీసుకోవాల్సి వచ్చింది.

ప్రజల పౌర, ప్రజాస్వామిక హక్కుల మీద తీవ్రంగా దాడి చేయడానికి మోడీ ప్రభుత్వం అనేక చట్ట సవరణలు తీసుకు వచ్చింది. స్వతంత్ర్య మీడియాపై అనేక నియంత్రణలు విధించింది. మీడియాపై కార్పొరేట్ రంగ అపరిమిత ప్రభావానికి ఊతం ఇచ్చింది. ప్రతికా స్వేచ్ఛను హరించివేసింది.

అసమ్మతిని, భిన్నాభిప్రాయాలను కఠనంగా అణిచివేయడానికి, శిక్షార్హమైన నేరాలుగా ముద్ర వెయ్యడానికి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇ.డి), నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజన్సీ (సిబిఐ) వంటి సంస్థలను అణిచివేత సాధనాలుగా ఉపయోగిస్తున్నది. చివరికి ఎన్నికల సంఘాన్ని కూడా కీలుబొమ్మగా మలుచుకున్నది. శాసన వ్యవస్థ, చట్ట సంస్థల స్వతంత్రతను పూర్తిగా నీరుకార్చేసింది. పార్లమెంటులో కీలకమైన అంశాలపై చర్చలు జరుగుతున్న ప్రతి సందర్భంలోనూ ప్రధాని మోడీ సమావేశాలకు గైర్హాజరు కావడం ద్వారా పార్లమెంట్ పట్ల లెక్కలేని తానాన్ని, అతిశయించిన గర్వాన్ని ప్రదర్శిస్తున్నారు.

చట్టబద్ధ, రాజ్యాంగబద్ధ సంస్థల పట్ల చిన్న చూపు

2014 నుండి మొదలుకుని భారత న్యాయ వ్యవస్థ స్వతంత్రతను దెబ్బ తియ్యడానికి మోడీ ప్రభుత్వం ప్రణాళికా బద్ధంగా కృషి చేస్తూ వస్తున్నది. న్యాయమూర్తుల నియామకాలను సాగదీస్తూ వచ్చింది. దేశ అత్యున్నత న్యాయస్థానమైన సుప్రీం కోర్టు ఇచ్చిన ఆదేశాలను కూడా చట్ట సవరణల ద్వారా నిర్వీర్యం చూస్తూ వచ్చింది. ఎన్నికల సంఘం నియామకాలకు సంబంధించి సుప్రీంకోర్టు తీర్పును తోసిపుచ్చింది. 'మనీ లాండరింగ్' చట్టాన్ని ఇ.డి దుర్వినియోగం చేయడాన్ని అరికడుతూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుకూ అదేగతి పట్టించింది.

గత పదేళ్ళ కాలంలో రాజకీయ ప్రత్యర్థులను వేధించడానికి ఎన్.ఐ.ఎ, సి.బి.ఐ సంస్థలను పావులుగా వాడుకున్నది. యు.జి.సి తదితర అత్యున్నత పరిశోధనా సంస్థలలో మతతత్వ సిద్ధాంతాలను పెంచి పోషించే వ్యక్తులతో నింపివేసింది. పాఠ్యాంశాలలో మతతత్వ ధోరణులను చొప్పిస్తున్నది.

రిజర్వ్ బ్యాంక్ స్వయం ప్రతిపత్తిని దెబ్బతీసింది. ఆర్థిక సంక్షోభాల సమయంలో ఆదరవుగా ఉండడానికి కేటాయించే రిజర్వ్ నిధులను కూడా బలవంతాన కేంద్ర ప్రభుత్వానికి బదిలీ చేయించుకున్నది. బ్యాంకుల నుండి వేల కోట్ల రూపాయల రుణాలు పొంది ఎగవేతకు పాల్పడిన కార్పొరేట్ సంస్థలపై చర్యలు తీసుకోనివ్వకుండా మోడీ ప్రభుత్వం రిజర్వ్ బ్యాంక్ చేతులు కట్టేసిన తీరు గురించి రఘురామ రాజన్, ఉర్జిత్ పటేల్ వంటి రిజర్వ్ బ్యాంక్ మాజీ గవర్నర్లు తమ పుస్తకాల్లో వెల్లడించారు. రిజర్వ్‌బ్యాంక్ విధులను తలదన్ని మోడీ ప్రభుత్వం ఏకపక్షంగా పెద్దనోట్ల రద్దుకు పూనుకున్న వైనాన్నీ ఎండగట్టారు.

మీడియా

మీడియాను వేదికగా చేసుకొని మెజారిటేరియన్ల దాడులు సాగుతున్నాయి. మతం ముసుగులో విద్వేష విషం చిమ్మేవారిని, లైంగిక నేరాలకు పాల్పడిన వారిని కాపాడే కథనాల నుంచి మరో అడుగు ముందుకేసి సమాజంలో భయోత్పాతాన్ని సృష్టించడమే లక్ష్యంగా ఒక సెక్షన్ మీడియా పనిచేస్తున్నది. దీనికి భిన్నంగా వ్యవహరించే స్వతంత్ర జర్నలిస్టులపై దాడులకు, వేధింపులకు పాల్పడుతున్నారు. ప్రభుత్వాన్ని, ప్రధాని మోడీని ఏ మాత్రం విమర్శించినా వారిపై వ్యక్తిత్వ హననానికి పాల్పడడం, తప్పుడు కేసులు మోపడం, అక్రమంగా అరెస్టులు చేయించడం రివాజుగా మారిపోయింది. పాలనా పరమైన, విధానపరమైన విమర్శలు చేసిన వారిమీద దేశద్రోహులనో, అర్బన్ నక్సల్స్ అనో ముద్ర వేయడం పరిపాటిగా మారింది. రాజకీయాల్లో వ్యక్తి ఆరాధన ఎలాంటి ప్రమాదాలకు దారి తీస్తుందని అంబేద్కర్ హెచ్చరించాడో అది ఈనాడు వాస్తవ రూపం దాల్చింది. సహేతుక విమర్శ ప్రజాస్వామ్యానికి జీవగర్ర వంటిది. కానీ అలాంటి సహేతుక విమర్శను కూడా మోడీ ప్రభుత్వం సహించడం లేదు. మోడీకి స్తోత్ర పాఠం చెయ్యడం విధాయకంగా మారింది.

ఎన్నికల సంఘం స్వతంత్రత!

ఎన్నికలను స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా నిర్వహించడం అనేది ప్రజాస్వామ్యానికి కలికితురాయి వంటిది. అందుకే మన రాజ్యాంగం ప్రభుత్వ జోక్యానికి అవకాశం లేని స్వయంప్రతిపత్తి సంస్థగా ఎన్నికల సంఘాన్ని రూపొందించింది. కాలానుగుణంగా ఇది బహుళ సభ్యుల సంఘంగా అవతరించింది. రాజకీయ పార్టీలను విశ్వాసంలోకి తీసుకుని ఎన్నికలను స్వేచ్ఛగా, పారదర్శకంగా నిర్వహిస్తూ వచ్చింది. అంతర్జాతీయంగా సానుకూల గుర్తింపుకు నోచుకున్నది. అట్లాగని ఎన్నికల సంఘంతో వివాదాలూ, విమర్శలూ లేవా అంటే ఉన్నాయి. కానీ ఎన్నికల సంఘం వెంటనే తగిన దిద్దుబాటు చర్యలు చేపట్టేది. మోడీ ప్రభుత్వం 'ఎలక్టోరల్ బాండ్ల' పేరిట రాజకీయ పార్టీలు నిధులు సేకరించడానికి వీలుగా చట్టాన్ని రూపొందిస్తే ఎన్నికల సంఘం దీనిని వ్యతిరేకించింది. ఈ విధానం అధికారంలో ఉన్న రాజకీయ పక్షానికి అనుచిత లబ్ధి చూకూర్చే అవకాశం ఎక్కువ ఉంటుందని, అవినీతి-అక్రమాలకు ఆలవాలంగా మారుతుందని ఎన్నికల సంఘం హెచ్చరించింది.

ఇవాళ ఎన్నికల సంఘం అటువంటి స్వయంప్రతిపత్తిని కోల్పోయింది. అధికార పార్టీకి వంత పాటగాడిగా మారిపోయింది. మహారాష్ట్ర శాసనసభకు నిర్వహించిన ఎన్నికలు గానీ, తాజాగా బీహార్‌లో చేపట్టిన సమగ్ర ఓటరు జాబితా ప్రక్షాళనగానీ ఎన్నికల సంఘం అధికార పార్టీకి ఎంతలా ఊడిగం చేస్తున్నదో అర్థం చేసుకోవడానికి, ఉపకరిస్తుంది. ఎన్నికల సంఘం కమిషనర్ల నియామకంలో సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాలను బేఖాతరు చేస్తూ మోడీ ప్రభుత్వం ఈ నియామకాలపై తన పట్టు బిగించుకున్నది.


నయా ఫాసిస్టు ధోరణులు

మన దేశంలో ప్రజాస్వామ్యం ఇవాళ తీవ్ర ప్రమాదాన్ని ఎదుర్కొంటున్నది. ఏ యే రంగాల్లో ప్రజాస్వామ్యాన్ని డొల్ల చేస్తూ వస్తున్నారో రేఖామాత్రంగా మనం చూశాం. ఈ ప్రమాదానికి మూల కారణం ఏంటంటే ఆర్.ఎస్.ఎస్-బి.జె.పి లకు, స్వాతంత్ర్య పోరాట వారసత్వం లేకపోవడం. గణతంత్ర ప్రజాస్వామిక రాజ్యాంగం అంటే గిట్టకపోవడమే. వాటిది హిందూత్వ సైద్ధాంతిక నేపథ్యం. కేంద్రీకృత అధికారాలతో కూడిన పిడివాద, ఫాసిస్టు తరహా హిందూ మత రాజ్యస్థాపనే ఆ సంస్థల లక్ష్యం. మత ప్రాతిపదికన పౌరసత్వం, పరిపాలన సాగాలనేది వాటి ఎజెండా. ఈ మతోన్మాద ధోరణులకు నయా ఉదారవాద ఆర్థిక విధానాలు తోడు కావడం నయా ఫాసిస్టు ధోరణులకు దారి తీస్తున్నది. ఈ క్రమంలోనే రాజ్యాంగ బద్ధమైన వ్యవస్థల మీద మోడీ ప్రభుత్వం ప్రణాళికబద్ధంగా దాడి చేస్తూ వాటిని నిర్వీర్యం చేస్తూ వస్తున్నది. కాబట్టి ఈ వినాశకరమైన విభజిత, విద్వేష సిద్ధాంతాన్ని తిప్పికొట్టకుండా మనం ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించుకోలేము.

మన ప్రజాస్వామిక, లౌకిక, గణతంత్ర రాజ్యాన్ని రక్షించుకోవాలన్నా, సామాజిక న్యాయం, సమాఖ్య తత్వాలను కాపాడుకోవాలన్నా...హిందూత్వ శక్తులను ప్రతిఘటించి ఓడించడమే మన ముందున్న ఏకైక మార్గం. 'భారతీయతా భావాన్ని' నిలబెట్టుకోవడానికి ఇదొక్కటే మార్గం.

/వ్యాసకర్త సిపిఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు /

మన్యాన్ని కార్పొరేట్లకు అప్పగించే కుట్ర



కె.లోకనాథం

ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరులో లగిసపల్లి ప్రాంతంలో జరిగిన ఉత్సవాల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పాల్గొన్నారు. ఆదివాసులకు వరాల జల్లు కురిపిస్తారని ఎంతో ఆశతో ఎదురుచూసిన వారికి నిరాశే మిగిలింది. ముఖ్యంగా జీవో నెం.3 పునరుద్ధరణ గురించి, అటవీ హక్కుల పట్టాల పంపిణీ, పి.ఎం జన్‌మన్ పథకం కింద నిర్మాణం అవుతున్న ఇళ్లకు నిధుల పెంపు, అదాని, నవయుగ పంప్డ స్టోరేజ్ ప్రాజెక్టుల అనుమతుల రద్దు, పోలవరం నిర్వాసితులకు నిధుల విడుదల, ఏజెన్సీ ప్రాంతం సమగ్రాభివృద్ధి కోసం ప్రణాళికను ప్రకటిస్తారని వారంతా ఎదురు చూశారు. కానీ రాష్ట్ర ముఖ్యమంత్రిగా కన్నా కంపెనీల సిఇఒ (చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్)గానే ఆయన వ్యవహరించారు. ఏజెన్సీ ప్రాంతాన్ని కార్పొరేట్ శక్తులకు అప్పజెప్పాలనే కృతనిశ్చయంతో ఉన్నట్లు ఆయన ప్రకటనలలో వ్యక్తమైంది.

విద్యా వైద్యం, మౌలిక సదుపాయాల కోసం నిధుల కేటాయింపు, కాఫీ బోర్డు, గిరిజన సహకార సంస్థ (జిసిసి) బలోపేతానికి కృషి చేస్తారని, రాజ్యాంగంలో 5వ షెడ్యూల్లో పేర్కొన్న భూ రక్షణ, సంస్కృతి, స్వయం ప్రతిపత్తి, రక్షణ విషయాలు, సామాజిక, ఆర్థిక అభివృద్ధికి ప్రత్యేక నిధులు, పథకాలు ప్రకటిస్తారని ఆదివాసీలు ఎదురు చూశారు. గిరిజన ఉత్పత్తులకు గిట్టుబాటు ధర కల్పిస్తారని, స్థానిక వనరులపైన, నీటి వనరులకు హక్కులు కల్పిస్తారని ఆశపడ్డారు. అన్నీ అడియాశలే అయ్యాయి. ముఖ్యమంత్రి ప్రసంగం ఆసాంతం ఆదివాసీ ప్రాంతంలో వున్న సహజ వనరులను ఎలా కార్పొరేట్ వ్యక్తులకు అప్పజెప్పాలనే సంకల్పమే వినిపించింది.

ఆదివాసీ ప్రాంతాలు అభివృద్ధికి ఆమడ దూరంలో వున్నాయి. వారు విద్యా, వైద్యం, మౌలిక వసతుల్లేక అల్లాడుతున్నారు. ప్రతి రోజూ డోలీ మోతలు తప్పడంలేదు. సాగు చేసుకున్న అటవీ భూములకు పట్టాలు ఇవ్వకుండా ఇబ్బందులు పెడుతున్నారు.



గత 10 సంవత్సరాల నుండి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జిసిసి కి కేటాయించాల్సిన ప్రత్యేక నిధులు కేటాయించకపోవటంతో గిరిజన సహకార సంస్థ బలహీనపడింది. గిరిజనుల పంటలు దళారుల పాలవుతున్నాయి. వారు అతి తక్కువ ధరలకు కొనుగోలు చేస్తూ తమ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. ఖరీదైన కాఫీ, మిరియాలు, పసుపు వంటి పంటల కొనుగోళ్లు జిసిసి, ఐటిడిఎ ద్వారా అంతంత మాత్రంగానే జరుగుతున్నాయి.

కాఫీ అభివృద్ధికి ఈ ప్రాంతం అనువైనదని మూడు దశాబ్దాల క్రితమే గుర్తించారు. అప్పటి నుండి కాఫీ బోర్డు, ఎపి ఎఫ్‌డిసి గిరిజనులకు అనేక ప్రోత్సాహకాలు అందించాయి. నేడు 2 లక్షల 58 ఎకరాల్లో కాఫీ పంట సాగవుతోంది. అంతర్భాగంగా మిరియాలు కూడా పండిస్తున్నారు. అరకు కాఫీకి అంతర్జాతీయ బ్రాండ్ ఇమేజ్ వచ్చింది. మరోపక్క కేంద్ర ప్రభుత్వం కాఫీ బోర్డును, రాష్ట్ర ప్రభుత్వం ఎపి ఎఫ్‌డిసిని గత పదేళ్ల నుండి బలహీనపర్చే చర్యలు చేపట్టాయి. ఈ రెండు సంస్థలు బలహీన పడడంతో కాఫీ పంటపై ఆధారపడిన కార్మికులకు కూడా దిక్కులేని స్థితి ఏర్పడింది. గిరిజనులకు అందాల్సిన ప్రోత్సాహక నిధులు అందడంలేదు. అందులో కూడా అవినీతి, అక్రమాలు జరుగుతున్నాయి. గిరిజనులు పండించిన పంటకు గిట్టుబాటు ధర రాక, అంతర్జాతీయ మార్కెట్‌తో పోటీపడలేక అనేక ఇబ్బందులు పడుతున్నారు. జిసిసి, ఐటిడిఎ ద్వారా కొనుగోలు కూడా అంతంత మాత్రమే జరుగుతోంది. రైతులకు ఇవ్వాల్సిన బకాయిల కోసం నెలల తరబడి వేచి చూడాల్సిన దుస్థితి వుంది. ఈ నేపథ్యంలో మరో గత్యంతరం లేక ప్రైవేట్ దళారులు, స్వచ్ఛంద సంస్థలను ఆశ్రయించి, ఆనక వారి చేతిలో గిరిజనులు తీవ్రంగా మోసపోతున్నారు. నేడు లక్ష ఎకరాల్లో కాఫీ పంట వేయడానికి, బ్రాండింగ్, మార్కెటింగ్‌కు టాటా, ఐటిసి కంపెనీలతో ఎంఒయు చేసుకుంటున్నట్లు ముఖ్యమంత్రే స్వయంగా ప్రకటించారు. దీనితో కాఫీ రైతులకు లాభం కన్నా నష్టమే జరుగుతుంది. కాఫీ రైతులను సంప్రదించకుండా, వారి అభిప్రాయాలు తెలుసుకోకుండా టాటా, ఐటిసి వంటి సంస్థలతో ఐటిడిఎ, జిసిసి ఎంఒయులు కుదుర్చుకున్నట్లు ఏకపక్షంగా ప్రకటించడం అన్యాయం. ట్రైబల్ అడ్వయిజరీ కమిటీ, ఐటిడిఎల పాలక వర్గాలతో చర్చించకుండా ఇలాంటి ఎంఒయులు కుదుర్చుకుంటే ఐటిడిఎ పాలక వర్గానికి ప్రజల్లో విశ్వసనీయత ఏముంటుంది? ఇది గిరిజనులకు ద్రోహం చేసే చర్య.

గిరిజన ప్రాంత అభివృద్ధి పేరుతో 21 ఒప్పందాలు కుదుర్చుకున్నట్లు ముఖ్యమంత్రి వెల్లడించారు. ఇందులో ప్రకృతి సహజ సిద్ధమైన అందాలకు నెలవైన మన్యంలో గిరిజన ఆచార, సాంప్రదాయాలు, సంస్కృతితో పర్యాటకులను ఆనందపరుస్తూ ఆతిథ్యం ఇచ్చేందుకు ప్రభుత్వం సరికొత్త కార్యక్రమం రూపొందించినట్లు వివరించారు. కొండ ప్రాంతాల్లో గిరిజనులు నివాసం వుంటున్న ఇళ్లలోనే టూరిస్టులకు బస కల్పించే చర్యలు చేపట్టాలని సెలవిచ్చారు. అందులో భాగంగా 1000 హోం స్టేలు ఏర్పాటు చేయాలని, వాటి నిర్వహణ బాధ్యత స్థానికులదేనని చెబుతూ దీనికి 10 కోట్లు కేటాయిస్తున్నట్లు ప్రకటించారు. వీటికి సంబంధించి ఓయో హోమ్స్, హోమీ హట్స్ సంస్థలతో ఒప్పందం జరిగిందని, గిరిజనులకు సుస్థిరత అభివృద్ధి జరుగుతుందని సెలవిచ్చారు. చింతపల్లిలో రెడ్ చెర్రీ రిఫైనింగ్, ప్రాసెసింగ్ యూనిట్ సహా మౌలిక సదుపాయాల కల్పనకు సబ్ కో సంస్థతో ఒప్పందం కుదిరిందని చెప్పారు. గిరిజన మహిళలు తయారు చేసిన ఉత్పత్తుల మార్కెటింగ్‌ను ఈజీ మార్ట్ వంటి సంస్థలకు అప్పగించినట్టు ప్రకటించారు. దీంతో పాటు ప్రకృతి సిద్ధమైన బొర్రా గుహలు, అరకులోయ, కొత్తపల్లి జలపాతం, మేఘాల కొండ, లంబసింగి, గుడిసె, మారేడుమిల్లి, తారాబు జలపాతం, డల్లాపల్లి వంటి ప్రాంతాలను ఎకో టూరిజం పేరుతో అభివృద్ధి చేయాలని ఆదేశాలు ఇచ్చారు. ఈ చర్యలు రాజ్యాంగంలో గిరిజనులకు ఇచ్చిన హక్కులను కాలరాయడమే. 5వ షెడ్యూల్లో పేర్కొనబడిన భూమి, సంస్కృతి, అడవి, భాష వంటి వాటికి తిలోదకాలు ఇవ్వడమే. రాజ్యాంగానికి తూట్లు పొడుస్తూ అడవి, సంపదను కార్పొరేట్, ప్రైవేట్ వ్యక్తులకు ధారాదత్తం చేసే అధికారం ముఖ్యమంత్రికి ఎవరిచ్చారు?

గిరిజనులకు 2006 అటవీ హక్కుల చట్టం ప్రకారం పట్టాలు ఇవ్వాలి. 1996 పీసా చట్టాన్ని, పంచాయితీ రాజ్ వ్యవస్థను బలోపేతం చేయాలి. ఆర్థిక స్థిరత్వం, సాంప్రదాయ జీవనం, సాంస్కృతిక గుర్తింపు, స్థానిక వనరులపై హక్కులు, గిరిజనులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు, స్వయం ఉపాధి, పాలన, నీటి వనరులపై హక్కులను కాపాడుకొనేలా ప్రభుత్వ చర్యలు వుండాలేతప్ప వాటిని కార్పొరేట్ పరం చేసేలా కాదు.

/ వ్యాసకర్త సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు /

కన్నడ నటుడు దర్శన్, నటి పవిత్రా గౌడ్ అరెస్టు



బెంగళూరు : అభిమాని రేణుగా స్వామి హత్య కేసులో కన్నడ సినీ నటుడు దర్శన్ తూగుదీప, నటి పవిత్రా గౌడ్‌ను పోలీసులు గురువారం నాడు అరెస్టు చేశారు. ఈ కేసులో దర్శన్, మరో ఆరుగురికి కర్ణాటక హైకోర్టు ఇచ్చిన బెయిల్‌ను సుప్రీంకోర్టు గురువారం రద్దు చేసిన కొంత సమయంలోనే ఈ అరెస్టు జరిగింది. హొసకెరెహల్లిలోని నివాసం నుంచి దర్శన్ పోలీసులు అరెస్టు చేశారు. గురువారం ముందుగా బెయిల్‌ను రద్దు చేస్తూ 'ఒక వ్యక్తి ఎవరైనా, ఎంత ఉన్నతుడైనా అతను చట్టానికి అతీతుడు కాదు' అని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించి. దర్శన్ వెంటనే లొంగిపోవాలని, అతన్ని కస్టడీలోకి తీసుకోవాలని రాష్ట్ర అధికారులను జస్టిస్ జె.బి.పార్దివాలా, జస్టిస్ ఆర్ మహదేవన్ ధర్మాసనం ఆదేశించింది. జైల్లో నటుడు తన ఇమేజ్‌ను దుర్వినియోగం చేసినట్లు ఏదైనా ఫోటోగానీ, వీడియో కానీ వెల్లడయితే అధికారులు తక్షణమే కోర్టును సంప్రదించాలని కోర్టు స్పష్టం చేసింది. హైకోర్టు యాంత్రికంగా విచారణ జరిపి దర్శన్‌కు బెయిల్ మంజూరు చేసింది ధర్మాసనం విమర్శించింది. బెయిల్ ఉత్తర్వులు లోపభూయిష్టంగా ఉన్నాయని పేర్కొంది.

కాగా గురువారం బెయిల్ రద్దయి తరువాత బెంగళూరులోని రాజరాజేశ్వరి నగర్‌లోని నివాసం నుంచి నటి పవిత్రా గౌడ్‌ను కూడా పోలీసులు అరెస్టు చేశారు. పవిత్రా గౌడ్‌కు అసభ్యకర సందేశాలు పంపాడని ఆరోపిస్తూ 33 ఏళ్ల రేణుకస్వామి అనే అభిమానిని గతేడాది జూన్‌లో కిడ్నాప్ చేసి, హత్య చేశారని దర్శన్, మరోఆరుగురుపై కేసు నమోదయింది. గతేడాది డిసెంబర్ 13న వీరికి హైకోర్టు బెయిల్ మంజూరు చేసింది. దీనిని కర్ణాటక ప్రభుత్వం సుప్రీంకోర్టులో సవాలు చేయగా..దర్శన్‌కు, ఇతరులకు ఇచ్చిన బెయిల్ రద్దు చేస్తూ ధర్మాసనం ఆదేశాలు జారీ చేసింది.

వ్యాపారం కోసం రూ.60 కోట్ల రుణం.. ఆపై జల్సాలు

- బాలీవుడ్ నటి శిల్పాశెట్టి దంపతులపై ఆరోపణలు
- జుహు పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు

ముంబయి : వ్యాపారాన్ని విస్తరించేందుకు రుణంగా తీసుకున్న సొమ్మును అందుకోసం వినియోగించకుండా వ్యక్తిగత జల్సాలకు వాడుకొని మోసం చేశారంటూ బాలీవుడ్ నటి శిల్పాశెట్టి, ఆమె భర్త రాజ్‌కుంద్రాపై కేసు నమోదైంది. ముంబయికి చెందిన దీపక్ కొఠారి అనే వ్యాపారవేత్త ఫిర్యాదు మేరకు గురువారం జుహు పోలీసులు ఈ కేసు నమోదు చేశారు. సమగ్ర దర్యాప్తు కోసం ఈ కేసును ఆర్థిక నేరాల విభాగానికి బదిలీ చేశారు. ఫిర్యాదీదారుడు తెలిపిన వివరాల ప్రకారం..2015లో రాజేష్ ఆర్య అనే ఏజెంట్ ద్వారా వీరికి దీపక్‌తో పరిచయం ఏర్పడింది. ఆ సమయంలో శిల్పాశెట్టి, కుంద్రా.. బెస్ట్ డీల్ టివి ప్రయివేటు లిమిటెడ్ అనే సంస్థకు డైరెక్టర్లుగా ఉన్నారు. అందులో శిల్పాశెట్టికి 87 శాతం కంటే అధిక వాటాలను కలిగి ఉన్నారు. ప్రస్తుతం నిర్వహణలో ఈ సంస్థ వ్యాపార విస్తరణ కోసం 12 శాతం వడ్డీతో రూ.75 కోట్లు రుణం కావాలని వారు దీపక్‌ను కోరగా..ఆయన 2015-2023 మధ్య రూ.60.48 కోట్లు ఇచ్చారు. అయితే శిల్పా దంపతులు ఆ సొమ్మును వ్యక్తిగత జల్సాలకు వినియోగించారు. రుణం తీసుకున్న కొన్నాళ్లకే శిల్పా తన డైరెక్టర్ పదవికి రాజీనామా చేశారు. అయితే ఈ విషయం దీపక్ తెలియకుండా దాచారు. ఆ తర్వాత కంపెనీ సైతం దివాలా తీసింది. ఈ నేపథ్యంలో తనను మోసం చేసి రూ.60 కోట్లు జల్సాల కోసం వాడుకున్న శిల్పా దంపతులపై తగిన చర్యలు తీసుకొని తనకు న్యాయం చేయాలని ఫిర్యాదిదారుడు కోరారు.

స్థానిక రీజెంట్స్‌పై చైనా ఫార్మా కంపెనీల దృష్టి

షాంఘై : స్థానిక ఉత్పత్తిదారుల నుంచి కీలకమైన సరఫరాలు (కారకాలు-రీజెంట్స్) పొందేందుకు చైనాలోని ఔషధ పరిశోధన, అభివృద్ధి సంస్థలు ఆసక్తి చూపుతున్నాయి. ఖర్చులను తగ్గించుకునేందుకు, విదేశీ సరఫరాల్లో జరుగుతున్న జాప్యాన్ని నివారించేందుకు స్థానిక కొనుగోళ్లపై ఆ కంపెనీలు ఆసక్తి కనబరుస్తున్నాయని పరిశ్రమ వర్గాలు తెలిపాయి. అమెరికాకు చెందిన థెర్మో ఫిషర్ సైంటిఫిక్, జర్మనీకి చెందిన మెర్క్ వంటి పశ్చిమ దేశాల సరఫరాదారులు ప్రస్తుతం చైనాకు రీజెంట్స్‌ను విక్రయిస్తున్నారు. అమెరికా మొదలు పెట్టిన వాణిజ్య యుద్ధం కారణంగా చైనా దిగుమతి సుంకాలు పెరుగుతున్నాయి. దీంతో చైనా ఔషధ సంస్థలు షాంఘై టైటాన్ సైంటిఫిక్ వంటి స్థానిక కంపెనీల నుంచి రీజెంట్స్‌ను కొనుగోలు చేయాలని భావిస్తున్నాయి. చైనా రీజెంట్ మార్కెట్ తన ల్యాబ్, రోగ నిర్ధారణ అవసరాల కోసం దిగుమతులపై ఎక్కువగా ఆధారపడుతోంది. గత సంవత్సరం 5.76 డాలర్ల విలువ కలిగిన దిగుమతులు జరిగాయి. 2023లో జరిగిన 5.83 డాలర్ల రీజెంట్స్ దిగుమతులతో పోలిస్తే ఇది కొంచెం తక్కువే. ఏప్రిల్‌లో అమెరికా ఉత్పత్తులపై చైనా 125 శాతం సుంకం విధించిన విషయం తెలిసిందే. అప్పటి నుంచి దేశీయంగా తయారైన రీజెంట్స్ వినియోగం పెరిగింది. తాజాగా అమెరికా, చైనా దేశాలు పరస్పర ప్రతీకార సుంకాల విధింపును మరో 90 రోజులు వాయిదా వేసుకున్నాయి. అయినప్పటికీ దేశీయంగా తయారవుతున్న రీజెంట్స్‌ను కొనుగోలు చేసేందుకే చైనా ఫార్మా సంస్థలు మొగ్గు చూపుతున్నాయి. దేశీయంగా డిమాండ్ పెరుగుతుండడంతో రాబోయే ఐదు సంవత్సరాల కాలంలో చైనా రీజెంట్స్ మార్కెట్ ఏటా 10 శాతానికి పైగా వృద్ధి సాధించే అవకాశాలు కన్పిస్తున్నాయి.

మన ఆడబిడ్డలే ..మన గౌరవం

- ఉగ్రవాదంపై మానవాళి విజయానికి సిందూర్ ప్రతీక
- స్వాతంత్ర దినోత్సవ సందేశంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము



న్యూఢిల్లీ: 'మన ఆడ బిడ్డలే మనకు గౌరవం' అని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము కొనియాడారు. రక్షణ, భద్రత, క్రీడా రంగాలు సహా వివిధ రంగాల్లో విశ్వవేదికలపై భారత మహిళలు సాధించిన విజయాలను ఆమె ప్రస్తుతించారు. 79వ స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా గురువారం సాయంత్రం దేశ ప్రజలను ఉద్దేశించి ముర్ము సందేశమిచ్చారు. మన ఆడ బిడ్డలే మన గౌరవమని, ప్రతి రంగంలో అడ్డుగోడలన్నీ అమ్మాయిలు బద్ధలు కొడుతున్నారని కొనియాడారు. భారత మహిళలు రక్షణ, భద్రత, క్రీడా రంగాల్లో సైతం సాధికారత దిశగా అడుగులేస్తూ అమోఘమైన నైపుణ్యాలను ప్రదర్శిస్తున్నారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రపంచ చదరంగ (చెస్) క్రీడా పోటీలైన 'ఫిడె ఉమెన్స్ వరల్డ్ కప్' ఆఖరి పోరులో ఇద్దరూ భారత మహిళలే తలపడటాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఫిడె ఫైనల్స్‌లో 38 ఏళ్ల కోనేరు హంపిపై 19 ఏళ్ల దివ్య దేశ్‌ముఖ్ విజయం సాధించి విశ్వ విజేతగా నిలిచిన సంగతి తెలిసిందే. ఉద్యోగాల విషయంలోనూ పురుషులతో సమానంగా మహిళలు పోటీ పడుతున్నారని, ఉద్యోగాల్లో లింగ వ్యత్యాస రేటు క్రమంగా తగ్గుతోందని ముర్ము తెలిపారు. మహిళా సాధికారత కోసం చేపట్టిన 'నారీ శక్తి వందన్ అభియాన్' నినాదంగానే మిగిలిపోకుండా వాస్తవంగా మారుతోందని ఆమె అన్నారు.

ఉగ్రవాదంపై పోరులో ఆపరేషన్ సిందూర్ ఒక మైలురాయి

ప్రపంచం ఎదుర్కొంటున్న పెను సవాళ్లలో ఒక్కటైన ఉగ్రవాదంపై మానవాళి విజయానికి 'ఆపరేషన్ సిందూర్' ప్రతీకగా నిలిచిందని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము కొనియాడారు. ఉగ్రవాదంపై సాగిస్తున్న పోరాటంలో ఇదొక మైలురాయి అని ఆమె తెలిపారు. పహల్గాంలో అమాయక పౌరులపై జరిగిన ఉగ్రదాడిని అమానుషమైన, పిరికిపంద చర్యగా పేర్కొన్నారు. 'పహల్గాం ఉగ్రదాడిని దేశమంతా ముక్తకంఠంతో ఖండించింది. మనల్ని విభజించాలనుకునే వారికి దీటైన జవాబు ఇచ్చింది. 'ఆపరేషన్ సిందూర్' ద్వారా ఉగ్రమూకలకు గుణపాఠం నేర్పింది. దేశాన్ని కాపాడే విషయంలో మన సాయుధ బలగాలు ఎలాంటి పరిస్థితులనైనా ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉన్నాయని ఈ ఆపరేషన్ చాటింది' అని ఆమె అన్నారు.

బలంగా దేశ ఆర్థిక వ్యవస్థ

స్వావలంబన దేశంగా అవతరించే దిశగా భారత్ దృఢమైన విశ్వాసంతో ముందుకు సాగుతోందని చెబుతూ కేంద్ర ప్రభుత్వం చేపట్టిన పథకాలను, చర్యలను ఉదహరించారు. ద్రవ్యోల్బణం తగ్గుముఖం పట్టిందని, ఎగుమతులు పెరిగాయని, అన్ని కీలక సూచీలు దేశ ఆర్థిక వ్యవస్థ బలంగా ఉందని చూపిస్తున్నాయని తెలిపారు. 'సుపరిపాలన, అవినీతిని సహించని విధానాలతో భవిష్యత్తు దిశగా దేశం పయనిస్తోంది. గత ఆర్థిక సంవత్సరంలో 6.5 శాతం జిడిపి వృద్ధి రేటుతో.. ప్రపంచంలోని ప్రధాన ఆర్థిక వ్యవస్థల్లో భారత్ అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతోంది. కాశ్మీర్ లోయలో రైలు మార్గంతో స్థానికంగా వాణిజ్యం, పర్యాటకం మరింత మెరుగుపడతాయి' అని రాష్ట్రపతి ముర్ము పేర్కొన్నారు.

- ప్రపంచ చదరంగం (చెస్) క్రీడలో భారత్ ఆధిపత్యం కొనసాగిస్తోందని, ఇందుకు కృషి చేసిన క్రీడాకారులకు ముర్ము అభినందనలు తెలిపారు. గతేడాది 18 ఏళ్ల డి గుకేష్ ప్రపంచ అతిపిన్న చాంపియన్‌గా రికార్డు సృష్టించడం, అదే పరంపరలో ఈ ఏడాది ఆర్ ప్రజ్ఞానంద, అర్జున్ ఇరిగైసి, విదిత్ గుజరాతి, కోనేరు హంపి, దివ్య దేశ్‌ముఖ్, ఆర్ వైశాలి వంటి క్రీడాకారులు అత్యుత్తమ ప్రతిభతో ప్రపంచ స్థాయిలో మువ్వన్నెల జెండాను ఉన్నతస్థానంలో నిలిపారని ముర్ము హర్షం వ్యక్తం చేశారు. కోనేరు హంపిపై విజయం సాధించి ప్రపంచ కప్ సాధించిన అతి పిన్న వయస్కురాలిగా దేశ్‌ముఖ్ (19) గత నెలలో రికార్డు సృష్టించిన సంగతి తెలిసిందే.
- భారత వ్యోమగామి శుభాన్షు శుక్లా అంతరిక్ష యాత్రం యావత్ ప్రపంచానికే స్ఫూర్తిని ఇచ్చిందని ముర్ము తెలిపారు. నేటి తరానికి అంతటికీ శుభాన్షు గర్వకారణమని, మహోన్నతమైన కలల సాకారానికి గొప్ప స్ఫూర్తి అని కొనియాడారు.
- నేటి డిజిటల్ యుగంలో భారత్‌లో సమాచార, సాంకేతిక రంగాల్లో వేగవంతంగా వృద్ధి చెందుతున్నాయని, 4జి కనెక్టివిటి, డిజిటల్ చెల్లింపుల్లో దేశం ముందు భాగంలో నడుస్తోందని తెలిపారు. సాంకేతికాభివృద్ధి దశలో కృత్రిమ మేధ (ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్) తదుపరి మైలురాయిగా నిలువనుందని పేర్కొన్నారు.
- 1947 నాటి దేశ విభజన సమయంలో చోటుచేసుకున్న హింస కారణంగా లక్షలాది మంది ప్రజలు బలవంతంగా ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సివచ్చిందన్నారు. ఆ బాధను ఎన్నిటికీ మర్చిపోరాదన్నారు. నాటి హింసలో బాధితులైనవారికి నివాళులర్పిస్తూ.. ఆగస్టు 14వ తేదీని 'విభజన గాయాల స్మరణ దినం'గా పాటిస్తున్నామని తెలిపారు.
- విలువలతో కూడిన విద్యనందించేలా 'జాతీయ విద్యా విధానం' రూపొందించినట్లు ముర్ము తెలిపారు.

ఛత్తీస్‌గఢ్‌లో అటవీ భూములు మాయం

- వేలాది ఎకరాల ఐఎఫ్ఆర్ టైటిళ్ల ఆచూకీ కనుమరుగు
- 'ద హిందూ' వెల్లడి - ఆర్‌టిఐ ద్వారా వెలుగులోకి

న్యూఢిల్లీ : ఛత్తీస్‌గఢ్‌లో అటవీ భూములు మాయమయ్యాయి. అటవీ హక్కుల చట్టం (ఎఫ్ఆర్ఎ) కింద గిరిజనులకు పంపిణీ చేసిన వ్యక్తిగత అటవీ హక్కులు (ఐఎఫ్ఆర్) టైటిళ్లలో వేలాది ఎకరాలకు పైగా టైటిళ్ల ఆచూకీ సంబంధిత రికార్డుల్లో కానరావడం లేదు. ఈ మేరకు సమాచార హక్కు చట్టం (ఆర్‌టిఐ) ద్వారా ప్రముఖ జాతీయ వార్తా సంస్థ 'ద హిందూ' సేకరించిన వివరాల్లో అనే దిగ్భ్రాంతికర వాస్తవాలు వెలుగులోకి వచ్చాయి. ద హిందూ కథనం ప్రకారం..దాదాపు గత 17 నెలల నుంచి ఛత్తీస్‌గఢ్‌లో ఎఫ్ఆర్ఎ కింద గిరిజనులకు భూములను పంపిణీ చేశారు. అయితే రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ రికార్డుల నుంచి ఈ భూముల వివరాలేవీ కనిపించడం లేదు. ఉదాహరణకు బస్తర్ జిల్లాలో 2024 జనవరి నాటికి పంపిణీ చేసిన వ్యక్తిగత అటవీ హక్కుల (ఐఎఫ్ఆర్) టైటిళ్ల సంఖ్య 37,958గా ఉంది. అయితే ఈ ఏడాది మే నాటికి ఈ సంఖ్య 35,180కు తగ్గింది. రాజ్‌నంద్‌గావ్ జిల్లాలో పంపిణీ చేసిన కమ్యూనిటీ ఫారెస్ట్ రిసోర్స్ రైట్ (సిఎఫ్ఆర్ఆర్) టైటిళ్ల సంఖ్య గతేడాది ఒక నెలలోనే 40 నుంచి 20కు తగ్గింది. బిజాపూర్ జిల్లాలో 2024 మార్చి వరకూ 299 సిఎఫ్ఆర్ఆర్ టిటైళ్లను పంపణి చేశారు. అయితే తరువాత నెల నాటికే ఈ సంఖ్య 297కు తగ్గింది. అధికారులు ధ్రువీకరించి ఇచ్చిన సమాచారం ప్రకారమే.. మాయమైన అటవీ భూములు వేలాది ఎకరాల్లో ఉండగా..వాస్తవంలో ఇంకా ఎక్కువే ఉంటుందని ఎఫ్ఆర్ఎ పరిశోధకులు, నిపుణులు అంటున్నారు. ఎఫ్ఆర్ఎ కింద పంపిణీ చేసిన భూములను వెనక్కి తీసుకునే అవకాశమే లేదని చెబుతున్నారు. ఎస్‌టిలు, ఇతర అటవీ నివాసితులకు అటవీ భూములను ఉపయోగించుకునే హక్కును ఈ చట్టం కల్పిస్తుంది. గ్రామసభలు, సబ్-డివిజనల్ స్థాయి కమిటీలు, జిల్లా స్థాయి కమిటీలు దరఖాస్తులను ఆమోదించిన తరువాత ఈ భూములు పంపిణీ చేస్తారు. మౌళిక సదుపాయాలు, ప్రభుత్వ ప్రాజెక్టుల కోసం సంబంధిత గ్రామసభల సమ్మతితో మాత్రమే నిర్దిష్ట సందర్భాల్లో భూములను సేకరించడానికి చట్టం అనుమతిస్తుంది.

హస్దియో అరణ్య బచావో ఆందోళన్ కార్యకర్త అలోక్ శుక్లా మాట్లాడుతూ '2016లో రాష్ట్ర ప్రభుత్వం పంపిణీ చేసిన కొన్ని భూములను రద్దు చేసింది. అయితే దీనికి వ్యతిరేకంగా దాఖలైన పిటిషన్ హైకోర్టులో పెండింగ్‌లో ఉంది' అని తెలిపారు. అటవీ భూములు మాయం కావడంపై అధికారులు స్పందిస్తూ 'గ్రామసభ, సబ్-డివిజనల్, జిల్లా స్థాయిల్లో పనిచేసే అధికారుల మధ్య సమాచార లోపం, రికార్డులు తప్పుగా నమోదవ్వడం.. వంటి కారణాలతో జరిగిఉంటుంది' అని తెలిపారు. ది హిందూ సేకరించిన సమాచారం ప్రకారం 2025 మే నాటికి, రాష్ట్రంలో ఎఫ్ఆర్ఎ అమలు చేస్తున్న 30 జిల్లాల్లో మొత్తం 4.82 లక్షల ఐఎఫ్ఆర్ టైటిళ్లు. 4,396 సిఎఫ్ఆర్ఆర్ టైటిళ్లు పంపిణీ చేశారు. రాయ్‌పూర్, దుర్గ్, బెమెతారా జిల్లాల్లో ఎఫ్ఆర్ఎ చేయడం లేదు. ఎఫ్ఆర్ఎపై కేంద్ర ప్రభుత్వ గణాంకాల ప్రకారం 2025 మే నాటికి, దేశంలో పంపిణీ చేసిన మొత్తం ఎఫ్ఆర్ఎ టైటిళ్లలో ఛత్తీస్‌గఢ్ వాటా 43 శాతం కంటే ఎక్కువగా ఉంది.

తమిళనాడులో పారిశుధ్య కార్మికులకు ఉచిత అల్పాహారం

- ఉచిత వైద్యం, ఇళ్లు కూడా
- కేబినెట్ ఆమోదం



చెన్నై : తమిళనాడులో పట్టణ స్థానిక సంస్థల్లో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు అక్కడి ప్రభుత్వం పలు సంక్షేమ పథకాలు ప్రకటించింది. వీటిలో ప్రతి రోజూ అల్పాహారం ఉచితంగా అందజేయాలని, అలాగే వైద్య ఖర్చులను ప్రభుత్వమే భరించాలని, గృహ నిర్మాణం, వారి పిల్లలకు ఉచిత విద్య అందించాలని నిర్ణయించింది. ఈ మేరకు ముఖ్యమంత్రి ఎంకె స్టాలిన్ నేతృత్వంలో గురువారం సమావేశమైన రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. పట్టణాల్లో పారిశుధ్య కార్మికుల పని ఉదయాన్నే ప్రారంభమవుతుందని, కాబట్టి వారు అల్పాహారం స్వీకరించడంలో సవాళ్లను ఎదుర్కొంటున్నారని, కాబట్టి పట్టణ స్థానిక సంస్థల ద్వారా రాష్ట్ర ప్రభుత్వం ఉచిత అల్పాహారాన్ని అందించాలని నిర్ణయించినట్లు స్టాలిన్ తెలిపారు. ఈ పథకాన్ని ముందుగా గ్రేటర్ చెన్నయ్ కార్పొరేషన్(జిసిసి)లో అమలు చేసి, తరువాత ఇతర పుర పాలక సంస్థలకు విస్తరించనున్నట్లు తెలిపారు. అలాగే పారిశుధ్య కార్మికులు వృత్తిపరంగా ఎదుర్కొంటున్న ప్రమాదాలను గుర్తించి, వారికి ఉచితంగా వైద్య చికిత్స అందించేందుకు కొత్త పథకం ప్రారంభిస్తామని తెలిపారు. కార్మికుల జీవితాల్లో వెలుగులునింపేలా అనేక కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు.

ట్రంప్ టారిఫోన్మాదానికి తలొగ్గేది లేదు

- దేశీయ ఉత్పత్తిదారులకు బ్రెజిల్ భరోసా
- ఆదుకునేందుకు మద్దతుగా ప్రత్యేక చర్యలు



దేశీయ ఉత్పత్తిదారుల సమావేశంలో మాట్లాడుతున్న లూలా

బ్రసీలియా : అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సుంకాలు మీద సుంకాలు పెంచుకుంటూ పోతూ ప్రపంచ దేశాలన్నింటిని బెదిరించేందుకు చేస్తున్న యత్నాలకు తాము తలొగ్గే ప్రసక్తే లేదని బ్రెజిల్ స్పష్టం చేసింది. అమెరికా టారిఫ్ పెంపుల కారణంగా నష్టాలు చవిచూస్తే దేశీయ ఉత్పత్తిదారులను ఆదుకునేందుకు ప్రత్యేకంగా చర్యలు చేపడుతోంది. ఇందులో భాగంగా అమెరికా విధించిన 50 శాతం టారిఫ్‌లతో దెబ్బతిన్న ఎగుమతిదారులకు మద్దతుగా 'సావరిన్ బ్రెజిల్' పేరుతో 550 కోట్ల డాలర్ల మేర రుణాలను అందచేస్తోంది. అలాగే పన్ను చెల్లింపులకు విరామాలు ప్రకటించింది. ఈ ప్రత్యేక కార్యాచరణలో చిన్న తరహా వ్యాపారాలకు ముఖ్యంగా ఆహార పదార్థాలకు సంబంధించిన వ్యాపారస్తులకు ప్రాధాన్యతనిచ్చింది.

టారిఫ్‌లకు ప్రభావితమైన గ్రామీణ, వ్యవసాయ-పారిశ్రామిక రంగాల నుండి ప్రభుత్వ సేకరణలకు వెసులుబాటు కల్పించింది. ఎగుమతి హామీ వ్యవస్థలను ఆధునీకరించింది. ఉత్పత్తి వ్యవస్థలో చెల్లించిన పన్నులను తిరిగి వెనక్కి ఇచ్చే కార్యక్రమాన్ని పునరుద్ధరించింది.

సంక్షోభాలను ధైర్యంగా ఎదుర్కొంటాం : లూలా

దేశంలో అమెరికా టారిఫ్‌ల పెంపు కారణంగా ఆర్థికంగా ఎదురౌతున్న సంక్షోభాలను ధైర్యంగా ఎదుర్కొంటామని బ్రెజిల్ అధ్యక్షులు లూలా డసిల్వా ప్రకటించారు. ప్రత్యేక కార్యాచరణ ప్రకటన సందర్భంగా ఆయన మాట్లాడుతూ టారిఫ్‌ల పెంపుపై ట్రంప్ వాదనలను తిరస్కరించారు. సంక్షోభం తలెత్తినపుడు తాము భయపడబోమని, ఆందోళన చెందబోమని, ధైర్యంగా ఎదుర్కొంటామని స్పష్టం చేశారు. ప్రస్తుతానికి బ్రెజిల్ ఎలాంటి ప్రతీకార చర్యలు చేపట్టబోదని లూలా చెప్పారు. సంబంధాలను దెబ్బతీసుకునే స్థాయిలో తాము ఎలాంటి చర్యలు చేపట్టాలనుకోవడం లేదని అన్నారు. ఈ టారిఫ్‌లు విధించడానికి ట్రంప్ పేర్కొంటున్న కారణాలను ఆయన తోసిపుచ్చారు. దేశంలో మానవ హక్కులను గౌరవించడం లేదని చేసిన ఆరోపణలను ఎంత మాత్రమూ ఆమోదించలేమన్నారు.

బ్రెజిల్ అధికారులపై అమెరికా వీసా ఆంక్షలు

బ్రెజిల్, ఆఫ్రికా, కరేబియన్ అధికారుల వీసాలను రద్దు చేస్తున్నట్టు అమెరికా ప్రకటించింది. విదేశాలకు వైద్యులను పంపించే క్యూబా కార్యక్రమంతో సంబంధాలు కలిగి ఉన్నారన్న ఆరోపణతో వారి వీసాలను అమెరికా రద్దు చేసింది. విదేశాలకు క్యూబా బలవంతంగా వైద్యులను పంపుతోందని అమెరికా నిందిస్తోంది. వీసా రద్దయిన బ్రెజిల్ ఆరోగ్య మంత్రిత్వ శాఖ ఇద్దరు అధికారుల్లో మొజార్ట్ జులియో తబోసా సేల్స్, ఆల్బర్టో క్లెయిమన్ ఉన్నారు. బ్రెజిల్‌కు చెందిన 'మోర్ డాక్టర్స్' కార్యక్రమంలో పనిచేస్తున్నందుకు అమెరికా వీరిపై వీసా ఆంక్షలు విధించింది. క్యూబా ప్రజలకు అవసరమైన అత్యవసర వైద్య సేవలు అందకుండా అక్కడి ప్రభుత్వం వైద్యులను బలవంతంగా విదేశాలకు పంపుతోందని అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రుబియో ఆరోపించారు. క్యూబా ఆరోగ్య కార్యక్రమానికి సహకరిస్తున్న ఆఫ్రికా దేశాలు, కరేబియన్ దేశమైన గ్రెనడా అధికారులపై కూడా ఆంక్షలు విధించామని వివరించారు. అయితే ఏయే ఆఫ్రికా దేశాల అధికారులపై ఆంక్షలు విధించిందీ ఆయన చెప్పలేదు. కాగా తన వైద్య కార్యక్రమాన్ని నిలిపివేసేందుకు అమెరికా నిరాశావాదంతో కూడిన కారణాలు చెబుతోందని క్యూబా విమర్శించింది. అమెరికా ఎన్ని ఆంక్షలు విధించినప్పటికీ విదేశాలకు వైద్య సహకారం కొనసాగుతుందని స్పష్టం చేసింది.

సూడాన్‌లో కలరా కాటుకు 40 మంది మృతి

ఖార్టూమ్ : సూడాన్‌లో కలరా కలకలం రేపుతోంది. గత వారంలో సూడాన్‌లోని పశ్చిమ డార్ఫర్ ప్రాంతంలో 2300కి పైగా కలరా కేసులు నమోదవగా, 40మంది మరణించారు. డాక్టర్స్ వితౌట్ బోర్డర్స్ (ఎంఎస్ఎఫ్) గురువారం ఈ విషయాన్ని వెల్లడించింది. సూడాన్‌లో కొనసాగుతున్న యుద్ధానికి తోడు సూడాన్ ప్రజలు పెచ్చరిల్లిన కలరాతో అత్యంత భయంకరమైన, అధ్వాన్నమైన పరిస్థితులను అనుభవిస్తున్నారని ఎంఎస్ఎఫ్ ఒక ప్రకటనలో తెలిపింది. బాధిత ప్రాంతాల్లో కలరా వ్యాక్సిన్ వేస్తున్నారని పేర్కొంది. సూడాన్‌లోని అన్ని రాష్ట్రాల్లో 132 లోకాలిటీల వ్యాప్తంగా 99,756 కేసులు నమోదయ్యాయి. మొత్తంగా 2475 మరణాలు సంభవించాయని సూడాన్ ఆరోగ్య శాఖ వర్గాలు బుధవారం తెలిపాయి. ముఖ్యంగా నిర్వాసితులైన ప్రజలు నివసించే ప్రాంతాల్లో ఈ వ్యాధి బాగా ప్రబలుతోంది. ఆ ప్రాంతాల్లో పరిశుభ్రమైన తాగునీరు కొరవడడం, పారిశుధ్య సేవలు లేకపోవడం ఈ వ్యాధి పెచ్చరిల్లడానికి కారణమవుతున్నాయని ఆ ప్రకటన పేర్కొంది. దేశంలోజరుగుతున్న పోరు నుండి తప్పించుకునేందుకు ప్రజలు అటూ ఇటూ తిరుగుతుండడంతో కలరా కూడా చాలా వేగంగా వ్యాప్తి చెందుతోందని ఆ ప్రకటన పేర్కొంది. సూడాన్, పొరుగున గల చాద్, దక్షిణ సూడాన్‌లకు పాకుతోంది. 2023 ఏప్రిల్ నుండి సూడాన్‌లో తీవ్ర స్థాయిలో సూడాన్ సాయుధ బలగాలకు, పారామిలటరీ రాపిడ్ సపోర్ట్ బలగాలకు మధ్య ఘర్షణలు జరుగుతున్నాయి.

దుస్సాహసాలకు పాల్పడితే తీవ్ర పర్యవసానాలు

- పాక్‌కు భారత్ హెచ్చరిక

న్యూఢిల్లీ : వాక్చాతుర్యానికి అడ్డుకట్ట వేయాలని పాకిస్తాన్‌కు భారత్ గురువారం సూచించింది. ఎలాంటి దుస్సాహస చర్యలకైనా పాల్పడితే ఇటీవల కలిగినట్లుగా బాధాకరమైన పర్యవసానాలు తప్పవని పాక్ నాయకత్వాన్ని హెచ్చరించింది. భారత్‌పై పాకిస్తాన్ ఇటీవల యుద్ధోన్మాదంతో చేసిన వ్యాఖ్యలు, అందుకు సంబంధించిన వార్తలను విదేశాంగ శాఖ ప్రతినిధి రణధీర్ జైస్వాల్ ఈ సందర్భంగా ప్రస్తావిస్తూ ప్రతీ వారం జరిపే మీడియా సమావేశంలో మాట్లాడారు. తన వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు భారత్ వ్యతిరేక వ్యాఖ్యలకు పాకిస్తాన్ పాల్పడుతోందని ఆయన విమర్శించారు.

అమెరికాలో పర్యటన సందర్భంగా పాకిస్తాన్ ఆర్మీ చీఫ్ అసిమ్ మునీర్ భారత్‌కు అణు బెదిరింపులు చేశారు. భారత్ నుండి తమ అస్తిత్వానికి ముప్పు వాటిల్లే పరిస్థితే ఎదురైతే సగానికి పైగా ప్రపంచాన్ని తాము కిందకు లాగి పడేస్తామని వ్యాఖ్యానించారు ఆ తర్వాత పాక్ మాజీ విదేశాంగ మంత్రి బిల్వాల్ భుట్టో కూడా ఇదే తరహాలో వ్యాఖ్యలు చేశారు. భారత్ వల్ల పాకిస్తాన్‌కు తీవ్ర నష్టం జరుగుతోందని, ఇటువంటి సమయంలో దేశ ప్రజలు ఐక్యంగా వుండాలంటూ కోరారు.

క్షిపణుల పర్యవేక్షణకు ప్రత్యేక విభాగం

క్షిపణుల పర్యవేక్షణకు సైన్యంలో 'రాకెట్ ఫోర్స్' ప్రత్యేక విభాగాన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు పాకిస్థాన్ ప్రధానమంత్రి షెహబాజ్ షరీఫ్ బుధవారం అర్ధరాత్రి ప్రకటించారు. ఈ మేరకు నిర్వహించిన ఒక కార్యాక్రమంలో ఆయన మాట్లాడుతూ సైనిక సామర్థ్యాన్ని మరింత బలోపేతం చేసేలా రాకెట్ ఫోర్స్ పనిచేస్తుందన్నారు.



గుజరాత్‌లోని వల్సాడ్‌లో ఆందోళన చేస్తున్న గిరిజనులు

జీవనోపాధికి దెబ్బ

- పార్-తాపి-నర్మదా ప్రాజెక్టు వద్దే వద్దు
- గుజరాత్‌లో గిరిజనుల భారీ నిరసన

అహ్మదాబాద్: గుజరాత్‌లో వివాదాస్పద పార్-తాపి-నర్మదాల లింక్ ప్రాజెక్టు మళ్లీ చర్చకు దారి తీసింది. గిరిజనుల నుంచి తీవ్ర వ్యతిరేకత రావటంతో దీనిని రద్దు చేస్తున్నట్టు మూడేళ్ల క్రితం గుజరాత్ ప్రభుత్వం ప్రకటించింది. అయితే ఇటీవల లోక్‌సభలో ఈ ప్రాజెక్టుకు సంబంధించి సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డిపిఆర్) ప్రవేశపెట్టడంతో ఈ ప్రాజెక్టుపై మళ్లీ ఆందోళనలు ఊపందుకున్నాయి. గిరిజనుల ప్రాబల్యమున్న ధరమ్‌పూర్, వల్సాడ్‌లలో భారీ నిరసన ర్యాలీలు జరిగాయి. వేలాది మంది గిరిజనులు ఈ ఆందోళనల్లో పాల్గొన్నారు. పార్-తాపి-నర్మదా ప్రాజెక్టుకు వ్యతిరేకంగా గళమెత్తారు. తమ ఇళ్లు, సంస్కృతి, జీవనోపాధిని నాశనం చేసే ఈ ప్రాజెక్టును పూర్తిగా రద్దు చేయాలని డిమాండ్ చేశారు. 'డ్యామ్ వద్దు, ఇక్కడి నుంచి తరలివెళ్లం' అనే స్పష్టమైన సందేశంతో ఆదివాసీలు ఆందోళనలు జరుపుతున్నారు. మూడేళ్ల క్రితం వరకు ఈ వివాదాస్పద ప్రాజెక్టుపై ఇవే ఆందోళనలు, నిరసనలు వెల్లువెత్తాయి. ఆదివాసీ హక్కులపై ఆందోళన వ్యక్తమైంది. అయితే 2022లో అప్పటి గుజరాత్ ముఖ్యమంత్రి భూపేంద్ర పటేల్ ఈ ప్రాజెక్టును రద్దు చేస్తున్నట్టు ప్రకటించారు. దీంతో అంతా అయిపోయిందనుకుంటున్న తరుణంలో తాజాగా లోక్‌సభలో ఈ ప్రాజెక్టుకు సంబంధించిన డీపీఆర్‌ను ప్రవేశపెట్టడంతో దక్షిణ గుజరాత్‌లోని గిరిజనుల నుంచి తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతున్నది. 'డ్యామ్ రిమూవల్ కమిటీ' బ్యానర్ కింద ధరమ్‌పూర్‌లో వేలాది మంది గుమిగూడారు. ఇక్కడి గ్రామాలకు చెందిన ప్రజలు ప్రాజెక్టుకు ర్యాలీని జరిపారు. గుజరాత్ కాంగ్రెస్ అధ్యక్షులు అమిత్ ఛవ్డా, వన్స్‌డా ఎమ్మెల్యే అనంత్ పటేల్‌లు వారితో కలిసి నడిచారు. ఒకపక్క రాష్ట్ర ప్రభుత్వం ఈ ప్రాజెక్టును రద్దు చేశామని ప్రకటించినప్పటికీ.. పార్లమెంటులో జరుగుతున్న పరిణామాలు ఇందుకు పూర్తి విరుద్ధంగా ఉన్నాయని అనంత్ పటేల్ అన్నారు. ఇది బిజెపి ద్వంద్వ వైఖరికి అద్దం పడుతున్నదని విమర్శించారు. ఇటు వల్సాడ్ జిల్లాకు చెందిన వేలాది మంది గిరిజనులు కూడా గురువారం పెద్ద ఎత్తున నిరసన తెలిపారు. ప్రాజెక్టును పూర్తిగా రద్దు చేయాలని డిమాండ్ చేశారు. మరోవైపు గిరిజనుల ఆందోళనల నేపథ్యంలో ఎలాంటి ఉద్రిక్తతకు దారితీయకుండా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఏమిటీ ఈ ప్రాజెక్టు?

ప్రతిపాదిత ప్రాజెక్టు పార్, తాపి, నర్మదా అనే మూడు నదులను కలుపుతుంది. వీటిపై తొమ్మిది డ్యామ్‌లను నిర్మిస్తారు. మహారాష్ట్ర రాజధాని ముంబయి, గుజరాత్‌లోని ప్రాంతాలు సౌరాష్ట్ర, కచ్‌లకు నీటి సరఫరా చేయటమే ఈ ప్రాజెక్టు లక్ష్యం. అయితే ఈ ప్రాజెక్టు తమను మొత్తం తుడిచిపెట్టేస్తుందని ఆదివాసీ నాయకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తొమ్మిది డ్యాముల నిర్మాణంతో మూడు ప్రధాన నదులను అనుసంధానించే పార్-తాపి-నర్మదా లింక్ ప్రాజెక్టుపై దక్షిణ గుజరాత్‌లో వ్యతిరేకత వ్యక్తమవుతున్నది. ముఖ్యంగా ధరమ్‌పూర్, వల్సాడ్‌లలోని గిరిజనులుండే ప్రాంతాలు ఈ ప్రాజెక్టుతో ప్రభావం అయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. మొత్తం 118 గ్రామాలు ముంపునకు గురయ్యే ప్రమాదమున్నది. అలాగే ఐదు లక్షల మంది, వీరిలో అధికంగా గిరిజనులను ఇతర సురక్షిత ప్రాంతాలకు తరలించాల్సి ఉంటుంది.

కొమ్మినేనికి పూర్తిస్థాయి బెయిల్

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

సీనియర్ జర్నలిస్టు కొమ్మినేని శ్రీనివాసరావుకు సుప్రీంకోర్టు పూర్తిస్థాయి బెయిల్ మంజూరు చేసింది. తన అరెస్టు, రిమాండ్‌ను సవాల్ చేస్తూ శ్రీనివాసరావు దాఖలు చేసిన రిట్ పిటిషన్‌ను గురువారం జస్టిస్ బివి నాగరత్న, జస్టిస్ కెవి విశ్వనాథన్ ధర్మాసనం విచారించింది. జూన్ 13న ఇచ్చిన తాత్కాలిక బెయిల్ ఇవ్వగా, గురువారం పూర్తిస్థాయి బెయిల్ ఇచ్చింది. భవిష్యత్తులో ఏమైనా చర్యలు తీసుకుంటే అర్నేష్ కుమార్ కేసు తీర్పుకు అనుగుణంగా ఉండాలని సూచించింది. అలాగే చర్చ వేదికల్లో ప్యానలిస్టులు ఎటువంటి అనుచిత వ్యాఖ్యలు చేయకూడదని తెలిపింది. ఈ విషయంపై ముందుగానే ప్యానెల్ సభ్యులతో మాట్లాడాలని పేర్కొంది.

కొనసాగుతున్న అల్పపీడనం

- నేడు కూడా పలు ప్రాంతాల్లో భారీ వర్షాలు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పశ్చిమ మధ్య, దానిని అనుకుని ఉన్న వాయువ్య బంగాళాఖాతంలో దక్షిణ, ఒడిశా, ఉత్తరాంధ్ర తీరాలకు ఆనుకుని అల్పపీడనం కొనసాగుతుందని విపత్తుల నిర్వహణ సంస్థ ఎండి ప్రఖర్ జైన్ తెలిపారు. ఇది రాబోయే 24 గంటల్లో పశ్చిమ వాయువ్య దిశగా ప్రయాణించే అవకాశం ఉందని గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అల్పపీడన ప్రభావంతో ఉత్తరాంధ్ర తీరం వెంబడి గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తాయని వెల్లడించారు. మత్స్యకారులు శనివారం వరకూ సముద్రంలోకి వేటకు వెళ్లరాదని హెచ్చరించారు. అల్పపీడన ప్రభావంతో నేడు అక్కడక్కడా చెదురుమదురుగా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురంమన్యం, అల్లూరి సీతారామరాజు జిల్లాలో అక్కడక్కడా మోస్తరు నుంచి భారీ వర్షాలు, విశాఖపట్నం, అనకాపల్లి, కాకినాడ, కోనసీమ, తూర్పుగోదావరి, పశ్చిమ గోదావరి, ఏలూరు, కృష్ణా, ఎన్‌టిఆర్ జిల్లాల్లో అక్కడక్కడా తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసేందుకు అవకాశం ఉందని పేర్కొన్నారు. మిగిలిన జిల్లాల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు నమోదవచ్చని వెల్లడించారు. మరోవైపు కృష్ణానది వరద ప్రవాహం ఎగువ ప్రాజెక్టుల్లో స్వల్పంగా తగ్గుముఖం పట్టిందని, గురువారం సాయంత్రం 6 గంటలకు ప్రకాశం బ్యారేజి వద్ద మొదటి ప్రమాద హెచ్చరిక కొనసాగుతూ ఇన్‌ఫ్లో, అవుట్ ఫ్లో 5.46 లక్షల క్యూసెక్కులుగా ఉందని వెల్లడించారు. వరద పూర్తి స్థాయిలో తగ్గేవరకూ కృష్ణానది పరివాహక లోతట్టు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండి, తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఎట్టి పరిస్థితుల్లో ఉధృతంగా ప్రవహించే వాగులు, కాలువలు దాడే ప్రయత్నం చేయరాదని సూచించారు. సోషల్ మీడియా వదంతులు నమ్మవద్దని, అలెర్ట్ మెసేజ్‌లను విపత్తు నిర్వహణ సంస్థ జారీ చేస్తుందని తెలిపారు.

జమ్ముకాశ్మీర్‌లో కుంభవృష్టి

(మొదటి పేజీ తరువాయి)

జమ్మూ కాశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా చెప్పారు. ఆ ప్రాంతం నుండి సమాచారం రావడానికి కొంత సమయం పడుతోందని, అయినా అందుబాటులో వున్న అన్ని వనరులను సమీకరించి, సహాయక చర్యలు నిర్వహిస్తున్నామని చెప్పారు. సమాచారం తెలిసిన వెంటనే ప్రభుత్వం మీడియాతో పంచుకుంటుందని చెప్పారు. ప్రధాని నరేంద్ర మోడీ మృతుల కుటుంబాలకు తీవ్ర సంతాపాన్ని తెలియచేశారు. అక్కడి పరిస్థితులను నిశితంగా గమనిస్తున్నామని చెప్పారు. అవసరంలో వున్న వారికి అందుబాటులో సాయమందిస్తామని హామీ ఇచ్చారు. పాలనాయంత్రాంగం వెంటనే రంగంలోకి దూకి అవసరమైన చర్యలు తీసుకుంటోందని కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ చెప్పారు. జమ్మూ కాశ్మీర్ గవర్నర్ మనోజ్ సిన్హా కూడా బాధిత కుటుంబాలకు సంతాపం తెలియచేశారు. సహాయక చర్యలను మరింత బలోపేతం చేసేందుకు సివిల్, పోలీసు, ఆర్మీ, ఎన్‌డిఆర్ఎఫ్, ఎస్‌డిఆర్ఎఫ్ బలగాలను కూడా రంగంలోకి దిగాల్సిందిగా ఆదేశాలు జారీ చేశారు.

నేటి నుంచే 'స్త్రీ శక్తి'

(మొదటి పేజీ తరువాయి)

బడుగు బలహీన వర్గాలను అభివృద్ధి చేసేందుకు వేలకోట్ల నిధులు ఖర్చు చేస్తోందని వెల్లడించింది.

ప్రయాణికులతో మర్యాదగా నడుచుకోవాలి: మంత్రి

ఉచిత బస్సు ప్రయాణం సందర్భంగా ఉండే రద్దీ దృష్ట్యా ప్రయాణికులతో ఎటువంటి వాగ్వావాదాలకు అవకాశాలు లేకుండా నడుచుకోవాలని సమాచార, పౌర సంబంధాలు, గృహ నిర్మాణ శాఖమంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. సచివాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా స్త్రీశక్తి పేరుతో ఈ పథకాన్ని ముఖ్యమంత్రి ప్రవేశపెట్టినట్లు తెలిపారు. ఈ పథకాన్ని విజయవంతంగా అమలు చేసేందుకు డ్రైవర్లు, కండక్టర్లకు అవసరమైన శిక్షణా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని చెప్పారు. ఎపిఎస్ఆర్టీసికి 11,449 బస్సులు ఉన్నాయని, వీటిల్లో 8,458 బస్సుల్లో పథకం అమలు కానుందని వెల్లడించారు.

అసౌకర్యాల ఆవాసాలు

- కానరాని రోడ్లు, వీధి దీపాలు
- తాగునీటికీ ఇబ్బందులే..
- అంత్యక్రియలూ కష్టమే..
- దయనీయంగా పోలవరం నిర్వాసితుల పునరావాస కాలనీ



పునరావాస కాలనీలోని బురద రోడ్డు

ప్రజాశక్తి - ఎటపాక (అల్లూరి జిల్లా)

ఆంధ్రప్రదేశ్ జీవనాడిగా పేర్కొంటున్న పోలవరం ప్రాజెక్టు కోసం సర్వం త్యాగం చేసిన నిర్వాసితుల పట్ల ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయి. నిర్వాసిత కాలనీల్లో కనీస సౌకర్యాలు మృగ్యంగా మారడమే దీనికి నిదర్శనం. అల్లూరి జిల్లా విఆర్.పురం మండలం కొతారి గొమ్ము, గొందూరు, శ్రీరామగిరి గ్రామాల నిర్వాసితులకు ఎటపాక మండలం నర్సింగపేట గ్రామంలో పునరావాస కాలనీ నిర్మించారు. అక్కడ రోడ్లు, వీధి దీపాలు కరువయ్యాయి. తాగు నీరు గగనంగా మారింది. ఎవరైనా చనిపోతే అంత్యక్రియలకూ ఇబ్బందులే ఎదురవుతున్నాయి.

నర్సింగపేట పునరావాస కాలనీలో 253 కుటుంబాలకు ఇంటి నిర్మాణాలు పూర్తి చేశారు. ప్రస్తుతం కొతారి గొమ్ము నుంచి 120 కుటుంబాలకుగాను 12 కుటుంబాలు, గొందూరు నుంచి 54 కుటుంబాలు, శ్రీరామగిరి నుంచి నాలుగు కుటుంబాలు వచ్చి కాలనీలో నివాసముంటున్నాయి. పూర్తి స్థాయిలో మౌలిక సదుపాయాలు లేకపోవడంతో నిర్వాసితులు కాలనీలకు రాలేకపోతున్నారు. ఇళ్ల నిర్మాణం దాదాపు పూర్తయినప్పటికీ కాలనీలో 16 రకాల మౌలిక వసతులను కల్పించలేదు. గ్రామానికి బురద రోడ్డే స్వాగతం పలుకుతోంది. గ్రామంలో ఎక్కడా సిమెంట్ రోడ్లుగానీ, వీధి దీపాలుగానీ లేవు.

పాఠశాల, అంగన్‌వాడీ, ఆరోగ్య కేంద్రాల నిర్మాణాలు ఇంకా ప్రారంభ దశలోనే ఉన్నాయి. ఇక్కడి విద్యార్థులు రాంగోపాలపురం గ్రామంలో చదువుకుంటున్నారు. వైద్యం కోసం ఐదు కిలో మీటర్ల దూరంలోని లక్ష్మీపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లాల్సి వస్తోంది. రేషన్, పెన్షన్ కోసం రూ.500 రవాణా ఛార్జీలు పెట్టుకొని 70 కిలో మీటర్లు ప్రయాణించి సొంత గ్రామానికి వెళ్లి తీసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ కాలనీకి శ్మశానవాటిక స్థలం కేటాయించినప్పటికీ అది ఊరికి దూరంగా ఉంది. వెళ్లడానికి సరైన రహదారి సౌకర్యంలేదు. మృతిచెందిన వారి దహన సంస్కారాలకు తీసుకెళ్తే అది పట్టా భూమి అని అక్కడి స్థానిక రైతులు అభ్యంతరం పెడుతున్నారు. గత్యంతరం లేక కాలనీకి సంబంధించిన రిజర్వ్ స్థలంలో మృతదేహాలను పూడ్చిపెడుతున్నట్లు నిర్వాసితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడి వారికి వ్యవసాయ కూలి పనులు తప్ప మరో ఉపాధి మార్గం లేకుండా పోయింది. జాబ్ కార్డులు సొంతూరులోనే ఉన్నాయని.. ఇక్కడ ఉపాధి హామీ పనులు చూపడంలేదని నిర్వాసితులు వాపోతున్నారు. 62 ఎకరాలు భూమికి భూమి ఇచ్చినప్పటికీ అది రాళ్లు, రప్పలతో నిండి ఉందని, వ్యవసాయానికి యోగ్యంగా లేదని తెలిపారు. ఆ భూముల్లో డ్రిప్ పద్ధతిలో వ్యవసాయం చేసుకునేందుకు వీలుగా అభివృద్ధి చేస్తామని గతంలో ఐటిడిఎ పిఒగా పనిచేసిన అభిషిక్త్ కిషోర్ హామీ ఇచ్చినా నేటికీ నెరవేరలేదు. గ్రామంలో రెండు ఓవర్ హెడ్ ట్యాంకులు నిర్మించినప్పటికీ నిరూపయోగంగా ఉన్నాయి. పైపులైన్‌కు కనెక్షన్ ఇవ్వలేదు. గృహ అవసరాలకు నీటిని ఉపయోగించుకోవాలంటే కాంట్రాక్టర్లు వేసిన బోరు నుంచి తమ ఇంటి వరకూ పైపులు పరుచుకొని వారు అందించిన సమయంలోనే నీటిని డ్రమ్ముల్లో పట్టుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. తాగునీటి కోసం రోజుకు రూ.20 చొప్పున నెలకు రూ.600 ఖర్చు అవుతోందని నిర్వాసితులు వాపోయారు. తమ ఆధార్ కార్డు, రేషన్ కార్డు సొంతూరులోనే ఉండడంతో తమ అవసరాల కోసం ఇక్కడ పంచాయతీ వారిని గట్టిగా అడగలేకపోతున్నామని తెలిపారు. ప్రభుత్వం ఇప్పటికైనా పూర్తిస్థాయిలో మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరుతున్నారు.

అంత్యక్రియలకు ఇబ్బందిపడుతున్నాం



కాలనీకి రెండు కిలో మీటర్ల దూరంలో శ్మశానవాటికకు స్థలం కేటాయించారు. ఆ స్థలం పట్టా భూమి అంటూ అక్కడ మృతదేహాన్ని పూడ్చడానికి స్థానికులు అడ్డుచెబుతున్నారు. చేసేది లేక కాలనీ సమీపంలోనే అంత్యక్రియలు నిర్వహిస్తున్నాం. మా ఇళ్లు మునుగుతున్నాయని ఇక్కడ కాలనీ కట్టించారు. కానీ, మా పొలాలు మునగడంలేదని వాటికి పరిహారం ఇవ్వలేదు. మేము అక్కడికి వెళ్లి ఎలా వ్యవసాయం చేయాలి.

వల్ల సుందర్ రెడ్డి, కొతారి గొమ్ము నిర్వాసితుడు

పోడు భూములకు భూమికి భూమి ఇవ్వలేదు



మేము ఇక్కడికి వచ్చి నెల రోజులు అవుతోంది. ఇక్కడ కనీస సౌకర్యాలు లేవు. వీధిలైట్లు లేకపోవడంతో చీకట్లో భయంతో తిరగాల్సి వస్తుంది. సాగు చేసుకుంటున్న పోడు భూములకు జగన్ ప్రభుత్వం పట్టాలు ఇచ్చింది. కానీ, వాటికి భూమికి భూమి వర్తించదని అధికారులు అంటున్నారు. ఒక్కో కుటుంబానికి ఐదు నుంచి పది ఎకరాల వరకూ పోడు భూమి ఉంది. జీడి, మామిడి తోటలు రిజర్వ్ ఫారెస్ట్‌లో ఉన్నాయని వాటికి పరిహారం ఇవ్వలేదు. ఇక్కడ భూమి కేటాయించలేదు. తామెలా బతకాలి. అక్కడ వ్యవసాయం చేసేవాళ్ళం. ఇక్కడ కూలి పని చేయాల్సి వస్తోంది.

కదల కన్నారెడ్డి, గొందూరు నిర్వాసితుడు

తాగు నీరు లేదు



తాగు నీరు లేక మినరల్ వాటర్ కొనుక్కుంటున్నాం. రోజుకు రూ.20 ఖర్చవుతోంది. ఓవర్ హెడ్ ట్యాంకులు నిర్మించినా వాటి నుంచి నీటి సరఫరా జరగడం లేదు.

ఆత్మకూరి భాస్కరరావు, శ్రీరామగిరి నిర్వాసితుడు



పోస్టర్‌ను ఆవిష్కరస్తున్న నాయకులు

18న 'చలో కరేడు'

- వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి -నెల్లూరు

నెల్లూరు జిల్లా కరేడులో ఇండోసోల్ పరిశ్రమ ఏర్పాటు కోసం చేపట్టే భూసేకరణను వ్యతిరేకిస్తూ ఈ నెల 18న చలో కరేడు కార్యక్రమాన్ని చేపట్టారు. ఇందుకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను రైతు సంఘం ఆధ్వర్యంలో నగరంలోని డాక్టర్ రామచంద్రారెడ్డి భవన్‌లో ఆవిష్కరించారు. రైతు సంఘం నాయకులు మూలం రమేష్, చంద్ర రాజగోపాల్ మాట్లాడుతూ.. ప్రభుత్వం బలవంతంగా భూసేకరణకు పాల్పడుతోందని, గ్రామసభ తీర్మానాన్ని పట్టించుకోకుండా భూసేకరణకు పాల్పడడం దారుణమన్నారు. చలో కరేడు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మాదాల వెంకటేశ్వర్లు, గోగుల శ్రీనివాసులు, సిపిఐ నాయకులు దామ అంకయ్య షాన్వాజు, రాంబాబు పాల్గొన్నారు.

అమరావతి ముంపు తప్పేవరిది ?

- బయటకు పోవాలంటే కనీసం వారం రోజులు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

అమరావతి రాజధాని ముంపుకు దూరంగా ఉంటుందని, ప్రమాదం లేదని సిఆర్‌డిఏ అధికారులు, పాలకులు చెబుతున్నా ఆచరణలో దానికి భిన్నంగా జరుగుతోంది. మంగళవారం అర్ధరాత్రి కురిసిన వర్షానికి బుధవారం అమరావతి పరిధిలోకి కొంతమేర నీరొచ్చి చేరినా గురువారం నాటికి రాజధాని ప్రాంతం చాలావరకూ ముంపునకు గురైంది. సాక్షాత్తూ హైకోర్టు జడ్జీలే వాననీటిలో ప్రయాణించాల్సిన పరిస్థితి ఏర్పడింది. నూతనంగా నిర్మిస్తున్న వారి బంగళాలనూ నీరు చుట్టుముట్టింది. సెక్రటేరియట్ కోసం నిర్మిస్తున్న అతిపెద్ద భవనాల పునాదుల్లోనూ నీరు చేరి చెరువును తలపిస్తున్నాయి. రాజధాని ప్రాంతం భౌగోళికంగా ముంపు ప్రాంతంలో ఉందని, పైన కొండల్లో నుండి వచ్చేనీటిని అదుపు చేయడం అంత తేలికైన పనికాదనీ తొలి నుండీ నిపుణులు చెబుతూనే ఉన్నారు. మంగళవారం ఒక్కసారిగా వచ్చిన వర్షంతో లాం దగ్గర కొండవీటివాగు, కొట్టేళ్లవాగు ఉగ్రరూపం దాల్చాయి. వాటికి కాలువ లేకపోవడంతో పొలాల పైబడి పెదపరిమి మీదుగా నీరుకొండ రిజర్వాయర్ వద్దకు చేరుకుంటాయి, అక్కడ నుండి ఛానలైజ్ అయ్యి కృష్ణాయపాలెం దగ్గరకు అక్కడ నుండి పెనుమాక పొలాల్లో నుండి ఉండవల్లి లిఫ్టు వద్దకు చేరుకుంటుంది. ఇటీవల రోడ్ల నిర్మాణాలతో కొండవీటివాగు రూపం కోల్పోయింది. ఎస్‌ఆర్‌ఎం యూనివర్శిటీ వద్ద నీటి సహజమార్గాన్ని ధ్వంసం చేశారు. ఇటీవల నిర్మించిన వెస్ట్ బైపాస్ రోడ్డుతో కాలువ ఆనవాళ్లు కోల్పోయింది. అక్కడ తూములు ఏర్పాటు చేయడం ద్వారా నీరు బయటకు వెళ్లేలా చూడాలని రైతులు సూచించినా అధికారులు పట్టించుకోలేదు. దీంతో నీరు గతంలో కంటే ఎక్కువగా నిలిచిపోయింది. ఈ నీరు కొత్తగా మరోమార్గంలో నుండి బయటకు వెళ్లాల్సి ఉంది. బ్లూప్లాన్ పేరుతో సిఆర్‌డిఏ అధికారులు తలాతోక లేకుండా తవ్విన కాలువల్లో నీరు బయటకు వెళ్లడానికి మరింత సమయం పడుతుంది. కాలువల్లో చేరే నీరు ఇంకిపోవడం కూడా తక్కువగానే ఉంది. గతంలో ఉండవల్లి, పెనుమాక, ప్రాంతాల్లో నీరు పెద్దగా నిలిచేది కాదు. రెండు రోజులుగా పెద్దఎత్తున నీరొచ్చి చేరింది. లిఫ్టు ద్వారా ఈ నీటిని తోడటమే పెద్దపనిగా ఉంది. నీరుకొండవద్దకు చేరి నిలిచిపోయిన నీరు ఇంకా ఉండవల్లి వద్దకు చేరలేదు. సిఆర్‌డిఏ అధికారులు కూడా ఆదిశగా ఆలోచన చేయలేదు. ప్రస్తుతం అమరావతిలో నుండి వెడుతున్న పశ్చిమ జాతీయ రహదారి వద్ద నీటిని బయటకు పంపించే మార్గం సరిగా లేకపోవడం, ఉన్న ఒక్క కాలువలో రోడ్డు నిర్మాణాల కోసం వేసిన పైల్ క్యాపులను తనిఖీల సమయంలో కాలువలో వేయడంతో ఎక్కడికక్కడ అడ్డుపడ్డాయి. దీంతో రాజధాని ప్రాంతాన్ని నీరు ముంచెత్తింది. పైనుండి నీరొస్తున్నా దిగువున నీరెళ్లే మార్గం సరిగా లేకపోవడంతో ముంపు తీవ్రత పెరిగింది.

ఇద్దరు రాష్ట్ర పోలీసులకు రాష్ట్రపతి పురస్కారాలు

- 25 మందికి శౌర్య, సేవా పతకాలు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఇద్దరు పోలీసు అధికారులు చెన్నుపాటి భద్రయ్య (ఎస్‌పి), గోపు రాజీవ్ కుమార్ (డిఎస్‌పి)ను రాష్ట్రపతి విశిష్ట సేవా పోలీస్ పతకాలు వరించాయి. వీరితో పాటు మరో 23 మంది రాష్ట్ర పోలీసు అధికారులకు శౌర్య/సేవా పతకాలు లభించాయి. 79వ స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం కేంద్ర హోం మంత్రిత్వ శాఖ పోలీసు, అగ్నిమాపక, హోంగార్డు, సివిల్ డిఫెన్స్, కరెక్షనల్ సర్వీసెస్‌కు చెందిన మొత్తం 1,090 మంది అధికారులకు శౌర్య/సేవా పోలీస్ పతకాలను ప్రకటించింది. ఇందులో మొత్తం 25 మంది రాష్ట్ర అధికారులు ఈ పతకాలను సొంతం చేసుకున్నారు.

దేశవ్యాప్తంగా 226 మందికి శౌర్య పతకాలు (జిఎం), 89 మందికి రాష్ట్రపతి విశిష్ట సేవా పతకాలు (పిఎస్‌ఎం), 635 మందికి ప్రతిభాపూర్వక సేవా పతకాలు (ఎంఎస్‌ఎం) ప్రకటించారు. వీరిలో 16 మంది ఆపరేషన్ సిందూర్‌లో పాల్గొన్న జవాన్లు ఉండటం విశేషం. కాగా ఎపి నుంచి ఇద్దరికి రాష్ట్రపతి విశిష్ట సేవా పతకం, 20 మంది పోలీసులకు, కరెక్షనల్ సర్వీసెస్ కింద ముగ్గురు అధికారులకు ప్రతిభాపూర్వక సేవా పతకాలు లభించా యి. ప్రాణాలు, ఆస్తులను కాపాడటంలో, నేరాలను నిరోధించడంలో లేదా నేరస్తులను అరెస్టు చేయడానికి విధి నిర్వహణలో ప్రదర్శించిన శౌర్యం, తెగువ ఆధారంగా రాష్ట్రపతి శౌర్య పతకం(పిఎంజి), శౌర్య పతకం(జిఎం) కేంద్ర ప్రభుత్వం అందిస్తోంది. విధి నిర్వహణలో అందించిన విశిష్ట సేవకు రాష్ట్రపతి విశిష్ట సేవా పతకం(పిఎస్‌ఎం), విలువైన సేవకు ప్రతిభాపూర్వక సేవా పతకం(ఎంఎస్‌ఎం) ఇస్తున్నారు.

శౌర్య/సేవా పథకాలు పొందిన రాష్ట్ర అధికారులు వీరే..

1. రవికృష్ణ ఆకే (ఐజి), 2. శ్రీనివాసరావు వల్లూరి (డిఎస్‌పి), 3. వీరవెంకట ప్రతాప్ కుమార్ తోట (డిఎస్‌పి), 4. కోడందశ్రీ రామచంద్రరాజు దెందుకూరి (అసిస్టెంట్ కమాండెంట్), 5. గోవిందరావు మామిడి (ఇన్‌స్పెక్టర్), 6. రామకృష్ణ గండెం (ఇన్‌స్పెక్టర్), 7. శ్రీనివాసరావు బొడ్డు (హెడ్ కానిస్టేబుల్), 8. సీతారాము కరిమకొండ (ఎస్‌ఐ), 9. చంద్రశేఖర్ పెదిరెడ్డి (ఏఎస్‌ఐ), 10. నాగ మల్లేశ్వరరావు విశ్వరాపు (ఏఎస్‌ఐ), 11. వెంకటరామశర్మ బుర్రా (ఏఎస్‌ఐ), 12. ఉస్మాన్ గని ఖాన్ నయేబ్ (ఏఎస్‌ఐ), 13. గోపాల్ కరువా (ఎస్‌ఐ), 14. కోటేష్ కొట్టకోట (ఎస్‌ఐ), 15. నాగేశ్వరరావు డొమ్మేటి (ఏఎస్‌ఐ), 16. సీతారామంజనేయులు పామర్తి (ఏఎస్‌ఐ), 17)నాగబాబు కొప్పిశెట్టి (ఏఎస్‌ఐ), 18) గోపాలకృష్ణ గుబ్బాల (హెడ్ కానిస్టేబుల్), 19. సురేష్‌కుమార్ మురుగేశన్ (హెడ్ కానిస్టేబుల్), 20. దానం గడ్డ (హెడ్ కానిస్టేబుల్). 21. వరప్రసాద్ మామిళ్లపల్లి (డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ ప్రిజన్స్), 22. రవికుమార్ కరణం (చీఫ్ హెడ్ వార్డన్), 23. వీరవెంకట సత్యనారాయణరావు తలపర్తి (హెడ్ వార్డన్)

స్త్రీశక్తి అమలులో ఫిర్యాదులు ఉండకూడదు

- ఆర్‌టిసి ఎమ్‌డి ద్వారకా తిరుమలరావు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

స్త్రీ శక్తి పథకం అమలులో ఏ విధమైన ఫిర్యాదులు రాకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఆర్‌టిసి ఎమ్‌డి ద్వారకాతిరుమల రావు అధికారనులను ఆదేశించారు. విజయవాడలోని పిఎన్‌బిఎస్ నుంచి వీడియో కాన్ఫరెన్స్‌ను గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళా ప్రయాణికుల పట్ల సంస్థ ఉద్యోగులు మర్యాద పూర్వకంగా నడుచుకోవాలని ఆదేశించారు. ముఖ్యమంత్రి ఈ పథకాన్ని ప్రారంభించిన అనంతరం మహిళలకు జీరో టిక్కెట్ల జారీ కొనసాగుతుందని తెలిపారు. జిల్లాల పరిధిలోని నాయకులతో అధికారులు సమన్వయం చేసుకోవాలని సూచించారు. మహిళా ప్రయాణీకులు ఎ విధమైన అసౌకర్యం కలగకుండా బస్సులు నడపాలని ఆదేశించారు. ఈ పథకం అమలుతో ప్రభుత్వానికి, ఆర్‌టిసికి పేరు తెచ్చేలా అందరూ శాయశక్తులా కృషి చేయాలని కోరారు.

లైంగిక దాడి, హత్య కేసులో ఉరి శిక్ష

- నల్గొండ జిల్లా కోర్టు తీర్పు

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

బాలికపై అత్యాచారంతోపాటు హత్యకు పాల్పడిన నేరస్థుడికి కోర్టు ఉరిశిక్ష విధించింది. కేసుకు సంబంధించిన వివరాలను తెలంగాణ రాష్ట్రం నల్లగొండ జిల్లా ఎస్‌పి శరత్‌చంద్రపవార్ గురువారం మీడియాకు వెల్లడించారు. నల్లగొండ జిల్లా కేంద్రం వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో 2013 ఏప్రిల్ 28న 11 ఏండ్ల బాలిక తన ఇంట్లో ఒంటరిగా ఉండడంతో మహమ్మద్ ముక్రం లైంగిక దాడికి పాల్పడ్డాడు. అనంతరం చున్నీతో బాలికను చంపిశాడు. మృతదేహాన్ని కారులో తీసుకువచ్చి ఓ మురికి కాలువలో పడేశాడు. అప్పట్లో ఈ కేసు సంచలనంగా మారింది. బాలిక తండ్రి ఫిర్యాదు మేరకు వన్‌టౌన్ పోలీసులు నిందితుడిపై పోక్సో చట్టం, హత్యా నేరం కింద కేసు నమోదు చేశారు. అన్ని కోణాల్లో దర్యాప్తు జరిపిన అనంతరం కోర్టులో ఛార్జిషీట్ దాఖలు చేశారు. ఈ ఘటనపై గత పదేళ్లుగా నల్లగొండ జిల్లా కోర్టులో వాదనలు జరిగాయి. గురువారం ఎస్‌సి, ఎస్‌టి కోర్టు నిందితుడిని దోషిగా నిర్ధారించింది. హత్య కేసులో మరణ శిక్ష, ఫోక్సో కేసులో మరో మరణ శిక్ష (డబుల్ డెత్ పెనాల్టీ), రూ.1,10,000 జరిమానా విధించింది. బాధిత కుటుంబానికి రూ.పది లక్షల పరిహారం ప్రకటించింది. ఇలాంటి కేసుల్లో సాక్షులను భయపెట్టడం, తప్పుదోవ పట్టించడం, రాజీ పడాలని ఎవరైనా ఒత్తిడి చేస్తే పోలీసుల దృష్టికి తీసుకురావాలని ఎస్‌పి సూచించారు. ఫోక్సో కేసులలో ప్రభుత్వమే పరిహారం చెల్లిస్తుందని తెలిపారు. ఈ కేసులో సరైన సాక్ష్యాధారాలను కోర్టులో దాఖలు చేసిన ఇన్వెస్టిగేషన్ ఆఫీసర్ విజయ కుమార్ (డిఎస్‌పి), ప్రాసిక్యూషన్‌కు సహకరించిన నల్లగొండ డిఎస్‌పి శివరాంరెడ్డి, సిఐ రాజశేఖర్ రెడ్డి, వన్‌టౌన్ పిఎస్ ఎస్‌ఐ గుత్తా వెంకట్‌రెడ్డి, పబ్లిక్ ప్రాసిక్యూటర్స్ కందుగుల శ్రీవాణి, దామోదరం శ్రీవాణి, వేముల రంజిత్ కుమార్, అధికారులను పి.నరేందర్, ఎన్.మల్లికార్జున్‌ను ఎస్‌పి అభినందించారు.

గవర్నర్‌కు పోలవరం ఆడిట్ నివేదిక

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పోలవరం నీటిపారుదల ప్రాజెక్టుపై ఆడిట్ నివేదికను కంట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్) గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్‌కు గురువారం సమర్పించింది. ఈ మేరకు ప్రిన్సిపల్ అకౌంటెంట్ జనరల్ శరత్ చతుర్వేది ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర శాసన సభ ముందుంచేందుకు వీలుగా పోలవరం నీటిపారుదల ప్రాజెక్టు ఫెర్ఫార్మెన్స్ ఆడిట్ రిపోర్ట్‌ను సమర్పించినట్లు వెల్లడించారు.

వైసిపి పిటిషన్లు డిస్మిస్

ప్రజాశక్తి-అమరావతి

పులివెందుల, ఒంటిమిట్ట జెడ్‌పిటిసి స్థానాలకు జరిగిన ఉప ఎన్నికల్లో అక్రమాలు జరిగాయని పేర్కొంటూ వైసిపి అభ్యర్థులు వేసిన పిటిషన్లను హైకోర్టు కొట్టివేసింది. కేంద్ర సాయిధ పోలీసు బలగాల భద్రతతో రీపోలింగ్‌కు ఉత్తర్వులు ఇవ్వాలన్న అభ్యర్థనను తిరస్కరించింది. ఈ వ్యవహారంపై ఎన్నికల పిటిషన్లు దాఖలుకు పిటిషనర్లకు హక్కు ఉందని గుర్తు చేస్తూ జస్టిస్ గన్నమనేని రామకష్ణప్రసాద్ గురువారం తీర్పు చెప్పారు. పులివెందుల, ఒంటిమిట్ట జడ్‌పిటిసిలకు ఈనెల 12న జరిగిన ఉపఎన్నికలో అధికార పార్టీ నేతలు దౌర్జన్యాలకు పాల్పడినందున రీపోలింగ్ జరిపేలా రాష్ట్ర ఎన్నికల సంఘానికి (ఎస్‌ఇసికి) ఉత్తర్వులు ఇవ్వాలంటూ వైసిపి జెడ్‌పిటిసి అభ్యర్థులు తుమ్మల హేమంత్‌రెడ్డి, ఎర్రగ్రంరెడ్డి సుబ్బారెడ్డి వేసిన పిటిషన్ల తరఫున సీనియర్ న్యాయవాదులు పి.వీరారెడ్డి, ఎస్.శ్రీరామ్, విఆర్ రెడ్డి కొవ్వూరి వాదించారు. వైసిపి పోలింగ్ ఏజెంట్లను పోలింగ్ కేంద్రాలలోకి అనుమతించలేదన్నారు. జమ్మలమడుగు, ఇతర నియోజకవర్గాల వ్యక్తులు వచ్చి దొంగ ఓట్లు వేశారన్నారు. ఎస్‌ఇసి తరఫు న్యాయవాది వివేక్ చంద్రశేఖర్ వాదిస్తూ, ఎన్నికల పోలింగ్ జరిగాక పిటిషన్లు దాఖలుకు వీల్లేదన్నారు. ఎలక్షన్ పిటిషన్లు వేసుకోవాలన్నారు. వ్యాజ్యాలను కొట్టివేయాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం తరఫున అడ్వకేట్ జనరల్ దమ్మాలపాటి శ్రీనివాస్ స్పందిస్తూ, ఈ వివాదాన్ని ఎన్నికల పిటిషన్లో తేల్చాలని, హైకోర్టులో కాదని చెప్పారు. రాజకీయ పార్టీల ఫిర్యాదుల ఆధారంగా విచారణకు వీల్లేదన్నారు.

పెద్దారెడ్డి సొంత ఇంటికి వెళ్లేలా చర్యలు తీసుకోండి

- పోలీసులకు హైకోర్టు ఆదేశం

ప్రజాశక్తి-అమరావతి

వైసిపికి చెందిన మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి తాడిపత్రిలోని తన ఇంటికి వెళ్లకుండా టిడిపి ఎమ్మెల్యే జెసి ప్రభాకర్ రెడ్డి అడ్డుకుంటున్నారనే పిటిషన్‌లో హైకోర్టు గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నెల 18 నుంచి పెద్దారెడ్డి తాడిపత్రి వెళ్లేందుకు, ఆయన తన ఇంట్లో నివాసం ఉండేందుకు వీలుగా పోలీసులు భద్రతా చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. ఉదయం 10 నుంచి 11 లోపు తాడిపత్రికి వచ్చేందుకు పెద్దారెడ్డికి అనుమతి ఆదేశాలను జారీ చేసింది. అవసరమైతే అదనపు బలగాలను మోహరింప చేయాలని పేర్కొంది. రెచ్చగొట్టే చర్యలకు పెద్దారెడ్డి, ఆయన అనుచరులు పాల్పడకూడదని, కాన్వాయ్‌లో ఐదు వాహనాలకు మించి ఉండకూడదని షరతు విధించింది. జనాల రాకపోకలను పోలీసులు వీడియో రికార్డు చేయాలని పేర్కొంది. పెద్దారెడ్డి ఇంటి వద్ద 50 -60 మంది కంటే ఎక్కువ ఉండరాదని చెప్పింది. తన ఇంటికి వెళ్లి ఉండేందుకు వీలుగా తనకు తగిన భద్రత కల్పించాలని హైకోర్టు ఆదేశాలు ఇచ్చినా పోలీసులు అమలు చేయడం లేదంటూ పెద్దారెడ్డి వేసిన పిటిషన్‌పై తదుపరి విచారణను వచ్చే నెల 19కి వాయిదా వేసింది. ఈ మేరకు జస్టిస్ నూనెపల్లి హరినాథ్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు.

తగ్గిన అమరరాజా లాభాలు

ప్రజాశక్తి - హైదరాబాద్ : ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 2025-26 జూన్‌తో ముగిసిన తొలి త్రైమాసికం (క్యూ1)లో అమరరాజా ఎనర్జీ అండ్ మొబిలిటీ లిమిటెడ్ నికర లాభాలు రూ.194 కోట్లకు తగ్గాయి. గతేడాది ఇదే త్రైమాసికంలో రూ.244 కోట్ల నికర లాభాలు సాధించింది. ఇదే సమయంలో రూ.3,131 కోట్లుగా ఉన్న రెవెన్యూ.. గడిచిన క్యూ1లో రూ.3,349 కోట్లకు పెరిగింది. 'ప్రస్తుత భౌగోళిక ఉద్రిక్తతలు, ప్రపంచం అల్లకల్లోలంలో ఉన్నప్పటికీ గడిచిన త్రైమాసికంలో కంపెనీ ఆదాయం, లాభాలలో వృద్ధిని సాధించాము. లెడ్ యాసిడ్ వ్యాపారం వివిధ విభాగాల నుండి మంచి ఆదరణతో బలమైన ఫలితాలను అందిస్తూనే ఉంది. అదే సమయంలో న్యూ ఎనర్జీ వ్యాపారం కూడా వృద్ధి చెందుతోంది. మా గిగా ఫ్యాక్టరీ నిర్మాణం అంచనాల ప్రకారం పురోగమిస్తోంది." అని అమరరాజా ఎనర్జీ అండ్ మొబిలిటీ ఛైర్మన్, ఎండి జయదేవ్ గల్లా అన్నారు.

పోకో నుంచి ఎం7 ప్లస్ 5జి విడుదల

న్యూఢిల్లీ : పోకో కంపెనీ తన ఎం7 ప్లస్5జి స్మార్ట్‌ఫోన్‌ను భారత మార్కెట్లోకి విడుదల చేసింది. ఈ బడ్జెట్ ఫోన్ 7000 ఎంఎహెచ్ బ్యాటరీ, స్నాప్‌డ్రాగన్ 6ఎస్ జనరల్ 3 చిప్‌సెట్, 6.9-అంగుళాల ఎఫ్‌హెచ్‌డి 144 హెర్జ్ డిస్‌ప్లే, 50ఎంపి కెమెరా ఫీచర్లను కలిగి ఉంది. 6జిబి ర్యామ్, 128జిబి వేరియంట్ ధరను రూ.12,999, 8జిబి, 256జిబి వేరియంట్ ధరను రూ.13,999గా నిర్ణయించింది. ఇవి ఆగస్టు 19 నుండి ఫ్లిప్‌కార్ట్‌లో అందుబాటులో ఉంటాయని పోకో ఇండియా చీఫ్ బిజినెస్ ఆఫీసర్ సందీప్ సింగ్ అరోరా తెలిపారు.

తయారీకి అధిక టారిఫ్‌ల ముప్పు

- ఎగుమతి రంగంలో సంక్షోభం
- పరిశ్రమ వర్గాల ఆందోళన



న్యూఢిల్లీ : అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విధించిన అధిక టారిఫ్‌లు భారత తయారీ రంగానికి ముప్పుగా మారాయని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. భారత ఉత్పత్తులపై 50 శాతం సుంకాలు దేశ ఎగుమతి రంగాన్ని సంక్షోభంలోకి నెట్టనున్నాయని తెలిపారు. ముఖ్యంగా చిన్న తరహా వ్యాపారాలు తీవ్ర సవాళ్లను ఎదుర్కోనున్నాయి. అధిక టారిఫ్‌లతో మేక్ ఇన్ ఇండియా ద్వారా భారత్‌ను తయారీ కేంద్రంగా మార్చాలనే కేంద్ర లక్ష్యం నీరుగారనుందని పరిశ్రమ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. యుఎస్ చర్యలు తయారీకి పెద్ద ఎదురుదెబ్బగా మారనున్నాయని హెచ్చరికలు వస్తోన్నాయి. అధిక టారిఫ్‌లు ముఖ్యంగా దేశంలోని వస్త్ర రంగంపై తీవ్ర ప్రభావం చూపనున్నాయని, అమెరికాకు ఎగుమతి చేస్తోన్న సుమారు 4 బిలియన్ డాలర్ల (దాదాపు రూ.35వేల కోట్లు) విలువైన దుస్తులు ప్రమాదంలో పడ్డాయని అప్పారెల్ ఎక్స్‌పోర్ట్ అండ్ ఎగుమతుల ప్రమోషన్ కౌన్సిల్ (ఎఇపిసి) సెక్రటరీ జనరల్ మిథిలేశ్వర్ ఠాకూర్ ఆందోళన వ్యక్తం చేశారు. 'అమెరికా గతంలో విధించిన 25 శాతం టారిఫ్‌కు అదనంగా 25 శాతం అదనపు సుంకాలను మోపింది. దీనివల్ల భారత దుస్తుల ఎగుమతులు అమెరికా మార్కెట్‌లో పోటీతత్వాన్ని కోల్పోతాయి. అమెరికాకు దుస్తుల ఎగుమతుల్లో భారత్ 33 శాతం వాటాను కలిగి ఉంది. టెక్స్‌టైల్ రంగానికి యుఎస్ అతిపెద్ద మార్కెట్‌లలో ఒకటి. ఈ టారిఫ్‌ల వల్ల 80 శాతం సాధారణ దుస్తుల ఉత్పత్తులు దాదాపు 4 బిలియన్ డాలర్ల విలువ చేస్తాయి. టారిఫ్‌లతో ఇవి తీవ్రంగా దెబ్బతినే అవకాశం ఉంది. సుంకాల పెరుగుదల ఎగుమతిదారులను భారీ ఆర్థిక ఒత్తిడికి గురి చేస్తాయి. ఫలితంగా ఆర్డర్‌లు రద్దు, ఆలస్యం, ఆర్థిక నష్టాలు ఎదురవుతున్నాయి." అని ఠాకూర్ పేర్కొన్నారు.

బంగ్లాదేశ్‌తోనూ పోటీ పడలేము..!

ఎఇపిసి వివరణ ప్రకారం.. భారత్‌పై అమెరికా మోపిన అధిక టారిఫ్‌ల వల్ల కనీసం బంగ్లాదేశ్, వియత్నాం లాంటి చిన్న దేశల ఉత్పత్తులతో పోటీ పడలేని పరిస్థితి నెలకొంది. ఈ టారిఫ్‌ల వల్ల భారత ఎగుమతిదారులు 5-6 శాతం పోటీ నష్టాన్ని ఎదుర్కోనున్నారని అంచనా. అమెరికన్ కొనుగోలుదారులు ఆర్డర్‌లను నిలిపివేస్తున్నారు, మరోవైపు ఇతర దేశాల వైపు మొగ్గు చూపుతున్నారు. దీనివల్ల భారత ఎగుమతిదారులు ధరలను తగ్గించి నష్టాలతో విక్రయించవలసి వస్తోంది. ఈ పరిస్థితి చిన్న తరహా వ్యాపారాలకు ఉపాధి నష్టాలు, ఫ్యాక్టరీ మూసివేతలు మరియు ఆర్థిక సంక్షోభానికి దారితీయవచ్చని ఎఇపిసి హెచ్చరించింది.

ఎగుమతి ప్రోత్సాహకాలు పెంచాలి

ఈ సంక్షోభాన్ని ఎదుర్కోవడానికి ప్రభుత్వం నుంచి తక్షణ ఆర్థిక సహాయం అవసరమని ఎఇపిసి పేర్కొంది. ఎగుమతి ప్రోత్సాహకాలను పెంచాలని కోరింది. ఎంఎస్‌ఎంఇలకు సులభమైన రుణాలను అందించాలని సూచించింది. యూరోపియన్ యూనియన్‌తో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలను వేగవంతం చేయాలని కోరింది. ఈ చర్యలు తీసుకోకపోతే భారత ఎగుమతి రంగం భారీ నష్టాలను చవి చూడనుందని ఆందోళన వ్యక్తం చేసింది.



పెరిగిన వాణిజ్య లోటు

- ఎనిమిది నెలల గరిష్టానికి చేరిక

న్యూఢిల్లీ : భారతదేశ ఎగుమతుల కంటే దిగుమతులు ఎక్కువగా ఉండటంతో వాణిజ్య లోటు అమాంతం పెరిగింది. ప్రస్తుత ఏడాది జులైలో సరుకుల ఎగుమతులు 7.29 శాతం పెరిగి 37.24 బిలియన్ డాలర్లుగా నమోదయ్యాయి. గతేడాది ఇదే కాలంలో 34.71 బిలియన్ డాలర్లుగా ఉన్నాయి. కాగా.. గడిచిన జులైలో దిగుమతులు 8.6 శాతం పెరిగి 64.59 బిలియన్ డాలర్లకు చేరాయి. గతేడాది జులైలో 59.49 బిలియన్ డాలర్లుగా నమోదయ్యాయి. గడిచిన నెలలో ఎగుమతుల కంటే దిగుమతులు ఎక్కువగా ఉండటంతో వాణిజ్య లోటు 27.35 బిలియన్లకు పెరిగింది. ఇది 8 నెలల గరిష్ఠ స్థాయి కావడం గమనార్హం. 2024 ఇదే జులైలో 24.77 బిలియన్ల లోటు చేసుకుంది.

జూన్ 2025లోని 35.14 బిలియన్ల డాలర్ల ఎగుమతులతో పోల్చితే జులైలో పెరిగాయి. ఇందుకు ప్రధానంగా ఎలక్ట్రానిక్స్, ఫార్మాస్యూటికల్స్, ఇంజనీరింగ్ గూడ్స్, సముద్ర ఉత్పత్తులు, మాంసం, డైరీ ఉత్పత్తులు మద్దతును అందించాయని వాణిజ్య మంత్రిత్వ శాఖ వెల్లడించింది. ఈ రంగాల్లో బలమైన పనితీరు ఎగుమతులను పెంచిందని పేర్కొంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ నుంచి జులైలో కాలంలో సరుకుల ఎగుమతులు 3.07 శాతం పెరిగి 149.2 బిలియన్ డాలర్లుగా చోటు చేసుకున్నాయి. దిగుమతులు 5.36 శాతం పెరిగి 244.01 బిలియన్ డాలర్లుగా చోటు చేసుకున్నాయి. దీంతో ఈ కాలంలో వాణిజ్య లోటు 94.81 బిలియన్ డాలర్లకు చేరింది. అమెరికా అధిక టారిఫ్‌లు ప్రస్తుత, వచ్చే మాసాల్లో ఎగుమతులపై తీవ్ర ప్రభావం చూపనున్నాయని నిపుణులు సహా ఆ పరిశ్రమ వర్గాలు తీవ్ర ఆందోళనలో ఉన్న విషయం తెలిసిందే.

కనీస నిల్వపై వెనక్కి తగ్గిన ఐసిఐసిఐ బ్యాంక్

ముంబయి : ప్రయివేటు రంగంలోని ఐసిఐసిఐ బ్యాంక్ మినిమం బ్యాలెన్స్ పెంపునపై వెనక్కి తగ్గింది. కనీస బ్యాలెన్స్ పెంపును ఏకంగా రూ.50,000కు పెంచడంతో ఖాతాదారుల నుంచి తీవ్ర విమర్శలు రావడంతో ఆ బ్యాంక్ తలొగ్గడంతో పైగా మరింత తగ్గించడం విశేషం. మెట్రో, అర్బన్ ప్రాంతాల్లో ఇప్పటి వరకు రూ.10,000గా ఉన్న కనీస బ్యాలెన్స్‌ను రూ.5,000కు, సెమీ-అర్బన్ ప్రాంతాల్లో రూ.5,000 నుంచి రూ.2,000కు, గ్రామీణ ప్రాంతాల్లో రూ.2,000 నుంచి రూ.1,000కు తగ్గించింది. ఈ మార్పు ఆగస్టు 14 నుంచి అమలులోకి వస్తుందని ఆ బ్యాంక్ తెలిపింది.

ఐస్‌మేక్‌కు రూ.111 కోట్ల ఆదాయం

హైదరాబాద్ : ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 2025-26 జూన్‌తో ముగిసిన ప్రథమ త్రైమాసికం (క్యూ1)లో ఐస్‌మేక్ రిఫ్రిజిరేషన్ రెవెన్యూ 30 శాతం పెరిగి రూ.111.50 కోట్లుగా నమోదయ్యింది. అయితే.. ముడి ఖర్చులు, ఫైనాన్స్ వ్యయాలు, ఇన్వెంటరీ సర్దుబాట్ల వల్ల కంపెనీ రూ.1.47 కోట్ల నికర నష్టాలను చవి చూసింది. గతేడాది ఇదే త్రైమాసికంలో రూ.3.64 కోట్ల లాభాలను ప్రకటించింది. ఈ నష్టం తాత్కాలికమేనని ఆ కంపెనీ ఛైర్మన్ చంద్రకాంత్ పటేల్ పేర్కొన్నారు. భవిష్యతులో బహుముఖ విస్తరణ, నిధుల సేకరణ ప్రణాళికలతో మెరుగైన ఫలితాలను సాధిస్తామని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు.

కాగ్నిజెంట్‌లో వేతనాల పెంపు

హైదరాబాద్ : దిగ్గజ ఐటి సేవల కంపెనీ కాగ్నిజెంట్ తమ ఉద్యోగుల వేతనాలు పెంచుతున్నట్లు ప్రకటించింది. అర్హులైన 80 శాతం సిబ్బందికి దీన్ని వర్తింపజేయనున్నట్లు ఆ కంపెనీ గురువారం వెల్లడించింది. ఈ పెంపు నవంబర్ 1వ తేదీ నుంచి అమల్లోకి వస్తుందని తెలిపింది. ప్రతిభ ఆధారంగా 2025 ద్వితీయార్ధంలో ఉద్యోగులకు జీతాలు పెంచనున్నామని.. అయితే ఎంత మొత్తం పెంపు ఉంటుందనేది మాత్రం పనితీరులో వారికి వచ్చిన రేటింగ్ ఆధారంగా నిర్ణయిస్తామని కంపెనీ ప్రతినిధి వెల్లడించారు.

రోడ్డు సౌకర్యం కల్పించరూ..

● డోలీలతో ఆదివాసీల నిరసన



నర్సీపట్నంలో డోలీయాత్రతో నిరసన తెలుపుతున్న గిరిజనులు

ప్రజాశక్తి - నర్సీపట్నం, నర్సీపట్నం టౌన్ (అనకాపల్లి)

'చంద్రన్నా.. పవనన్నా.. మా రోడ్డు సమస్యలను పట్టించుకోరా' అంటూ అనకాపల్లి జిల్లా గొలుగొండ మండలం దొంకాడ గ్రామానికి చెందిన ఆదివాసీలు గురువారం వినూత్నంగా నిరసన తెలిపారు. నర్సీపట్నంలోని ఆర్‌డిఒ కార్యాలయం నుంచి అబీద్ సెంటర్ మీదుగా పంచాయతీరాజ్ శాఖ కార్యాలయం వరకూ డోలీయాత్ర చేపట్టారు. స్వాతంత్య్రం సిద్ధించి 79 సంవత్సరాలు కావొస్తున్నా నేటికీ గిరిజన గ్రామాలను పట్టించుకున్న నాథుడే కరువయ్యాడని ఆవేదన వ్యక్తం చేశారు. తమ సమస్యలను పరిష్కరించాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వారినుద్దేశించి ఆదివాసీ గిరిజన సంఘం ఐదో షెడ్యూల్ సాధన కమిటీ జిల్లా గౌరవాధ్యక్షులు కె.గోవిందరావు మాట్లాడుతూ.. డోలీ మోతలు లేని గ్రామాలే లక్ష్యమని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆరు నెలల క్రితం చెప్పిన మాటలు ఆచరణ రూపం దాల్చలేదన్నారు. గతంలో దొంకాడకు రోడ్డు నిర్మాణం కోసం కేంద్ర ప్రభుత్వం రూ.1.30 కోట్ల నిధులు మంజూరు చేసినా అటవీశాఖ అధికారుల క్లియరెన్స్ ఇవ్వకుండా పనులు మొదలు పెట్టని పంచాయతీరాజ్ శాఖ అధికారులు భీష్మించడంతో రోడ్డు పనులు ముందుకు కదల్లేదన్నారు. రోడ్డు సౌకర్యం లేకపోవడంతో డోలీ మోతలే శరణ్యమవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. గత సంవత్సరం పాంగి ముయ్యలు, కొండతామలి జ్యోతి, కొండతామలి సీతలను డోలీ మీద ఆస్పత్రికి తీసుకెళ్తుండగా మార్గ మధ్యంలోనే ప్రసవమైన విషయాన్ని గుర్తు చేశారు. రోడ్డు సమస్య పరిష్కారం కోసం అటవీ, పంచాయతీరాజ్ శాఖ కార్యాలయాల ఎదుట పలుమార్లు నిరసనలు చేపట్టామని తెలిపారు. ఇప్పటికైనా టిడిపి కూటమి ప్రభుత్వం, అధికారులు స్పందించి రోడ్డు సౌకర్యం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సత్తిబాబు, జి.సుబ్బారావు, అప్పారావు, సిఐటియు జిల్లా కార్యదర్శి ఎ.రాజు పాల్గొన్నారు.



మెడకు ఉరితాళ్లు వేసుకుని నిరసన తెలుపుతున్న ఆటో కార్మికులు

ఆటో కార్మికులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలి

● తిరుపతిలో మెడకు ఉరివేసుకుని నిరసన

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

ఆటో కార్మికులకు ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని, ప్రైవేట్ యాప్‌లు రద్దు చేసి, సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ తిరుపతి బస్టాండ్ అంబేద్కర్ సర్కిల్ వద్ద ఆటో కార్మికులు మెడకు ఉరితాళ్లు వేసుకుని నిరసన తెలిపారు. సిఐటియు జిల్లా కార్యదర్శి ఎస్.జయచంద్ర, ఆటో యూనియన్ నగర ప్రధాన కార్యదర్శి వాసు మాట్లాడుతూ.. ఆర్‌టిసి బస్సుల్లో మహిళల ఉచిత ప్రయాణానికి తాము వ్యతిరేకం కాదని, కానీ ఆటోలను నమ్ముకుని జీవనం సాగిస్తున్న తమ పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. ఆటోడ్రైవర్ల సంక్షేమ బాధ్యత తాను తీసుకుంటానని మంత్రి నారా లోకేష్ హామీ ఇచ్చారని గుర్తు చేశారు. తాగునీరు, టాయిలెట్ వంటి మౌలిక వసతులతో ఆటోస్టాండ్లను ఏర్పాటు చేస్తామని, ప్రమాదబీమా, హెల్త్ ఇన్సూరెన్స్, ఆటో ఇన్సూరెన్స్ కల్పిస్తామని, పోలీసులు, ఆర్‌టిఒ అధికారుల వేధింపులు లేకుండా చూస్తామని, 13 లక్షల మందికి వాహనమిత్ర అమలు చేస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. పెట్రోల్ డీజిల్ ధరలు తగ్గించి, సబ్సిడీతో ఎలక్ట్రికల్ ఆటోలను ఇవ్వాలని, ఓలా, ఊబర్, రాపిడో వంటి ప్రయివేట్ యాప్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్మికులకు శాపంగా మారిన జిఓ 21ను రద్దు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు పి.బుజ్జి, మురళి, జి.వాసు, ఎస్.బాదుల్లా, శేషు, శ్రీను, శంకరయ్య, గోపి, ప్రసాద్, రాము, కుప్పయ్య, గణేష్ పాల్గొన్నారు.



వధూవరులను ఆశీర్వదిస్తున్న వైఎస్ జగన్

మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి కుమారుడి వివాహ వేడుకల్లో జగన్

ప్రజాశక్తి - అనంతపురం

అనంతపురం జిల్లా ఉరవకొండ నియోజకవర్గ వైసిపి మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి తనయుడి వివాహ వేడుకల్లో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాల్గొన్నారు. నూతన దంపతులు ప్రణయ్‌రెడ్డి, సాయిరోహితకు శుభాకాంక్షలు తెలిపి ఆశీర్వదించారు. అంతకుముందు తాడేపల్లి నుంచి ప్రత్యేక హెలికాప్టర్‌లో అనంతపురానికి జగన్ చేరుకున్నారు. నగరంలోని వై.వి.శివారెడ్డి స్థలంలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ వద్దకు విచ్చేసిన జగన్‌కు జిల్లా వైసిపి నాయకులు, అభిమానులు స్వాగతం పలికారు. అక్కడి నుంచి రోడ్డు మార్గాన రుద్రంపేట మీదుగా జివిఆర్ గ్రాండ్స్ ఇంద్రప్రస్థ వివాహ వేదిక వద్దకు చేరుకున్నారు. జగన్‌ను చూసేందుకు వైసిపి కార్యకర్తలు పెద్ద ఎత్తున వివాహవేదిక వద్దకు చేరుకున్నారు. జగన్‌తో పాటు మాజీ మంత్రి రోజా, మాజీ ఎమ్మెల్యేలు అనంతవెంకటరామిరెడ్డి, ప్రకాష్ రెడ్డి తదితరులు వివాహ వేడుకలో పాల్గొన్నారు.

చిన్నారిపై చిరుత దాడి

అటవీ జంతువుల నుంచి రక్షించాలని చెంచుల ధర్నా



పెద్దదోర్నాల-శ్రీశైలం రహదారిలో ధర్నా చేస్తున్న చెంచులు



గాయపడిన చిన్నారి

ప్రజాశక్తి-పెద్దదోర్నాల (ప్రకాశం జిల్లా)

నల్లమల అడవి అంచున ఉన్న పెద్దదోర్నాల మండలంలోని చిన్నారుట్ల చెంచు గిరిజన గూడెంలో చిన్నారిపై చిరుత పులి దాడి చేసింది. గ్రామస్తుల సమాచారం మేరకు... అడవి నుంచి గ్రామంలోకి చొరబడ్డ చిరుత పులి గూడెంలోని ఓ ఇంట్లో నిద్రిస్తున్న కుడుముల అంజయ్య, రాజేశ్వరి దంపతుల చిన్నారి (3)పై చిరుత దాడి చేసింది. చిన్నారి తలను పట్టుకుని అడవిలోకి చిరుత పులి తీసుకుపోతున్న సమయంలో అంజయ్య గమనించి గట్టిగా కేకలు వేశారు. అడవిలోకి పారిపోతున్న చిరుతను వెంబడించడంతో గ్రామ శివారులో చిన్నారిని వదిలిసి అడవిలోకి పారిపోయింది.

తీవ్రగాయాల పాలైన చిన్నారిని సున్నిపెంట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. తల, మెడ భాగాల్లో గాయాలు ఉన్నప్పటికీ ప్రాణాపాయం లేదని వైద్యులు తెలిపారు.

తమ గూడేనికి కరెంట్ సదుపాయం లేకపోవడంతో అటవీ జంతువులు తమపై దాడి చేస్తున్నాయని చెంచులు ధర్నాకు దిగారు. వెంటనే కరెంట్ సౌకర్యం కల్పించి అటవీ జంతువుల నుంచి రక్షణ కల్పించాలని కోరుతూ గురువారం ఉదయం పెద్దదోర్నాల -శ్రీశైలం రహదారిలో చిన్నారుట్ల చెంచుగూడెం వద్ద ధర్నా నిర్వహించారు. మూడేళ్ల పాపను చిరుతపులి తీసుకెళ్లడం తండ్రి గమనించకపోతే చనిపోయేదని వాపోయారు. విషయం తెలుసుకున్న ఎఫ్ఆర్ఒ హరి ఈ విషయాన్ని ఫీల్డ్ డైరెక్టర్ సందీప్ కృపాకర్‌కు తెలియజేశారు.

ఆయనతో పాటు ఎస్ఐ ఆందోళన వద్దకు చేరుకున్నారు. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో చెంచులు ధర్నా విరమించారు.




జాతీయ హాకీ జట్టుకు ఇద్దరు ఎంపిక

ప్రజాశక్తి - యు.కొత్తపల్లి (కాకినాడ జిల్లా)

జాతీయ హాకీ జట్టుకు కాకినాడ జిల్లా యు.కొత్తపల్లి మండలం ఉప్పాడ గ్రామానికి చెందిన ఇద్దరు యువకులు ఎంపికయ్యారు. పంజాబ్ రాష్ట్రంలోని జలంధర్లో ప్రారంభమైన 15వ హాకీ ఇండియా జూనియర్ హాకీ చాంపియన్ షిప్‌లో పాల్గొని ఆంధ్రప్రదేశ్ జట్టుకు ఉప్పాడకు చెందిన చొక్కా డేవిడ్, మెరుగు హేబెల్ ఎంపికయ్యారు. ఏప్రిల్ నెలలో ధర్మవరంలో జరిగిన ఎపి జూనియర్ హాకీ చాంపియన్ షిప్‌లో వీరు ప్రతిభ కనబరిచారు. గతంలో స్కూల్ గేమ్స్ అండర్ 19 జాతీయ పోటీల్లో పాల్గొన్నారు. జాతీయ పోటీల్లో పాల్గొంటున్న వీరికి రావు చిన్నారావు, సురక్ష డాక్టర్ శ్రీనివాసరావు, గంటా విజయకుమార్ స్పోర్ట్స్ కిట్ స్పాన్సర్ చేశారు. సర్పంచ్‌లు నాగేశ్వరావు, జాన్, మణికంఠ గ్రామ పెద్దలు, స్పోర్ట్స్ క్లబ్ సభ్యులు, పిడిలు సురేష్ రాజు, పవన్ కుమార్, పద్మశ్రీ, కోచ్ రవిరాజు అభినందనలు తెలిపారు.

ట్రంప్ నిబంధనలు తోసిపుచ్చిన న్యాయమూర్తి

ఫిలడెల్ఫియా : డోనాల్డ్ ట్రంప్ మొదటిసారి అమెరికా అధ్యక్షుడు అయినప్పుడు అమలు చేసిన నిబంధనలను అమెరికా న్యాయమూర్తి ఒకరు కొట్టివేశారు. జనాభా నియంత్రణ పాటించిన కార్మికులకు మత లేదా నైతిక అభ్యంతరాలతో బీమా సౌకర్యం కల్పించకుండా యజమానులకు మినహాయింపు ఇస్తూ ట్రంప్ తన మొదటి పదవీకాలంలో ఆదేశాలు జారీ చేశారు. ఫిలడెల్ఫియాలోని అమెరికా జిల్లా జడ్జి వెండీ బీటెల్‌స్టోన్ ఈ నిబంధనలను బుధవారం తోసిపుచ్చారు. అవి న్యాయసమ్మతం కావని ఆయన స్పష్టం చేశారు. మతపరమైన యజమానుల హక్కులు కాపాడేందుకు ఈ నిబంధనలు అవసరమన్న ట్రంప్ ప్రభుత్వ వాదనను తోసిపుచ్చారు. మినహాయింపు పరిధి చాలా విస్తృతంగా ఉన్నదని, అది అవసరమైన యజమానులు చాలా తక్కువ సంఖ్యలో ఉన్నారని, దీంతో రెండింటికీ పొంతన కుదరడం లేదని తెలిపారు.

ట్రంప్ నిబంధనలను సవాలు చేస్తూ అప్పట్లో పెన్సిల్వేనియా, న్యూజెర్సీ రాష్ట్రాలు న్యాయ స్థానాన్ని ఆశ్రయించాయి. కాగా న్యాయమూర్తి బీటెల్‌స్టోన్ ఇచ్చిన తీర్పుపై అమెరికా న్యాయ శాఖ ఇంకా స్పందించలేదు. అయితే ఈ తీర్పును సవాలు చేసేందుకు రోమన్ కాథలిక్ సంస్థ 'లిటిల్ సిస్టర్స్ ఆఫ్ ది పూర్' సన్నాహాలు చేస్తోంది. ట్రంప్ నిబంధనలను ఉపసంహరించుకోవాలని జో బైడెన్ ప్రభుత్వం 2003లో ప్రతిపాదించింది. అయితే బైడెన్ అధికారాన్ని కోల్పోవడానికి కొన్ని వారాల ముందు తన ప్రతిపాదనను వెనక్కి తీసుకున్నారు.

రేపటి ఆశలు మనవేనోయ్

రండి బాలలు రారండీ,
జాతీయ పతాకం ఎగరేద్దాం.
మూడు రంగులతో ముచ్చటగా
రెప రెపలాడే మన జెండా

కాషాయం శౌర్యానికి ప్రతీక
ఆకుపచ్చ మన ప్రకృతి కనుక,
మధ్యన తెల్లటి రంగు తెలుపును
శాంతి,క్రాంతి,సమత మనదని

అశోక చక్రం ధర్మ నిబద్ధత
ఎగిరే జెండా మనసుల నిండా
పింగళి వెంకయ్య రూపుదిద్దిన
శౌర్య పతాకం మనకండ

ధర్మంగానే మనముంటాం
అధర్మాలను సహించబోము
ఒక్కసారి ఎదిరించామంటే
వేరుతో సహా పెకిలిస్తాం

ముష్కరులను తెగ నాడే ధైర్యం
మన ధీరవనితల ఆభరణం
న్యాయం ధర్మం మనదే కనుక

విజయం వెంటే మన
పయనం


దేశం కోసం మనమంటూ
ముచ్చటగా
ముందడుగేద్దాం
చదువు, సంస్కారం కలిగి
మంచి బాలలుగా మనముందాం

దేశం మనకేమిచ్చిందనక
దేశానికి మనమేమిచ్చామని
మనలను మనమే ప్రశ్నిస్తూ
దేశ సేవకై కలిసి నడుద్దాం

ఎదిగే బాలలు మనమేనోయ్
రేపటి ఆశలు మనవేనోయ్,
చెడుని ఎదిరించి, మంచిని
నిలుప
చేయి, చేయి కలపాలోయ్.
అందర మొకటై నడవాలోయ్.

- కూచిమంచి నాగేంద్ర,
91821 27880.

నేను గీసిన బొమ్మ






మోడీ మహాలక్ష్మి,
6వ తరగతి,
జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల,
అనంత సాగర్, సిద్దిపేట జిల్లా.

ప్రగతి గీతిక

మూడు రంగుల జెండా
నిం నిండా
నింపు భారతీయుడా
సొంపు గనుము ధీరుడా

స్వాతంత్ర్య సమర నేత
మన జెండా నిర్మాత
పావన భాగ్య విధాత
పింగళి వెంకయ్య తాత



జాతీయ సమైక్యతే
అతని అణువణువంతా
దేశభక్తి తోడనే
అతని జీవన మంతా

కాషాయపు వర్ణమే
శౌర్యానికే ప్రతీక
శ్వేతమే శాంతి కాముక
హరితమే ప్రగతి గీతిక
- గుండాల నరేంద్ర బాబు,
94932 35992.

ఆగస్టు పదిహేను వచ్చింది

వచ్చిందమ్మా వచ్చింది
ఆగస్టు పదిహేను వచ్చింది
ఉదయాన్నే లేచి స్కూలుకి పోదాం
తిరంగ పతాకం ఎగురవేద్దాం!

దేశభక్తి గీతాలు పాడుకుంటూ
వందనం చేద్దాం అందరంగా
తాతల త్యాగాలను గుర్తుచేసుకుని



ఎఇఎ. రెయినా,
3వ తరగతి,
లౌరెల్ కిడ్స్ స్కూల్,
రాజమండ్రి.

అమర వీరులను స్మరించుకుంటూ
అందరికి జోహార్లు అర్పిద్దాం!

దేశభక్తితో వెలిగే పండుగ సమయం
ఇది భారత జాతికి గర్వదినం
జనగణమన పాడి 'జై హింద్' అంటూ
భారతమాతకు వందనం చేద్దాం!

- చిత్రాడ కిషోర్ కుమార్,
98669 12906 .

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com



స్వేచ్ఛా గీతాన్ని .. స్వాతంత్ర్య పాఠాన్ని ...

నేను పుస్తకాన్ని మాట్లాడుతున్నాను.

స్వేచ్ఛాస్వాతంత్ర్యాలు సంప్రాప్తించాయని మనమందరం ఘనంగా వినువీధుల నిండా మువ్వన్నెల పతాకను ఎగురవేసే పర్వదినం సందర్భంగా నోరు విప్పి, మాట్లాడుతున్నాను. నన్ను నోరు తెరవని వక్తనంటారు. కానీ, ఇప్పుడు నోరు తెరచి మాట్లాడుతున్నాను.


నేను తొలుత అక్షరాన్ని. పదాలుగా పల్లవించి, వాక్యాలుగా విస్తరించి, పుటలు పుటలుగా పురోగమించి, పుస్తకంగా మీ చేతిలోకి వచ్చిన సమాచారాన్ని. భావాల సంపుటిని. అభిప్రాయాల వెల్లువని. అనేకానేక అనుభవాల అభివ్యక్తిని. చరిత్రని. సామాజిక సత్యాన్ని. వర్తమాన శ్వేతపత్రాన్ని. భిన్నాభిప్రాయాల వేదికని. నేను పుస్తకాన్ని. తొలుత ఏది చెప్పానో దానికే కట్టుబడి ఉంటాను. ప్రతి అక్షరానికి నిబద్ధినై ఉంటాను. పుటలు చించి, ప్రాణం తీసినా మాట మార్చను. అగ్నిలో దహించినా, అంధకారంలో బంధించినా నేను నాలానే ఉంటాను. నేను నియంతను కాను. సత్యానికి కట్టుబడ్డ అక్షర సాక్షిని.

'అక్షర రూపం దాల్చిన సిరా చుక్క వేయి మెదళ్ల కలయిక' అన్నారు కవి కాళోజీ. 'చినిగిన చొక్కా అయినా తొడుక్కో. మంచి పుస్తకం కొనుక్కో' అని చెప్పారు సంఘ సంస్కర్త కందుకూరి. సమాజం ముమ్మందుకు వెళ్లటానికి, అన్ని విధాలా అభివృద్ధి పథాన నడవటానికి, మనుషులు చైతన్యంతో మెలగటానికి, అంతరాల దొంతరలను అధిగమించి, అన్నిటా అందరూ వెలుగు రేకలై విరియటానికి మహానుభావులు ఎందరో నా ప్రాధాన్యాన్ని తమ మాటల్లో, రాతల్లో చాటి చెప్పారు. నన్నొక ఆయుధంగా, చైతన్య సాధనంగా ఉపయోగించారు. అనేక సంఘటనలను సందర్భాలను ఏర్చికూర్చి, మంచిచెడ్డలపై విశ్లేషణలు చేసి, చరిత్రను సాక్ష్యంగా చూపి, వర్తమానాన్ని ఎలా అర్థం చేసుకోవాలో, భవిష్యత్తును ఎలా నిర్మించుకోవాలో నా ద్వారా చదువరులకు వివరించారు.

మన దేశానికి స్వాతంత్ర్యాన్ని సాధించటంలో, స్వాతంత్ర్య సామాజిక ఉద్యమాల్లో ప్రజలను సమీకరించటంలో నేను గర్వకారణమైన పాత్ర పోషించాను. మహామహుల చేతిలో ఆయుధంగా, గళంలో బలమైన మాటగా ప్రతిధ్వనించాను. ఇంకొన్ని గంటల్లో ఉరి తీస్తారని ప్రకటించాక కూడా భగత్‌సింగ్ నన్ను ప్రేమగా, ప్రేరణగా పఠించాడు. కఠిన కారాగార శిక్ష అనుభవిస్తూ కూడా అనేకమంది స్వాతంత్ర్య సమరయోధులు నన్ను మాత్రమే తమ వెంట ఉండేలా కోరుకున్నాను. ఇలాంటి అద్భుత క్షణాలను తలచుకొని, ఉత్తేజపడతాను. ఉత్సాహపడతాను.

బ్రిటీషు వలస పాలకులు మహా మహా నాయకులను, మహోధృత పోరాటాలను చూసి ఎంత భయపడ్డారో– నన్ను చూసీ అంతే బెంబేలెత్తారు. అంత కదలికకు, అంత భావోధృతికి నేను కూడా ఓ ప్రధాన కారణమని భావించారు. నా నోరు నొక్కటానికి 1867లోనే ఒక చట్టం తీసుకొచ్చారు. ప్రజలను చైతన్యపరిచే భావాలను కట్టడి చేయటానికి నాపై నిషేధం విధించారు. 'మాలపల్లి' నవలగా వచ్చినప్పుడు నాపై నిషేధం.. 'మా భూమి' నాటకంగా మార్మోగినప్పుడు నాపై నిషేధం... 'మాకొద్దీ తెల్లదొరతన'మని గరిమెళ్ల గర్జించినప్పుడూ నిషేధం! ఇలా దేశవ్యాప్తంగా ఎన్నో సందర్భాలు ... పత్రికల మీద, అచ్చొత్తుకున్న అక్షరాల మీదా నల్లరంగులు పూసారు. వార్తలను కత్తిరించారు. పుస్తకాలను మాయం చేశారు. రాసినవాళ్లను, ప్రచురించిన వాళ్లను జైళ్లలో పెట్టి ... నానా హింసలకూ గురి చేశారు. నా నోరు మూయించటానికి, నన్ను నిస్తేజపు చిత్తు ప్రతిగా మార్చటానికీ శాయశక్తులా పన్నాగాలు పన్నారు.

అయినా, ఏం జరిగింది?



అచంచలమైన దేశ ప్రజల పోరాటానికి, అక్షరాలు అందించిన అస్త్రశస్త్ర బలగానికీ వలస పాలకులు తలదించాల్సి వచ్చింది. 78 ఏళ్ల క్రితం ఇదే రోజు మువ్వన్నెల పతాకం... మన స్వేచ్ఛాస్వాతంత్ర్యాల సంకేతం నీలాల నింగిలో రెపరెపలాడింది. దేశమంతా సంతోష సంబరాలు అంబరాన్ని తాకాయి. ఆనందంతో ఉప్పొంగిపోయాను నేను. ఇంతటి విజయంలో నేనూ భాగస్వామినైనందుకు గర్వపడ్డాను.

స్వాతంత్ర్యం వచ్చాక కూడా నా బాధ్యతను నేను మరువలేదు. స్వాతంత్ర్యం వచ్చిందని సంబరపడుతూనే – చేయాల్సిన పనులేమిటో, చేరాల్సిన లక్ష్యాలేమిటో, సామాన్యుల జీవనమెట్టిదో ... ఎప్పటికప్పుడూ చాటుతూనే ఉన్నాను. ఎందరెందరో ఆలోచనాపరులు దేశం గురించి ప్రతి నిత్యం ఆలోచిస్తూ.. తమ వాదాలను, భావాలను నాలో నింపుతుంటే– నిత్య నూతనంగా వెలువడుతూనే ఉన్నాను. వందలు వేలుగా, లక్షలు కోట్లుగా పల్లెల్లో, పట్టణాల్లో, నగరాల్లో, వీధుల్లో, విశ్వవిద్యాలయాల ప్రాంగణాల్లో విస్తరిస్తూనే ఉన్నాను. 'పుస్తకం మస్తిష్క నేస్తం' అన్న మాటను సార్థకం చేసే దిశగా సాగుతూనే ఉన్నాను. ఈ దేశాన్ని నడిపించే రాజ్యాంగంగా, శాస్త్ర సాంకేతిక, వైద్య, భాషా తదితర పాఠ్యాంశాలుగా; చరిత్రగా, భవిష్యత్తుగా, అనేక వాదాలుగా, భిన్న విభిన్న అభిప్రాయ మాలికలుగా బహు రూపాల్లో ఎదుగుతూనే ఉన్నాను. ఎవరు ఏ విషయం తెలుసుకోవాలనుకున్నా... పుటలు తెరుచుకొని దన్నుగా నిలుస్తున్నాను. చరిత్రలో ఏది జరిగిందో, ఏది జరగలేదో, ఏది వాస్తవమో, ఏది పుక్కిట పురాణమో తెలుసుకోవటానికి నేనే ఆధారమవుతున్నాను.

అలాంటి నాపై, దేశం 78వ స్వాతంత్ర్య సంబరాలకు సన్నద్ధమవుతున్న వేళ ... స్వదేశీ పాలకులు నిషేధం విధించటం తీవ్రమైన బాధ కలిగించింది. భిన్న కోణాల్లో కాశ్మీర్ చరిత్ర, సామాజిక సమస్యలపై చర్చించే 25 పుస్తకాలపై నిషేధపుటుత్తర్వులు ఇవ్వడం బ్రిటీషు కాలాన్ని, నిర్బంధ చట్టాలను గుర్తు చేసింది. అణచివేతను, నిరంకుశ ధోరణులను వదులుకోవాల్సిన స్వాతంత్ర్య దేశంలో మళ్లీ 160 ఏళ్ల చట్టమే పేరు మార్చుకొని అదే నిర్బంధ తీరును ప్రదర్శించటం నిర్ఘాంతపరిచింది.

అందుకే, ఈ వేళ నోరు తెరచి మాట్లాడుతున్నాను.

సంబరాలు జరుపుకోవటం ఒక తంతు కాదని గుర్తు చేసుకుంటున్నాను. అనేక భాషలు, సంస్కృతులు, ఆచార వ్యవహారాలు వెల్లివిరిసే అందమైన పూలదోటలో ఏ రంగూ నిషేధితం కాదు. 'ఒకే తోట ఒకే పువ్వు ఒకే రంగు' అన్న భావనతో ఏ వైవిధ్యాన్నీ చవిచూడలేం. రంగురంగుల పూలవనమే మన దేశానికి అందం. ఇది జాతీయ కవి ఇక్బాల్ చెప్పిన మాట. విశ్వకవి రవీంద్రుడు పాడిన పాట. భిన్నత్వంలో ఏకత్వమై స్వాతంత్ర్య పోరాటంలో దేశ పౌరులు యావన్మందీ నడిచిన బాట. ఈ చరిత్ర తెలియాలన్నా నన్నే తెరవాలి.నన్నే చదవాలి! **నన్ను చదివిన వాళ్లు విస్తరిస్తారు. విశాల హృదయులవుతారు. నన్ను చీకట్లో ఉంచాలనుకునేవాళ్లు చరిత్ర ముందు తలొంచుకొని నిలబడతారు.**

ఈ విషయం చెప్పటానికే నోరు తెరచి మాట్లాడుతున్నాను.

నేను పుస్తకాన్ని.
నిషేధాలకు లొంగని విశాల జ్ఞాన సౌధాన్ని.
చీకట్లను చీల్చుకొని విస్తరించే కాంతి వలయాన్ని.
శాంతి పావురాన్ని. సమస్త వివేక విశ్వాన్ని.
స్వేచ్ఛాగీతాన్ని .. స్వాతంత్ర్య పాఠాన్ని...
స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు వర్థిల్లాలి.
సామరస్య, సౌభ్రాతృత్వ భావనలు వెల్లివిరియాలి.
ఉంటాను ఇక.. స్వేచ్ఛాకాంక్షనై ...
స్వాతంత్ర్య స్ఫూర్తినై ...

– సత్యాజీ

పొంచి ఉన్న ముప్పు

- రాష్ట్రానికి ఫ్లాష్ ఫ్లడ్ హెచ్చరిక
- అల్పపీడన ప్రభావంతో భారీ వర్షాలు
- ప్రకాశం బ్యారేజీ వద్ద రెండో ప్రమాద హెచ్చరిక

ప్రజాశక్తి – యంత్రాంగం

అల్పపీడన ప్రభావంతో గురువారం కోస్తాంధ్రలో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిశాయి. అల్లూరి సీతారామరాజు జిల్లా, తూర్పుగోదావరి జిల్లాలో కుండపోత వర్షం కురిసింది. శ్రీకాకుళం జిల్లా వజ్రపుకొత్తూరు మండలంలో సుమారు 80 మీటర్ల మేర సముద్రం చొచ్చుకొచ్చింది. ప్రకాశం బ్యారేజీకి వరద ఉధృతి కొనసాగుతుండడంతో రెండో ప్రమాద హెచ్చరికను అధికారులు జారీ చేశారు. లంకగ్రామాల ప్రజలను అప్రమత్తం చేశారు. వరద నీటిలో ఈతకు వెళ్లడం, చేపల వేటకు వెళ్లొదని హెచ్చరికలు జారీ చేశారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాల్లో పంట పొలాలు నీటమునిగినాయి. అల్లూరి జిల్లాలో గెడ్డలు పొంగి పొర్లుతున్నాయి. చింతపల్లి మండలం అంతర్ల గ్రామంలో జాతీయ రహదారి 516 (ఇ)పై నిర్మించిన కల్వర్టు కోతకు గురైంది. డుంబ్రిగుడ మండలంలోని చాపరాయి జలపాతం వద్దకు రెండు రోజులపాటు పర్యాటకులను నిషేధించారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం, రాజమహేంద్రవరం రూరల్, రాజానగరం, కడియం, కోరుకొండ ప్రాంతాల్లో తేలికపాటి వర్షం కురుస్తూనే ఉంది.

ఎన్‌టిఆర్ జిల్లా నందిగామ మండలం చందాపురం గ్రామం వద్ద నల్లవాగు ఉధృతంగా ప్రవహించడంతో నందిగామ– చందర్లపాడు మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. మున్నేరు వరద ఉధృతికి నందిగామ మండలం రాఘవాపురం పల్లగిరి గ్రామాల్లో పంట పొలాలు నీట మునిగాయి. ఎకరాకు రూ. 10,000 నుంచి రూ. 50,000 వరకు నష్టం వాటిల్లిందని రైతులు వాపోయారు. గంపలగూడెం మండలంలో కట్టలేరు వారు ఉధృతంగా ప్రవహిస్తోండడంతో గంపలగూడెం – విజయవాడ మధ్య రాకపోకలకు ఆటంకం ఏర్పడింది. విజయవాడ 49వ డివిజన్ టైలర్ పేట వీరయ్య వీధిలో నివాసం ఉంటున్న కె.శ్రీనివాసరావు ఇంటిపై రిటర్నింగ్ వాల్ జారిపడింది. బుడమేరు నీటి ఉధృతికి పుట్టగుంట వద్ద మచిలీపట్నం, నూజివీడు, కల్లూరు జాతీయరహదారి కోతకు గురి అవుతోంది. పెదపులిపాకలో కరకట్ట కింద ఉన్న ఇళ్లను కృష్ణా నది వరద నీరు తాకింది. వరద చుట్టుముట్టిన ఇళ్లను ఖాళీ చేయాలని అధికారులు సూచిస్తున్నారు.



ప్రకాశం బ్యారేజీ వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న కృష్ణానది

పంటలు మునక

ఏలూరు జిల్లాలో బుధవారం రాత్రి నుంచి కురిసిన వర్షంతో లోతట్టు ప్రాంతాలు నీట మునిగాయి. జీలుగుమిల్లి మండలం కామయ్యపాలెం వాగు, అశ్వారావుపేట వాగు, సంగం వాగుల గుండా వరద నీరు పోటెత్తింది. వంకవారిగూడెం వద్ద కల్వర్టు కొట్టుకుపోయింది. దీంతో ఆయా మార్గాల్లో రాకపోకలు నిలిచిపోయాయి. టి.నర్సాపురం మండలంలో ముగ్గురాళ్ల వాగు పొంగి ప్రవహిస్తోంది. ఏజెన్సీ మినహా ఇతర ప్రాంతాల్లో వరి పొలాలు నీట మునిగాయి. పశ్చిమగోదావరి జిల్లాలోని నక్కల, తాడేరు, కొటాలపర్రు, డ్రెయిన్లు ఉధృతంగా ప్రవహిస్తోండడంతో ఆచంట మండలంలోని ఆచంట, శేషమ్మచెరువు, పెనుమంచిలి, ఆచంట వేమవరం, వల్లూరు గ్రామాల్లోని పంట పొలాలు నీటమునిగాయి.

సంద్రంలోకి 5.58 లక్షల క్యూసెక్కులు విడుదల

ప్రకాశం బ్యారేజీకి వరద ఉధృతి కొనసాగుతుండడంతో రెండో ప్రమాద హెచ్చరికను జారీ చేశారు. గురువారం మధ్యాహ్నం గరిష్ఠంగా 5,65,807 క్యూసెక్కుల వరద రావడంతో బ్యారేజీ 70 గేట్లను ఎత్తి 5,65,201 క్యూసెక్కులను సముద్రంలోకి విడుదల చేశారు. సాయంత్రం ఆరు గంటల సమయానికి ఇన్‌ఫ్లో 5,59 లక్షలు కాగా అవుట్ ఫ్లో 5,58,400 క్యూసెక్కులుగా ఉంది. ప్రస్తుతం బ్యారేజీ వద్ద 14.6 అడుగుల నీటిమట్టం కొనసాగుతోంది. నాగార్జునసాగర్‌కు ఎగువ నుంచి 2,52,840 క్యూసెక్కులు వస్తుండగా దిగువకు 2,92,826 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. అలాగే పులిచింతల జలాశయంకు 2,71,400 క్యూసెక్కుల నీరు వస్తుండగా 1,84,034 క్యూసెక్కులు దిగువకు విడుదల చేస్తున్నారు

'ఉపాధి'పై తులసిరెడ్డి వ్యాఖ్యలు సరికాదు

- ఉభయ వ్యవసాయ కార్మిక సంఘాలు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఉపాధి హామీ పథకాన్ని నీరుగార్చే విధంగా కాంగ్రెస్ రాష్ట్ర అధికార ప్రతినిధి తులసిరెడ్డి వ్యాఖ్యానించడాన్ని ఉభయ వ్యవసాయ కార్మిక సంఘాల రాష్ట్ర కమిటీలు తప్పుబట్టాయి. 'వ్యవసాయం పండుగా, దండగా' అనే అంశంపై గుంటూరులో జరిగిన ఓ చర్చా గోష్టిలో ఉపాధి హామీని వ్యవసాయానికి అనుసంధానం చేయాలని తులసిరెడ్డి వ్యాఖ్యానించడం కాంగ్రెస్ విధాన నిర్ణయానికి వ్యతిరేకమన్నారు. ఉపాధి పథకాన్ని నీరుగార్చే విధంగా మాట్లాడటం సరైంది కాదని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం (ఎఐఎడబ్ల్యుయు) రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు వి.వెంకటేశ్వర్లు, ఎపి వ్యవసాయ కార్మిక సంఘం (బిఎంకెయు) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆవుల శేఖర్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

నానో ఎరువులతో సంబంధం లేకుండా రైతులకు యూరియా

- ఎపి రైతు సంఘం డిమాండ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రైతులకు అవసరమైన పరిమాణంలో యూరియాను అందుబాటులో ఉంచాలని, డిమాండ్‌కు తగినట్లుగా రైతులకు అందించాలని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. వరి పంటకు అవసరమైన తరుణంలో యూరియా అందుబాటులో లేక రైతులు షాపుల దగ్గర బారులు తీరుతున్నారని సంఘం రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు వి.కృష్ణయ్య, కె.ప్రభాకర్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఒక లీటరు నానో ఎరువులు కొంటేనే ఎరువులు విక్రయిస్తామని చెబుతూ నానో ఎరువులను రైతులకు బలవంతంగా అంటగడుతున్నారని తెలిపారు. యూరియా అవసరమైన రైతులు అందరికీ నానా ఎరువులతో సంబంధం లేకుండా అందించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రానికి కేటాయించిన యూరియా మొత్తాన్ని ఒక్కసారే అందుబాటులోకి తీసుకువస్తే రైతులందరికీ అవసరమైన యూరియా అందించవచ్చని సూచించారు.





శాశ్వత సచివాలయ భవన నిర్మాణ ప్రదేశాన్ని పరిశీలిస్తున్న సిపిఎం బృందం, రాయపూడిలో రోడ్డు నిర్మాణం కారణంగా ఇళ్లు కోల్పోయే వారితో మాట్లాడుతున్న సిపిఎం బృందం

మలి విడత భూసమీకరణతో..

రాజధాని ఆర్థిక వ్యవస్థ చిన్నాభిన్నం

- సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్ బాబూరావు

ప్రజాశక్తి –తుళ్లూరు (గుంటూరు జిల్లా)

రాజధాని నిర్మాణానికి మలి విడత భూ సమీకరణ అంటూ ప్రభుత్వం చేసిన ప్రకటనలతో రాజధాని ఆర్థిక వ్యవస్థ చిన్నాభిన్నమవుతోందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్ బాబూరావు అన్నారు. రియల్ ఎస్టేట్ మందగించిందని, రాజధాని నిర్మాణం, హామీల అమలు నత్తనడకన సాగుతున్నాయని తెలిపారు. రాజధాని రైతుల ప్లాట్లు ఎక్కడో.. వాటి అభివృద్ధి ఎప్పుడో.. తెలియడంలేదని, స్థానికులకు పనుల కల్పన మృగ్యమైందని ఆందోళన వ్యక్తం చేశారు. అమరావతి రాజధాని ప్రాంతంలో సిపిఎం బృందం గురువారం పర్యటించింది. రాజధాని నిర్మాణ పనుల పురోగతి, రైతులు, అసైన్డ్ రైతుల కౌలు, వలస కార్మికుల స్థితిగతులు, వరద పరిస్థితి, స్థానిక సమస్యలపై బృందం సభ్యులు పరిశీలించారు. తుళ్లూరులోని ఆర్‌విఆర్ నిర్మాణ సంస్థకు చెందిన వలస కార్మికుల గృహసముదాయం వద్ద కార్మికులతో మాట్లాడారు. దళితవాడలో అసైన్డ్ రైతులతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కొంతమందికి కౌలు జమ కాలేదని అసైన్డ్ రైతులు సిపిఎం నాయకుల దృష్టికి తీసుకొచ్చారు. అనంతరం తుళ్లూరు – రాయపూడి మధ్య ఛిద్రమైన రోడ్డును, పాలవాగు ఉధతిని, రోడ్లపై ప్రవహిస్తున్న వరద నీటిని పరిశీలించారు. శాశ్వత సచివాలయం, హైకోర్టు భవన నిర్మాణాల గురించి బందం సభ్యులు కార్మికులతో మాట్లాడారు. వెలగపూడిలో రైతులు, రాయపూడి, మల్కాపురంలో దళితుల సమస్యల గురించి నాయకులు చర్చించారు. ఈ సందర్భంగా బాబూరావు మాట్లాడుతూ.. వైసిపి ప్రభుత్వం మూడు రాజధానులంటూ విచ్ఛిన్నం చేసిందని, అధికారంలోకి వచ్చిన టిడిపి కూటమి ప్రభుత్వం ఆశించినంతగా పనులు వేగంగా జరగడం లేదని తెలిపారు. రాజధాని నిర్మాణానికి రైతులు భూములిచ్చి ఏళ్లు గడుస్తున్నా, ప్రభుత్వాలు మారుతున్నా ఎక్కడి సమస్యలు అక్కడే ఉన్నాయన్నారు. ఉచిత విద్య, వైద్యం హామీలు ఉత్తుత్తి మాటలుగానే మిగిలిపోయాయని, విట్, ఎస్‌ఆర్‌ఎం లాంటి విద్యా సంస్థల్లో లక్షలాది రూపాయల ఫీజులు వసూలు చేస్తున్నారని తెలిపారు. రాజధాని హామీల అమలు కోసం స్థానికులతో కలిసి సిపిఎం పోరాడుతుందని బాబురావు చెప్పారు. ఈ పర్యటనలో సిపిఎం రాజధాని డివిజన్ కార్యదర్శి ఎం రవి, నాయకులు వల్లభాపురం వెంకటేశ్వరరావు, జె నవీన్ ప్రకాష్,పేరం బాబురావు, షేక్ జానీ, పి వెంకటేశ్వర్లు, రాములు పాల్గొన్నారు.

ఇంజనీరింగ్‌లో 1,19,666 మందికి సీట్లు

- ముగిసిన కౌన్సిలింగ్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో
రాష్ట్రంలో ఇంజనీరింగ్ కోర్సుల ప్రవేశాలకు సంబంధించిన ఇఎపిసెట్ కౌన్సిలింగ్ ముగిసింది. ఇతర రాష్ట్రాల్లో ఇంటర్మీడియట్ చదివిన విద్యార్థుల స్థానికత అంశంపై కోర్టులో పెండింగ్‌లో ఉండటం వల్ల సీట్ల కేటాయింపు వాయిదా పడింది. తొలి, మలి దశల్లో నిర్వహించిన కౌన్సిలింగ్‌లో మొత్తం 1,19,666 మంది విద్యార్థులు ఇంజనీరింగ్‌లో ప్రవేశాలు పొందారు. తుది దశ కౌన్సిలింగ్ వివరా లను ఇఎపిసెట్ కన్వీనర్, సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ గణేష్ గురువారం విడుదల చేశారు. ఇఎపిసెట్‌లో మొత్తం 1,84,249 మంది అభ్యర్థులు అర్హత సాధించారు. రెండు దశల్లో నిర్వహించిన కౌన్సిలింగ్‌లో 1,29,012 మంది సీట్ల కోసం దరఖాస్తు చేసుకోగా, వీరిలో 1,28,712 మంది అర్హత సాధించారు. రాష్ట్రంలో ఉన్న 246 ఇంజనీరింగ్ కళాశాలల్లో కన్వీనర్ కోటా కింద 1,53,964 సీట్లు అందుబాటులో ఉన్నాయి. వీటిల్లో 1,19,666 సీట్లు భర్తీ కాగా, 34,298 సీట్లు భర్తీ కాలేదు. ఎపి స్పోర్ట్స్ అథారిటీ నుంచి మెరిట్ లిస్ట్ రాక పోవడంతో 677 మందికి సీట్లు కేటాయింపు రాలేదు. లిస్ట్ వచ్చిన తరువాత వీరికి సీట్ల కేటాయింపు ఉంటుంది. ఈ నెల 18 నుంచి తరగతులు ప్రారం భమవుతాయని, ఈ నెల 20వ తేదీలోపు అభ్యర్థులు కళాశాలల్లో చేరాలని కన్వీనర్ తెలిపారు.

'చౌదరి గారి అమ్మాయి' ఫస్ట్ గ్లింప్స్ విడుదల

ఎడ్‌కాన్ ప్లస్ నిర్వహణలో వినయ్ తేజ్, రిషిత తొలి పరిచయంగా తెరకెక్కుతున్న సినిమా 'చౌదరిగారి అమ్మాయి'. ఎడ్‌కాన్ ప్లస్ సంస్థ నిర్మాణ సారథ్యంలో దర్శకుడు సిద్ధు వర్మ కాకాని తెరకెక్కిస్తున్నారు. ఈనెల నాలుగోతేదీ నుంచి రెగ్యులర్ షూటింగ్ ప్రారంభమైంది. అసిస్టెంట్ డైరెక్టర్‌గా ఆదిత్య ప్రదీప్, డిఒపి మహేష్‌రెడ్డి వ్యవహరి స్తున్నారు. ఈ సినిమా నుంచి గురువారం నాడు ఫస్ట్ గ్లింప్స్ చిత్ర యూనిట్ విడుదల చేసింది.

ఓట్ల తొలగింపులకు కారణాలేమిటి?

- 65 లక్షల మంది వివరాలు 19వ తేదీలోగా ప్రచురించాలి
- బీహార్ ఎస్ఐఆర్ ప్రక్రియపై ఇసికి సుప్రీంకోర్టు ఆదేశం
- ఆన్‌లైన్‌లో పొందుపరుస్తామని ఇసి వెల్లడి



న్యూఢిల్లీ : బీహార్ శాసనసభ ఎన్నికల నేపథ్యంలో ప్రత్యేకంగా చేపట్టిన ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రకియలో తొలగించిన ఓటర్ల వివరాలను ప్రచురించాలని, ఎందుకు తొలగించాల్సివచ్చిందో ఆ కారణాలను కూడా వివరించాలని కేంద్ర ఎన్నికల సంఘానికి సుప్రీంకోర్టు ఆదేశాలు జారీ చేసింది. ఎస్ఐఆర్‌ను సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లపై గురువారం కూడా విచారణ కొనసాగింది. 2025 ఓటర్ల జాబితాలో వుండి ఎస్ఐఆర్ ప్రక్రియ అనంతరం ప్రచురించిన ముసాయిదా జాబితాలో 65 లక్షల మంది పేర్లు గల్లంతయ్యాయి. తొలగింపునకు గురైన ఈ 65 లక్షల మంది ఓటర్ల వివరాలను, అందుకు గల కారణాలను వివరిస్తూ ఈ నెల 19లోపు ప్రత్యేకంగా ప్రచురించాల్సిందిగా సుప్రీంకోర్టు ధర్మాసనం ఇసిని ఆదేశించింది. అలాగే తమ ఆదేశాల అమలుకు తీసుకున్న చర్యలను వివరిస్తూ ఇదే నెల 22 నాటికి ఒక నివేదికను అందచేయాలని కూడా సుప్రీం ఆదేశించింది. మరణించినవారు, ఇతర ప్రాంతాలకు వలస వెళ్ళినవారి వివరాలను ఎందుకు వెల్లడించలేరని ధర్మాసనం ప్రశ్నించింది. ఆ పేర్లను బయటకు ప్రకటిస్తే వారు 30 రోజుల్లోగా పరిష్కారానికి చర్యలు తీసుకునేందుకు అవకాశం వుంటుందని పేర్కొంది. కాగా, మరణాలు, వలసలు వంటి కారణాలతో బీహార్‌లో ముసాయిదా ఓటర్ల జాబితా నుండి తొలగించిన 65 లక్షల మంది ఓటర్ల జాబితాను ఆన్‌లైన్‌లో అందుబాటులో వుంచుతామని ఎన్నికల కమిషన్ గురువారం సుప్రీం కోర్టుకు తెలియచేసింది. పదేపదే న్యాయస్థానం కోరుతున్న నేపథ్యంలో ఇసి ఈ నిర్ణయం తీసుకుంది.

విచారణ సందర్భంగా ఎన్నికల కమిషన్ తరపున వాదనలు వినిపిస్తున్న సీనియర్ న్యాయవాది రాకేష్ ద్వివేది మాట్లాడుతూ, ఈ జాబితా ఇప్పటికే రాజకీయ పార్టీల పోలింగ్ కేంద్రాల ఏజెంట్లకు అందచేసినట్లు చెప్పారు. ఇప్పుడు ఆన్‌లైన్‌లో కూడా పెట్టనున్నట్లు తెలిపారు. ఆన్‌లైన్‌లో పెట్టిన తర్వాత ఎపిక్ (ఎన్నికల ఫోటో గుర్తింపు కార్డు) నెంబరుతో సెర్చ్ చేసి ఓటర్లు వివరాలు తెలుసుకోవచ్చన్నారు.

ప్రతి జిల్లా ఎన్నికల అధికారి వెబ్‌సైట్‌లోనూ అలాగే రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వెబ్‌సైట్‌లోనూ ఈ వివరాలు పెట్టాలని జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోమాల్యా బాగ్చిలతో కూడిన బెంచ్ ఆదేశాలు జారీ చేసింది. ఓటరు పేరును ఎందుకు తొలగించారో కారణాలను కూడా ఆ జాబితాలో వెల్లడిస్తారు. దీనికి తోడు పంచాయితీ భవనాల్లో లేదా బిడిఓ కార్యాలయాల్లో నోటీసు బోర్డుల్లో కూడా ఈ వివరాలను అందుబాటులో వుంచాల్సి వుంటుందని, తద్వారా ప్రజలకు అందుబాటులో వుంటుందని కోర్టు పేర్కొంది.

పబ్లిక్ నోటీసుల ద్వారా ఈ మొత్తం ప్రక్రియకు బాగా ప్రచారం కల్పించాల్సిందిగా ఎన్నికల కమిషన్‌ను బెంచ్ కోరింది. బీహార్‌లో బాగా సర్క్యులేషన్‌లో వుండే ఇంగ్లీషు దినపత్రికల్లో ప్రచురించాలని కోరింది. అలాగే దూరదర్శన్‌లో, ఆకాశవాణిలో కూడా ప్రసారం చేయాలని ఆదేశించింది. జిల్లా ఎన్నికల అధికారికి సోషల్ మీడియా హ్యాండిల్ ఏదైనా వుంటే అందులో కూడా ఈ జాబితాను ప్రదర్శించాలని బెంచ్ కోరింది.

టి20 కెప్టెన్‌గా శుభ్‌మన్

- గాయంతో ఆసియాకప్‌కు సూర్యకుమార్ దూరం?
- జట్టు ఎంపికపై సెలెక్షన్ కమిటీ కసరత్తు



ముంబయి: ఆసియా కప్ 2025 టీమిండియా టి20 కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ దూరమయ్యాడు. సూర్యకుమార్ యాదవ్ జపాన్ పర్యటనకు వెళ్లడంతో అనేక సందేహాలకు దారితీస్తోంది. హెర్నియా సర్జరీ చేయించుకున్న సూర్యకుమార్ యాదవ్ ఇప్పుడిప్పుడే కోలుకుంటున్నాడు. ఈ క్రమంలో సూర్యకుమార్ బెంగళూరులోని నేషనల్ క్రికెట్ అకాడమీలో ప్రాక్టీస్ ప్రారంభించాడు. ఇంతలోనే అతను జపాన్ పర్యటనకు వెళ్లడం చర్చనీయాంశమైంది. సూర్య.. జపాన్‌కు వెళ్లిన విషయాన్ని రోహిత్ జుగ్లన్ అనే ఓ స్పోర్ట్స్ జర్నలిస్ట్ సోషల్ మీడియా వేదికగా వెల్లడించాడు. అయితే అతను అక్కడికి ఎందుకు వెళ్లాడో అనే విషయాన్ని మాత్రం వెల్లడించలేదు. దీంతో సూర్యకుమార్ ఆసియా కప్‌లో ఆడే విషయంపై సందేహాలు నెలకొన్నాయి. సూర్య తన వ్యక్తిగత పనులు మీద జపాన్‌కు వెళ్లాడా? లేక ఏదైనా గాయానికి చికిత్స తీసుకునేందుకా? అనేది స్పష్టం కాలేదు.

అదే నిజమైతే ఇంగ్లండ్ గడ్డపై అద్భుత ప్రదర్శన కనబర్చిన శుభ్‌మన్ గిల్‌కు టి20 సారథ్య బాధ్యతలు అందుకొనే ఛాన్స్ ఉంది. మూడు ఫార్మాట్లకు ఒక్క కెప్టెన్‌ను మాత్రమే నియమించాలని కొందరు మాజీ క్రికెటర్లు సూచిస్తుండగా... బిసిసిఐ రూల్స్ ప్రకారం టీమ్ కెప్టెన్, హెడ్ కోచ్‌తో చర్చించి సెలెక్షన్ కమిటీ జట్టును ఎంపిక చేస్తోంది. కానీ గౌతమ్ గంభీర్ కోచ్‌గా నియామకమైన తర్వాత.. ఈ పరిస్థితి పూర్తిగా మారిపోయింది. రోహిత్ అనంతరం సూర్య టి20 సారథ్య బాధ్యతలు, గిల్ టెస్ట్ టీమ్ కెప్టెన్సీ చేపట్టగా.. గంభీర్ సూచనల మేరకే జట్టును సెలెక్టర్లు ఎంపిక చేశారు. గాయాల బెడదతో బాధపడుతున్న సూర్యకుమార్ యాదవ్‌ను కెప్టెన్సీ బాధ్యతల నుంచి తప్పించే అవకాశాలు ఎక్కువగా ఉన్నట్లు సమాచారం. ఏది ఏమైనా అతని జపాన్ పర్యటన భారత క్రికెట్‌లో కొత్త చర్చకు దారితీసింది. ఈ క్రమంలో ఆసియాకప్‌కు జట్టు ప్రకటనపై ఉత్కంఠ నెలకొంది.

మహారాష్ట్ర జట్టులో పృథ్వీ షాకు చోటు



ముంబయి: ఫస్ట్ క్లాస్ క్రికెట్‌లో మహారాష్ట్ర తరపున అరంగేట్రం చేసేందుకు టీమిండియా ఆటగాడు, ముంబయి మాజీ ఓపెనర్ పృథ్వీ షా సిద్ధమవుతున్నాడు. బుచ్చిబాబు మల్టీ-డే టోర్నమెంట్-2025లో మహారాష్ట్ర క్రికెట్ అసోసియేషన్(ఎంసిఎ) 17 మంది సభ్యులతో కూడిన జట్టును ప్రకటించింది. ఈ జట్టులో పృథ్వీ షాకు చోటు దక్కింది. 25ఏళ్ల పృథ్వీ షా ఇటీవలే ముంబయి క్రికెట్ అసోసియేషన్‌తో తెగదింపులు చేసుకుని మహారాష్ట్ర తరపున ఆడేందుకు ఒప్పందం కుదుర్చుకున్నాడు. జట్టు కెప్టెన్‌గా అంకిత్ బావ్నేను సెలక్టర్లు నియమించారు. మహారాష్ట్ర జట్టు రంజీ ట్రోఫీ కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్‌ను కాదని బావ్నేకు సెలక్టర్లు అవకాశమిచ్చారు. గత రంజీ సీజన్‌లో త్రిపురతో జరిగిన మ్యాచ్‌లో గైక్వాడ్ గైర్హజరీలో బావ్నేనే జట్టుకు నాయకత్వం వహించాడు. ఈ మిడిల్ ఆర్డర్ బ్యాటర్ మహారాష్ట్ర తరపున అత్యధిక మ్యాచ్‌లు ఆడిన కెప్టెన్లలో రెండో ప్లేయర్‌గా కొనసాగుతున్నాడు. బుచ్చిబాబు టోర్నీ ఆగస్టు 18 నుంచి ప్రారంభం కానుంది. మహారాష్ట్ర జట్టు తమ తొలి మ్యాచ్‌లో ఆగస్టు 18 నుండి 20 వరకు ఛత్తీస్‌గఢ్‌తో తలపడనుంది. **జట్టు:** అంకిత్ బావ్నే(కెప్టెన్), గైక్వాడ్, పృథ్వీ షా, సిద్ధేష్ వీర్, సచిన్ దాస్, అర్షిన్ కులకర్ణి, హర్షల్ కేట్, సిద్ధార్థ్ మాత్రే, సౌరభ్ నవాలే(వికెట్ కీపర్), మందార్ భండారి, రామకృష్ణ ఘోష్, ముఖేష్ చౌదరి, ప్రదీప్ దాధే, ప్రదీప్ దద్దే, సోలంకి, హంగర్గేకర్.

'తరుణం' సిద్ధం

యార్లగడ్డ జితేంద్ర, రమ్యశ్రీ జంటగా షేక్ అఫ్జల్ దర్శకత్వంలో తెరకెక్కిన ప్రేమకథా చిత్రం 'తరుణం'. వంశీకృష్ణ కన్నెగంటి, సందీప్ వేపూరి, దిలీప్‌కుమార్ రాజులపాటి,జయరామ్ ప్రధాన పాత్రలు పోషించారు. తెలుగువన్ డాట్‌కామ్ అధినేత కంఠంనేని రవిశంకర్ నిర్మాణ సారథ్యంలో తెరకెక్కింది. టెన్ రూపీస్, తౌజెండ్‌వాలా సినిమాలతో తనకంటూ ఓ గుర్తింపు పొందిన దర్శకుడు షేక్ అఫ్జల్. ఆయనే కథ, కూర్పు, దర్శకత్వం వహించిన ఈ 'తరుణం' సినిమా త్వరలో విడుదల కానుంది. డిఒపి , సంగీతం వంశీకాంత్ రేఖాన. త్వరలోనే ఈ సినిమా విడుదల కానుంది.

నేడు 'వందేమాతరం' విడుదల

రత్నం మూవీ క్రియేషన్స్ ఆధ్వర్యంలో ప్రముఖ సినీనటుడు శోభన్‌బాబు మేనల్లుడు శోభన్ రాజా ప్రధాన పాత్రలో, ప్రతినాయకుడిగా జయరాజు-సూర్యభాయ్ విభిన్నమైన పాత్రలో నటించిన చిత్రం 'వందేమాతరం'. సమసమాజం కోసం పాటుపడే విభిన్నమైన పాత్రలో రాజా నటించారు. ఊర్వశీ ఓటీటీ ద్వారా శుక్రవారంనాడు ఈ సినిమా విడుదల కానుంది. బుధవారం ఈ సినిమా ట్రైలర్ కూడా విడుదలయ్యింది. 76వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఈ సినిమాను విడుదల చేస్తున్నామని దర్శకుడు బి.వి.రత్నం తెలిపారు. సినిమా షూటింగ్ మొత్తం ఆంధ్రప్రదేశ్‌లోనే జరిగిందని తెలిపారు. సహ నిర్మాత కిరణ్‌బాబు జె., మ్యూజిక్ డైరెక్టర్ రాజ్‌కిరణ్, డిఒపిగా బిఎన్ బాబు వ్యవహరించారు.

డిఎస్‌సి స్కోర్ కార్డులు విడుదల

- కన్వీనర్ కృష్ణారెడ్డి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో
సవరించిన టెట్ మార్కులతో డిఎస్‌సి స్కోర్‌కార్డులు విడుదల చేశామని మెగా డిఎస్‌సి కన్వీనర్ ఎంవి కృష్ణారెడ్డి తెలిపారు. ఇప్పటికే విడుదల చేసిన మెగా డిఎస్‌సి - 2025 స్కోరు కార్డులపై అభ్యంతరాలు స్వీకరించామని గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సవరించిన మార్కులతో అనుసంధానించిన స్కోర్ కార్డులను https://apdsc.apcfss.in/ వెబ్‌సైట్‌లో గురువారం పొందుపరిచామని పేర్కొన్నారు. టెట్ మార్కుల స్కోరు కార్డులో ఏవైనా అభ్యంతరాలు ఉంటే అభ్యర్థి తన ఐడి నెంబర్ ద్వారా వెబ్‌సైట్‌లో సొంతంగా సరిచేసుకోవచ్చునని తెలిపారు. ఈ అవకాశం కేవలం శుక్రవారం వరకు మాత్రమే ఉంటుందని వెల్లడించారు.

తెరవెనుక పొత్తులకు జగన్ బ్రాండ్ అంబాసిడర్ : షర్మిల



ప్రజాశక్తి-అమరావతి బ్యూరో
తెరవెనుక పొత్తులకు వైసిపి అధినేత జగన్ బ్రాండ్ అంబాసిడర్ అని పిసిసి అధ్యక్షులు వైఎస్ షర్మిల అన్నారు. ఎఐసిసి పిలుపు మేరకు విజయవాడలోని ఆంధ్రరత్న భవన్ నుంచి ఇందిరాగాంధీ విగ్రహం వరకూ క్యాండిల్ ర్యాలీని గురువారం రాత్రి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మోడీ, అమిత్ షాలతో జగన్‌దే హాట్ లైన్ టచ్ అని పేర్కొన్నారు. చంద్రబాబుతో రాహుల్ గాంధీ హాట్ లైన్ టచ్‌లో లేరని తాము హామీ ఇస్తామని, మోడీతో టచ్‌లో లేనని జగన్ ప్రమాణం చేయాలన్నారు. దేశ పౌరుల కోసం, భారత రాజ్యాంగాన్ని కాపాడే పోరాటం రాహుల్ గాంధీ చేస్తున్నట్లు చెప్పారు. సొంత పార్టీ నేతలు తప్పులు చేసి జైలుకు వెళితే వారిని పరామర్శించేందుకు జగన్ మాదిరిగా రాహుల్ వెళ్లడం లేదన్నారు. జగన్‌ది నీతిమాలిన రాజకీయమని, మోడీకి వంగి, వంగి దండాలు పెట్టారని విమర్శించారు. బిజెపి తీసుకువచ్చిన అన్ని బిల్లులకు మద్దతు ఇచ్చారన్నారు. ఓటు చోరీపై పార్లమెంట్‌లో వివాదం జరుగుతుంటే జగన్ ఎందుకు నోరు మెదపరని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షులు జెడి శీలం, మస్తాన్ వలీ, పార్టీ నాయకులు నరహరిశెట్టి నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

వెసీ పేస్ కన్నుమూత



కోల్‌కతా: భారత హాకీ జట్టు మాజీ ఆటగాడు, లియాండర్ పేస్ తండ్రి వెసీ పేస్(80) కన్నుమూశారు. గురువారం ఆయన తుది శ్వాస విడిచినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. వెసీ పేస్ కొంతకాలంగా పార్కిన్సన్ వ్యాధితో బాధపడుతున్నారు. కోల్‌కతాలోని సిటీ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. భారత క్రీడా చరిత్రలో వెసీ పేస్‌కు ప్రత్యేక స్థానం ఉంది. భారత హాకీ జట్టులో ఆయన మిడ్‌ఫీల్డర్‌గా ఆడాడు. ఫుట్‌బాల్, క్రికెట్, రగ్బీలాంటి అనేక క్రీడల్లోనూ వెసీ పేస్‌కు ప్రావీణ్యం ఉంది. 1996 నుంచి 2022 వరకు ఇండియన్ రగ్బీ ఫుట్‌బాల్ యూనియన్ అధ్యక్షుడిగా ఉన్నారు. స్పోర్ట్స్ మెడిసిన్ డాక్టర్‌గా కూడా ఆయనకు గుర్తింపు ఉంది. అనేక క్రీడా సంఘాలకు మెడికల్ కన్సల్టెంట్‌గా పనిచేశారు. ఆసియా క్రికెట్ మండలి, బిసిసిఐ, డేవిస్ కప్ జట్టుకు మెడికల్ కన్సల్టెంట్‌గా చేశారు. 1972లో మ్యూనిచ్‌లో జరిగిన ఒలింపిక్స్ భారత జట్టుకు ఆయన ప్రాతినిధ్యం వహించారు. ఆ మెగా క్రీడల్లో ఇండియా హాకీ జట్టుకు కాంస్య పతకం దక్కింది. దిగ్గజ టెన్నిస్ ప్లేయర్ లియాండర్ పేస్ తండ్రి ఈయనే.

బాష్‌కు మందలింపు : ఐసిసి

దుబాయ్: అంతర్జాతీయ క్రికెట్ మండలి(ఐసిసి) దక్షిణాఫ్రికా ఆల్‌రౌండర్ కార్బిన్ బాష్‌ను ఐసిసి మందలిం చింది. ఆస్ట్రేలియాతో జరిగిన మూడో టి20 సందర్భంగా ఆసీస్ బ్యాటర్ డ్వారుషీని ఔట్ చేసిన తర్వాత చేత్తో పెవిలి యన్ దారి చూపిస్తూ అవేశంగా సంబరాలు చేసుకున్నాడు. అంతేకాదు అతడు అసభ్యకరంగా కొన్ని మాటలు కూడా అనడం వీడియోలో రికార్డు అయింది. దీంతో సఫారీ పేసర్ తీరును తప్పుబట్టిన రిఫరీ ఐసిసి క్రమశిక్షణ కమిటీకి ఫిర్యాదు చేయగా.. ఐసిసి నియమావళిలోని ఆర్టికల్ 2.5 ప్రకారం అతడికి ఒక డీమెరిట్ పాయింట్ విధించింది.

చర్చల పేరుతో కాలయాపన!

అసంబద్ధ షరతులతో నిర్మాతలు : పోరుబాటలో కార్మికులు

టాలీవుడ్‌లో నెలకొన్న వివాదాన్ని మీరే పరిష్కరించుకోవాలంటూ ఇరు తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు సూచించిన క్రమంలో చర్చలు దిశగా నిర్మాతల మండలి, కార్మికుల ఫెడరేషన్ మధ్య చర్చలు జరుగుతున్నాయి. మొత్తం నాలుగు షరతులను నిర్మాతల మండలి పెట్టగా వాటిలో రెండు గతం నుంచి అమలవుతున్నవే. మిగతా రెండు షరతుల మధ్య ఏకాభిప్రాయం కుదరలేదు. ఇప్పట్లో కుదిరేలానూ లేదు. ఎందుకంటే మరో మూడు, నాలుగు విడతల చర్చలు జరగందే ఈ వివాదం ముగిసే అవకాశం లేదన్నట్లుగా తెలంగాణా సినిమా పరిశ్రమాభివృద్ధి సంస్థ చైర్మన్, నిర్మాత దిల్‌రాజు వెల్లడించారు.

విభజన చేయొద్దని ఫెడరేషన్ డిమాండ్

నాలుగు షరతుల్లో ఒకటైన నిర్మాతలకు ఇష్టమైన వారిని పనుల్లో పెట్టుకోవటం. నాన్ టెక్నికల్ పనుల్లో నిపుణులను వినియోగించుకునే అవకాశం. వీటికి ఇరువైపుల నుంచి సమ్మతమే. స్టంట్ మాస్టర్స్, ఫైటర్స్, టెక్నీషియన్ల వేతనాలు పెంచబోమని నిర్మాతల మండలి మూడో ప్రతిపాదన. దీనిని ఫెడరేషన్ తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. అందరికీ పెంచుతామని, వీరికి పెంచపోతే ఎలా? పెంచాల్సిందే.. అంటూ డిమాండ్‌చేస్తోంది. ఈ విషయంలో ప్రతిష్టంభన ఏర్పడింది. ఇక నాలుగోది. అతి కీలకమైంది కూడా.

రూ.2000 వేతనాల్లోపు ఇచ్చే వారికి 30 శాతం పెంపుదల చేస్తామని నిర్మాతలు చెప్పగా, ఫెడరేషన్ కూడా అంగీకరించింది. గతంలో కొన్నేళ్లుగా ఉదయం 6 నుంచి సాయంత్రం 6 గంటల వరకూ కాల్షీట్లు కొనసాగుతున్నాయి. ఉదయం ఆరుగంటలకే సెట్‌కు వెళ్లాలంటే కార్మికులు తమ ఇళ్ల వద్ద నుంచి తెల్లవారుజామున 3 గంటలకే సిద్ధం కావాలి. అప్పటి నుంచి రాత్రి ఇంటికి వచ్చే వరకూ ఏ సమయం అవుతుందో తెలియదు. తాజాగా నిర్మాతల మండలి ఉదయం 9 నుంచి రాత్రి 9 గంటల వరకూ పనిచేయాలని చెబుతున్నారు. చేయటానికి అంగీకారమే. కానీ ఉదయం, సాయంత్రం అదనపు సమయం వెచ్చించాల్సివస్తోంది. దీని సంగతేంటీ?. సమయాలు మార్చితే రోజున్నర వేతనం చెల్లించా ల్సిందేనంటూ కార్మిక నాయకత్వం స్పష్టంచేసింది. ఉదయం ఆరు గంటలకు అంటే ఆలస్యంగా వస్తున్నారనీ, సమయం మారుస్తున్నామనీ, ఇప్పుడు కొత్త ప్రతిపాదన మేము పెడితే అదనపు వేతనం అడుగుతారా? అంటూ నిర్మాతల మండలి ప్రతినిధులు వ్యతిరేకిస్తున్నారు.

కొనసాగుతున్న ప్రతిష్టంభన

గత 11 రోజులుగా కొనసాగుతున్న కార్మికుల ఆందోళనతోనూ, మరో వైపు వర్షాలతోనూ హైదరాబాద్‌లో దాదాపుగా అన్ని షూటింగులు ఆగిపోయాయి. గతంలో అడపా దడపా జరిగేవి. బుధవారం నిర్మాతల మండలి ప్రతిపాదనలు తెలుసుకున్న డబ్బింగ్, మేకప్ ఆర్టిస్టులు, డ్రైవర్లు, టెక్నీషియన్లు తాము కూడా ఇక సినిమా పనులకు వెళ్లకూడదని నిర్ణయించుకున్నారు. డబ్బింగ్, మిక్సింగ్, రికార్డింగ్ వంటి పనులు కూడా పూర్తిగా మూతపడ్డాయి. నిర్మాతల మండలి పిలిస్తే సమావేశాలకు, చర్చలకు వెళ్లటానికి సిద్ధమేనని ఫెడరేషన్‌లోని 24 క్రాఫ్ట్‌ల పరిధిలోని నాయకులు స్పష్టం చేస్తున్నారు. కొత్త అగ్రిమెంట్ కుదిరే వరకూ షూటింగ్ పనులకు వెళ్లేది లేదంటూ స్పష్టంచేస్తున్నారు.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68